PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 347 | విజయవాడ, శుక్రవారం 18 జులై 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 18 July 2025 | Rs

సెప్టెంబర్ 7న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పరీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అటవీశాఖలోని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సెప్టెంబర్ 7న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఎపిపిఎస్‌సి కమిషన్ కార్యదర్శి పి రాజబాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అటవీశాఖలో ఖాళీగా ఉన్న 256 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, 435 అసిస్టెంట్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఈ నెల 14న నోటిఫికేషన్ విడుదలైంది. సెప్టెంబర్ 7 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహిస్తారు.

అదరగొట్టిన దీప్తి

- తొలి వన్డేలో ఇంగ్లండ్‌పై భారత్ విజయం

సౌథాంప్టన్ : ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న భారత మహిళలజట్టు అదరగొడుతోంది. టి20 సిరీస్‌ను తొలిసారి కైవసం చేసుకొన్న హర్మన్‌ప్రీత్ సేన.. వన్డే సిరీస్‌లోనూ సత్తా చాటింది. రోజ్ బౌల్ వేదికగా జరిగిన తొలి వన్డేలో భారతజట్టు నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఇంగ్లండ్ మహిళల నిర్దేశించిన 259 పరుగుల లక్ష్యాన్ని 48.2 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. దీప్తి శర్మ (62నాటౌట్) ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చి టీమిండియా గెలుపులో కీలకపాత్ర పోషించింది. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది. సోఫీ డంక్లీ (83), డేవిడ్సన్ రిచర్డ్స్(53) అర్ధ శతకాలతో రాణించగా.. స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్ రెండేసి వికెట్లతో, శ్రీ చరణి, అమన్‌జ్యోత్‌కు ఒక్కో వికెట్ పడగొట్టి కట్టడి చేశారు. ఛేదనలో భాగంగా టీమిండియా ఓపెనర్లు ప్రతిక రావల్(36), మంధాన (28), హర్లీన్ (27), రోడ్రిగ్స్ (48)కి తోడు అమన్‌జ్యోత్ కౌర్ (20నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో భారతజట్టు 48.2ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 262పరుగులు చేసి ఘన విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దీప్తి శర్మకు లభించగా.. మూడో వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యతలో ఉంది. రెండో వన్డే లార్డ్స్ వేదికగా శనివారం జరగనుంది.

'హంద్రీనీవా' వచ్చే ఏడాది చిత్తూరుకు

మల్యాల ఎత్తిపోతల నుంచి 3 గేట్లద్వారా దిగువకు వెళ్తున్న నీటిని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

హెచ్‌ఎన్ఎస్ఎస్‌కు నీటివిడుదలలో సిఎం ప్రకటన

- కేంద్రం ఇచ్చినప్పుడే 'అన్నదాతా సుఖీభవ'
- లోకేష్ 'సీమ డిక్లరేషన్'ను అమలు చేస్తాం
- ఆగస్టు 20లోగా మెగా డిఎస్‌సి నియామకాలు

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

హంద్రీనీవా నీటిని వచ్చే ఏడాది చిత్తూరుకు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. గురువారం ఆయన నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల ఎత్తిపోతల పథకం నుండి హంద్రీనీవా ప్రధాన కాలువకు సాగు నీటిని విడుదల చేశారు. తొలుత ఢిల్లీ నుండి విమానంలో ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి... అక్కడి నుండి హెలికాప్టర్‌లో అల్లూరు హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అనంతరం మల్యాల లిఫ్ట్ ఇరిగేషన్ వద్దకు వెళ్లి జలహారతి ఇచ్చి మూడు పంపుల ద్వారా హంద్రీనీవా ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ అడవిపల్లి రిజర్వాయర్‌ను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి చిత్తూరుకు నీటిని తరలిస్తామని చెప్పారు. హంద్రీనీవా కాలువ వెడల్పు చేయకపోతే చివరి ఆయకట్టు వరకూ నీళ్లు వెళ్లవని, అందుకే విస్తరణ పనులు చేపట్టామని తెలిపారు. సామర్థ్యాన్ని రెట్టింపు చేశామని, ఆరు లక్షల ఎకరాలకు, 33 లక్షల మంది రైతులకు నీరిచ్చే సౌకర్యం కల్పించామని వివరించారు. ఎనిమిది నెలల్లో గొల్లపల్లి రిజర్వాయర్ పూర్తి చేసి కియా పరిశ్రమను తీసుకొచ్చామన్నారు. అన్నదాతా సుఖీభవ పథకంపై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిదులు జమ చేసిన మిగతా 5లో

అస్సాంలోనూ బుల్డోజ్‌రాజ్

- అటవీ ప్రాంతం సమీపాన హింసాత్మకంగా ఇళ్ల తొలగింపు
- పోలీసు కాల్పుల్లో ఒకరు మృతి, 10 మందికి గాయాలు

7

జల వివాదాల నిపుణుల కమిటీపై
అఖిలపక్ష సమావేశం

- సిపిఎం డిమాండ్
- సమస్యను జఠిలం చేసేలా కేంద్రం తీరు ఉందని విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బనకచర్లపై బుధవారం ఢిల్లీలో జరిగిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం కేంద్ర ప్రభుత్వ శల్యసారధ్యంతో జలవివాదాలను మరింత జటిలం చేసే విధంగా వుందని సిపిఎం రాష్ట్ర కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర జలవనరులశాఖ మంత్రి సిఆర్ పాటిల్ సమక్షంలో జరిగిన సమావేశం బనకచర్ల ప్రాజెక్టు వివాదాన్ని పరిష్కరించకపోగా, గోదావరి, కృష్ణా నదీ జలాల వివాదాల తేనెతుట్టేను కదల్చే విధంగా వుందని రాష్ట్ర కమిటీ అభిప్రాయపడిందని ఆయన తెలిపారు. 'రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్నదానికి భిన్నంగా ఏమి జరిగినా అది రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం చేస్తుంది. ఈ కమిటీ ఆ నిర్ణయానికి లోబడి వ్యవహరించాలి' అని ఆయన కోరారు. తక్షణం అఖిలపక్ష సమావేశం వేసి ఢిల్లీలో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశ వివరాలను, నిపుణుల కమిటీ విధివిధానాలను ప్రజలకు స్పష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తమ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రూ.82 వేల కోట్ల ప్రతిపాదనలతో బనకచర్ల ప్రాజెక్టును మూడు సంవత్సరాల్లో నిర్మిస్తామని కూటమి ప్రభుత్వం గత కొన్ని నెలలుగా పెద్దఎత్తున హడావుడి చేస్తున్న అంశాన్ని ఆయన ప్రస్తావించారు. తెలంగాణ ప్రభుత్వం లేవనెత్తిన అభ్యంతరాలను కేంద్ర ప్రభుత్వ జోక్యం ద్వారా పరిష్కరించుకోనున్నట్లు మీడియాలోనూ వార్తలు వచ్చాయని, ఈ సమావేశంలో అదికూడా చర్చకు రాలేదని తెలిపారు. కృష్ణా జలాల విషయంపై తెలంగాణ ప్రభుత్వం చాలా కాలంగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందని, ఈ నీటిలో తనకు సగభాగం కావాలని డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుండి విద్యుత్ ఉత్పత్తి పేరుతో కనిష్ట నీటిమట్టానికంటే దిగువనున్న నీటిని కూడా తెలంగాణ ప్రభుత్వం తోడేస్తుందని మన రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కూడా విమర్శించిందని తెలిపారు. గోదావరి వరద జలాలను మళ్లించి రాయలసీమలో సాగునీటి వనరులను పెంచడంతో పాటు, కృష్ణా ఆయకట్టు స్థిరీకరణకు పోలవరం- బనకచర్ల ప్రాజెక్టు నిర్మించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతూ వచ్చిన విషయాన్ని ఆయన పేర్కొన్నారు. బనకచర్ల భారమని దానికంటే ముందు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని సిపిఎం డిమాండ్ చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ కూడా బనకచర్ల ప్రాజెక్టు అసాధ్యమని తేల్చిందని వివరించారు. బనకచర్లపై రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని ఆసరా చేసుకొని కేంద్రం కృష్ణా, గోదావరి జలాల సమస్యను జఠిలం చేసిందని, రెండు రాష్ట్రాల మధ్య సామరస్యపూర్వకంగా పరిష్కారం కావాల్సిన సమస్యను కేంద్ర ప్రభుత్వ దుర్బుద్ధితో జఠిలం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం తలూపి రావడం శోచనీయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా వెనుకబడిన ప్రాంతాల ప్రాజెక్టుల సమస్యలపై దృష్టి పెట్టి పూర్తి చేయాలని డిమాండు చేశారు.

నిర్లక్ష్యం తగదు

- హామీలు అమలు చేయాల్సిందే
- మున్సిపల్ కమిషనరేట్ కార్యాలయం వద్ద మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల ధర్నా
- ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె ఉధృతం : కె ఉమామహేశ్వరరావు

5

ఒడిషాలో స్తంభించిన జనజీవనం

- విద్యార్థిని మృతికి నిరసనగా స్వచ్ఛందంగా బంద్
- అది సంస్థాగత హత్యే : బృందాకరత్

7

66 అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలకు చైర్మన్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 66 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పేర్లను కూటమి పార్టీలు ఖరారు చేశాయి. ఇందుకు సంబంధించిన జాబితాను గురువారం విడుదల చేశాయి. మొత్తం 66లో టిడిపికి 53, 9 జనసేన పార్టీకి, 4 బిజెపికి చొప్పున కేటాయింపులు జరిగాయి. 66 చైర్మన్ పదవుల్లో 17 మంది బిసిలకు, 10 మంది ఎస్‌సిలకు, ఐదుగురు ఎస్‌టిలకు, ఐదుగురు మైనార్టీలకు కేటాయించారు. 35 చోట్ల మహిళలకు అవకాశం కల్పించారు.

తిరుమలలో ఐఒసిఎల్ గ్యాస్ స్టోరేజ్ కేంద్రం

- భూమిపూజ చేసిన టిటిడి చైర్మన్

ప్రజాశక్తి -తిరుమల

భవిష్యత్ అవసరాల నిమిత్తం తిరుమల అవుటర్ రింగ్ రోడ్డులో 45 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గ్యాస్ స్టోరేజ్ కేంద్ర నిర్మాణాన్ని తలపెట్టారు. ఇందులో భాగంగా గ్యాస్ స్టోరేజ్ కేంద్రానికి గురువారం టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... గత రెండు దశాబ్దాలుగా ఐఒసిఎల్ సంస్థ టిటిడికి నిరంతరాయంగా ఎల్‌పిజిని సరఫరా చేస్తోందని, ఇకపై 30 సంవత్సరాల పాటు ఎల్‌పిజి సరఫరాకు టిటిడి-ఐఒసిఎల్ మధ్య ఒప్పందం కుదిరిందని తెలిపారు. రూ.8.13 కోట్ల వ్యయంతో 1.86 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్లాంట్‌ను ఆరు నెలల్లో పూర్తి చేస్తామని ఐఒసిఎల్ ప్రకటించిందన్నారు. ఈ గ్యాస్‌ను లడ్డూ ప్రసాదాలు, అన్నప్రసాదాల తయారీకి వినియోగించనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టుల వల్ల టిటిడికి సంవత్సరానికి రూ.1.5 కోట్ల ఆదా అవుతుందని తెలిపారు. ఐఒసిఎల్ మార్కెటింగ్ డైరెక్టర్ వి.సతీష్ కుమార్ మాట్లాడుతూ.. ఇప్పటికే తిరుమల డంపింగ్ యార్డు వద్ద రూ.12.05 కోట్ల వ్యయంతో బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం జరుగుతోందన్నారు. ప్రతి రోజు వచ్చే 55 టన్నుల తడి వ్యర్థాలలో 40 టన్నులు ఐఒసిఎల్ ప్లాంటుకు తరలించి రోజుకు వెయ్యి కేజీల బయో గ్యాస్‌ను ఉత్పత్తి చేయనున్నామని తెలిపారు.

బనకచర్లపై బాబుకు అంత ప్రేమెందుకు?

- పిసిసి చీఫ్ షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అందరూ వద్దంటున్న పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై సిఎం చంద్రబాబుకు అంత ప్రేమ ఎందుకో అర్థం కావట్లేదని పిసిసి చీఫ్ వై.ఎస్ షర్మిల అన్నారు. ఈ మేరకు గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ ప్రాజెక్టుతో లక్షల కోట్ల రూపాయల ఖర్చు తప్ప ప్రయోజనం లేదని ఇంజినీర్లు చెబుతున్నారని పేర్కొన్నారు. బనకచర్ల లింక్ ప్రతిపాదన పోలవసరం అసలు ప్రాజెక్టుకు ఎసరు పెడుతుందని ప్రాజెక్టు అథారిటీ చెబుతున్నా, చంద్రబాబు తలకెక్కడం లేదన్నారు. 2014లో వైఎస్ఆర్ ప్రారంభించిన జలయజ్ఞంలో దాదాపు 39 ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ పదేళ్లలో ప్రభుత్వాలు తట్టెడు మట్టి తియ్యలేదని పేర్కొన్నారు. సుమారు రూ.40 వేల కోట్లు వెచ్చిస్తే ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయి 50 లక్షల ఎకరాలకు అదనంగా సాగునీరు, కోటి మందికి తాగునీరు అందుతాయని తెలిసినా కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం బాధాకరమన్నారు.

జగన్ వ్యాఖ్యలు సరికాదు

- ఎపి పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలీసు ఉన్నతాధికారులను మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మాఫియా డాన్‌లతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలు సరికాదని, తమ సంఘం తీవ్రంగా ఖండిస్తోందని ఎపి పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసరావు పేర్కొన్నారు. విజయవాడలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటివన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వ హయాంలో కూడా తామే పని చేశామని గుర్తు పెట్టుకోవాలన్నారు. వైసిపి నేతలు, కార్యకర్తలను బెదిరించేందుకే పోలీసులు పని చేస్తున్నారని చేసిన ఆరోపణలు అర్థరహితమన్నారు వైసిపి అధికారంలోకి వస్తే విఆర్‌లో పెడతామని బెదిరిస్తున్నారని ఇది సరైన చర్య కాదన్నారు. సిద్ధార్థ్ కౌశల్ వ్యతిగత కారణాలతో రాజీనామా చేస్తే దానిని కూడా రాజకీయం చేస్తున్నారని చెప్పారు. వ్యవస్థలో లోపాలు ఉంటే ఎత్తి చూపాలని, న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చునని, అంతేతప్ప నిందారోపణలు చేయడం తగదని అన్నారు.

కన్నబిడ్డపై తండ్రి లైంగిక దాడి

- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

ప్రజాశక్తి - యర్రావారిపాలెం

కన్నబిడ్డపై తండ్రి లైంగిక దాడికి పాల్పడిన ఘటన తిరుపతి జిల్లా యర్రావారిపాలెం మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితున్ని కరెంట్ స్తంభానికి కట్టేసి గ్రామస్తులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. చింతగుంట గ్రామపంచాయతీ అరుంధతివాడలో మాతమ్మ జాతర జరుగుతోంది. గ్రామస్తులు జాతరలో నిమగ్నమై ఉండగా భార్యతో గొడవపడి అదే ఊరిలో ఉన్న తన అత్తారింటికి వెళదామని కుమార్తెను (13) తండ్రి బలవంతం చేశాడు. దీంతో రెండు నెలలుగా తనపై లైంగిక దాడి చేస్తున్నాడని, ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడని తల్లికి ఆ బాలిక విషయం చెప్పింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు నిందితుడు మునిరాజను కరెంట్ స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మునిరాజపై పోక్సో కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి లక్ష్మి, ఈశ్వరమ్మ డిమాండ్ చేశారు.

పర్యాటక పిపిపి ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ భూములు సేకరించండి

- ఎస్ఐపిబి సమావేశంలో సిఎం చంద్రబాబు
- రూ.39,473 కోట్ల పెట్టుబడులకు ఆమోదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్(పిపిపి) విధానంలో చేపట్టే పర్యాటక ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ భూములను సేకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. 8వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలంలో దేవాలయంతో పాటు భారీ నీటి ప్రాజెక్టు ఉందని తెలిపారు. ఎక్కువ మంది పర్యాటకులను ఆకట్టుకునేందుకు ఆస్కారం ఉండేలా సమీకృత పర్యాటక ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని చెప్పారు. కేవలం నిర్దేశిత ప్రాజెక్టుకు మాత్రమే పరిమితం కావొద్దని, అనుబంధ కార్యకలాపాలు వచ్చేందుకు అవకాశం కల్పించాలని సూచించారు. సర్వీసు సెక్టార్ కూడా వచ్చేలా ప్రాజెక్టులను ఇంటిగ్రేట్ చేయాలని స్పష్టం చేశారు.రాష్ట్రంలో ఏర్పాటవుతున్న పారిశ్రామిక ప్రాజెక్టుల చుట్టూ సంబంధిత ఎకో సిస్టం వచ్చేలా చూడాలని చెప్పారు. ఎకో సిస్టం ద్వారా ఆయా ప్రాజెక్టులతో పాటు స్థానికులు, అనుబంధ సంస్థలకూ లబ్ధి కలుగుతుందని అన్నారు. పారిశ్రామిక ప్రాజెక్టులకు సమీపంలో రహదారులు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు వంటి మౌలిక సదుపాయాలతో పాటు ఆ ప్రాంతంలో ఎకనామిక్ యాక్టివిటీ పెరిగేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఎంతమందికి ఉద్యోగాలను కల్పించామో వివరాలు



తెలిసేలా ఎంప్లాయిమెంట్ పోర్టల్ రూపొందించాలని ఆదేశించారు. ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంధన, పర్యాటక రంగాలకు సంబంధించిన రూ.39,473కోట్ల పెట్టుబడులకు ఈ సమావేశంలో ఆమోదించారు. మొత్తం 22 ప్రాజెక్టుల ద్వారా 30,899 మందికి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని అంచనా వేశారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, నారా లోకేష్, కె అచ్చెన్నాయుడు, టిజి భరత్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తదితరులు హాజరయ్యారు.

కల్తీపై నిఘాను పటిష్టం చేయండి

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కల్తీ ఆహార పదార్థాలు, నాణ్యత లోపించిన మందులపై నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ.. ఆహార పదార్థాల్లో కల్తీని అరికట్టే ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపిఎం), కల్తీ మందుల సరఫరాను నియంత్రించే డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డిసిఎ) విభాగాల్లో వివిధ శ్రేణుల్లో ఉన్న ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని సూచించారు. కల్తీ ఆహార పదార్థాలు, మందుల సరఫరాకు పాల్పడే వారిలో భయాన్ని కలిగించేలా తరచూ తనిఖీలు చేపట్టాడానికి నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని, ఆ దిశగా కార్యాచారణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎన్ఫోర్స్‌మెంట్ విషయంలో ఎంతో ప్రాధాన్యత కలిగిన ఐపిఎం, డిసిఎ విభాగాలకు దీర్ఘకాలంగా రెగ్యులర్ విభాగాధిపతులు లేకపోవడంతో ఈ శాఖల పనితీరు ఆశించిన స్థాయిలో లేదన్నారు. డిజిపి స్థాయి పోలీసు అధికారి ఆధ్వర్యంలో డిసిఎ పని చేయాల్సి ఉన్నందున, ఉన్నతాధికారుల కొరత ఉన్న నేపథ్యంలో ఐజి స్థాయి అధికారిని డైరెక్టర్ జనరల్‌గా డిసిఎకు నియమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఐపిఎంకు డైరెక్టర్ పోస్ట్ మంజూరు కానందున ఖాళీ పోస్టులను సరండర్ చేసి డైరెక్టర్ పోస్ట్ సృష్టించాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలను మరింత మెరుగుపరచడానికి వివిధ స్థాయిల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి సమగ్ర నియామక ప్రణాళికను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో హైబ్రిడ్ పద్ధతిలో యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ పథకం, పిపిపి విధానంలో కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్వహణ, ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో 100 పడకల స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాలకు సంబంధించి చేపట్టాల్సిన చర్యల్ని శీఘ్రతరం చేయాలన్నారు.

జీవనసాయి ఆత్మహత్యకు కారకులను శిక్షించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నారాయణ విద్యా సంస్థల వేధింపులు తాళలేక ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి జీవనసాయి ఆత్మహత్యకు పాల్పడటం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు పేర్కొన్నారు. . ఈ మేరకు గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని, విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. తమ కుమారుడి మృతికి కళాశాల యాజమాన్యమే కారణమని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. పైగా ప్రశ్నించిన విద్యార్థి సంఘాల నాయకులపై కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. ర్యాంకుల పేరుతో విద్యార్థులపై ఒత్తిడి చేస్తుండటంతో కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పట్టించుకోకపోగా కార్పొరేట్ కళాశాలలకు వంత పాడుతోందని విమర్శించారు. విద్యార్థి మరణానికి కారణమైన నారాయణ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.

విశాఖలో జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యుని పర్యటన

- సంఘాలు, ఉద్యోగుల నుంచి వినతుల స్వీకరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ జిల్లాలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ గురువారం పర్యటించారు. తొలుత హెచ్‌పిసిఎల్ అతిథి గృహం వద్ద పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎస్‌సి ఉద్యోగులు, సంఘాల నుంచి వినతులు స్వీకరించారు. ఎస్‌సి కమిషన్ ఆదేశాలు పాటించని అధికారులపై అట్రాసిటీ చట్టం సెక్షన్ 4 కింద కేసులు పెట్టాలని విశాఖ దళిత సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు కోరారు. తెనాలి, విశాఖ ప్రాంతాల్లోని జైలు డెత్ ఘటనల్లో కొందరు అధికారులు కమిషన్ ఉత్తర్వులు లెక్కచేయకుండా దోషులను కాపాడుతున్నారన్నారు. తెనాలిలో దళిత యువకులను నడిరోడ్డు మీద కొట్టిన ఘటనలో పోలీసులపై ప్రభుత్వం ఇంకా చర్యలు తీసుకోలేదన్నారు. మల్లంలో సాంఘిక బహిష్కరణపై కేసు కూడా నమోదు చేయలేదన్నారు. గతేడాది విశాఖ సెంట్రల్ జైల్లో గౌరీ శంకర్ మృతి కేసులో బాధ్యులపై నేటికీ చర్యలు తీసుకోలేదన్నారు. అనంతరం రామచందర్ గాజువాక సమీపంలోని బిహెచ్ఇఎల్ కంపెనీని సందర్శించి, ప్రాంగణంలో మొక్క నాటారు. అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమై సమస్యలను తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్‌సి కమిషన్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

రెండోదశ పూలింగుకు ఈనెలాఖరులోపు నోటిఫికేషన్ !

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రాజధాని నగర విస్తరణలో భాగంగా రెండో దశ భూ సమీకరణకు ఈ నెలాఖరులోపు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిసింది. ఈనెల 24, 25 తేదీల్లో నోటిఫికేషన్ ఇవ్వడానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు అధికారవర్గాల ద్వారా తెలిసింది. అనుకోని పరిస్థితులు ఎదురైతే తప్ప ఎట్టి పరిస్థితుల్లోనూ నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి సింగపూర్ వెళ్లే లోపే దీనిపై స్పష్టమైన ప్రకటన రానుంది. ఇటీవల జరిగిన సిఆర్‌డిఎ అథారిటీ సమావేశంలో తుళ్లూరు, అమరావతి మండలాల్లో ఏడు గ్రామాల్లో భూ సమీకరణకు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. జులై 9వ తేదీన జరిగిన క్యాబినెట్ సమావేశంలోనూ దీనికి ఆమోదం లభించింది. ఎపిసిఆర్‌డిఎ చట్టం సెక్షన్ 55లోని సబ్‌సెక్షన్ 2 ప్రకారం సిఆర్‌డిఎ రీజియన్ పరిధిలో భూ సమీకరణ పథకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీనిలో నోటిఫికేషన్ ఎప్పుడు ఇవ్వాలనే తేదీని ఖరారు చేయలేదు. దీంతో పూలింగు జరుగుతుందా లేదా అనే అంశంపై గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో ఈనెలాఖరులోపే పూలింగు నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. దీనికి సంబంధించిన కార్యాచరణ కూడా సిద్ధం చేశారు. ఒక్కో రెవెన్యూ గ్రామానికి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ల నియామక ప్రక్రియను వేగవంతం చేశారు.

బుధవారం ఢిల్లీలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వద్ద సిఎం చంద్రబాబునాయుడు నిర్వహించిన చర్చల్లో ఆర్థికాంశాలపై కొంత స్పష్టత వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా సమీకరణ ప్రక్రియ ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేశారు.

సింగపూర్ పర్యటనలో ప్లానింగే కీలకం

ఈనెల 26వ తేదీ నుండి 30వ తేదీ వరకూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో మంత్రులు నారా లోకేష్, పి.నారాయణ, టి.జి.భరత్, అధికారులు కాటంనేని భాస్కర్, యువరాజు, కార్తికేయ మిశ్రాతోపాటు, ఎకనామిక్ డెవలప్‌మెంట్ సిఇఒ సాయికాంత్ వర్మ, సిఆర్‌డిఎ కమిషనర్ కె.కన్నబాబు సింగపూర్‌లో పర్యటించనున్నారు. ఈ మేరకు ఈనెల 13వ తేదీన ప్రభుత్వం జిఒ 120 విడుదల చేసింది. ఈ పర్యటనలో అర్బన్ ప్లానింగు, బ్యూటిఫికేషన్, గార్డెనింగ్, పోర్టులపై చర్చ ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం అమరావతి ప్లానింగు అంశంపైనే సింగపూర్ ప్రభుత్వంతో రాష్ట్రం చర్చలు జరుపుతోంది. సానుకూల వాతావరణం రావడంతోనే బృందం అక్కడకు బయలుదేరింది. అక్కడ చర్చించే అంశాల్లో అమరావతి ప్లానింగే కీలకంగా ఉంటుందని పట్టణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. గత పూలింగుకు సింగపూర్‌కు చెందిన సుర్బానా కంపెనీయే ప్లానింగు ఇచ్చింది. కొత్తగా సమీకరణకు వెళ్లే ప్రాంతంలో ప్లానింగు చేయాలంటే చట్టపరంగా నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. లేనిపక్షంలో సింగపూర్ ప్రభుత్వం పెద్దగా ఆసక్తి చూపించదు. ఈ నేపథ్యంలో సింగపూర్ వెళ్లేలోపే దీనికి తగిన విధంగా నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది.

అనంతపురం నరగపాలక సంస్థ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాడతాం

- కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-యంత్రాంగం

రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా, జిఒ నంబర్ 36 ప్రకారం వేతనాలు అమలు తదితర డిమాండ్ల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారమూ రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగింది. ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాడతామని కార్మికులు నినదించారు. అనంతపురం కార్పొరేషన్, గుత్తిలో చెవిలో పూలు పెట్టుకొని మోకాళ్లపై నిరసన తెలిపారు. తాడిపత్రిలో అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఏలూరు జిల్లా నూజివీడులోని మున్సిపల్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. శ్రీకాకుళం నగర కార్పొరేషన్, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపల్ కార్యాలయం, పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరాలు కొనసాగాయి. కొవ్వూరులో సమ్మె శిబిరాన్ని సిపిఎం నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం వద్ద మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకు సిఐటియు నాయకులు మద్దతు ప్రకటించారు. విజయవాడలో పారిశుధ్య కార్మికులతో కలిసి ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె నిర్వహించారు. క్లాప్ ఆటో కార్మికులు సైతం సమ్మెకు మద్దతునిచ్చి ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలో మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరాన్ని సిఐటియు నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ మనోజకు పంచాయతీ కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. సమస్యల పరిష్కారం కోసం తాము కూడా ఈ నెల 18 నుండి సమ్మెలోకి వెళుతున్నట్లు తెలిపారు. సూళ్లూరుపేటలో మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులకు తప్పెట కళాకారుల సంఘం, కెవిపిఎస్ నాయకులు మద్దతు ప్రకటించారు. తిరుపతి జిల్లా నాయుడుపేటలో సమ్మె శిబిరం వద్ద మోకాళ్లపై దండం పెడుతూ వినూత్నంగా నిరసన ప్రదర్శన చేశారు.

ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నుంచి గోపి బహిష్కరణ

ఎపి మున్సిపల్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న గోపిని సిఐటియు ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరిస్తున్నట్లు యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి డి.కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మె విచ్ఛిన్నానికి పాల్పడుతూ, కార్మికులకు ద్రోహం చేస్తున్నందున గోపిని బహిష్కరించినట్లు పేర్కొన్నారు. గత కొంతకాలంగా హెచ్చరిస్తూనే ఉన్నా ఎటువంటి మార్పు లేకపోవడంతో ఏకగ్రీవంగా ఈ మేరకు నిర్ణయించినట్లు చెప్పారు.

మారనున్న రాష్ట్రముఖచిత్రం

- బయోడైవర్సిటీ చైర్మన్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

క్వాంటమ్ కంపెనీలు క్యూ కట్టడంతో రాష్ట్రముఖచిత్రం మారబోతుందని రాష్ట్ర బయోడైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ అన్నారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద కంపెనీలు అమరావతి క్వాంటమ్ వ్యాలీకి క్యూ కడుతున్నాయని తెలిపారు. ఐబిఎం, టిసిఎస్‌ల భాగస్వామ్యంతో ప్రారంభమైన ఈ వ్యాలీ ప్రస్థానం మైక్రోసాఫ్ట్ రావడంతో 100 రెట్లు పెరిగిందన్నారు. మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని విమర్శించారు. ఏడాదిలోనే అమరావతి రాజధాని పనులు జరుగుతున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీ పెట్టుబడి పెడతామని చెప్పడం హర్షనీయమని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం క్వాంటమ్ కంప్యూటింగ్ మిషన్ అనేది ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుని, రూ.6వేల కోట్ల నిధులు కేటాయించిందని తెలిపారు..

నిమ్మల ప్రకటన గర్హనీయం

- ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కృష్ణానది నీటియాజమాన్య బోర్డును అమరావతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చేసిన ప్రకటన గర్హనీయమనిఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక నాయకులు తుంగా లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టం 2014 ప్రకారం కృష్ణానది యాజమాన్య బోర్డును ఎపిలో ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. పదకొండేళ్ల గడిచినా ఏర్పాటు చేయలేదని తెలిపారు. గత ప్రభుత్వం ఈ కార్యాలయాన్ని విశాఖపట్నం తరలించేందుకు ఆదేశాలు ఇచ్చిందని వివరించారు. అయితే కృష్ణాబోర్డు కార్యాలయాన్ని కర్నూలులోనే ఏర్పాటు చేయాలని తాము కోరామని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా విజ్ఞప్తి చేశామని ఏడాదైనా పట్టించుకోకుండా ఇప్పుడు అమరావతిలో ఏర్పాటు చేస్తామని చెప్పడం సరికాదని వివరించారు. డిల్లీలో జరిగిన సమావేశంలో బనకచర్లపై చర్చ లేదని తెలంగాణా సిఎం చెబితే సానుకూలత వచ్చిందని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారని, దీనిపై స్పష్టత కల్పించాల్సిన బాధ్యత మంత్రిపై ఉందని అన్నారు. టెలీమెట్రీ విధానం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. శ్రీశైలం ప్లంజ్‌పూల్ మరమ్మతు పనులను తక్షణం చేపట్టాలని నిర్ణయించడం అభినందనీయమని లక్ష్మీనారాయణ తెలిపారు.

పంట పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

కరేడులో భూసేకరణను విరమించుకోవాలి

- రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి -ఉలవపాడు (నెల్లూరు)

కరేడులో బలవంతపు భూసేకరణ ప్రకటనను రద్దు చేయాలని రైతు సంఘం నెల్లూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం రైతు సంఘం నాయకులు కరేడులోని రామకృష్ణాపురం గిరిజన కాలనీ, ఉప్పర పాలెం, పోలేరమ్మ గుడి, కొత్తపల్లె పాలెం, టెంకాయచెట్లపాలెం, భట్టి సోమయ్యపాలెం, అలగాయపాలెం తదితర గ్రామాల్లో పర్యటించారు. తమ ఇళ్లను, భూములను వదిలి వెళ్లేది లేదని రామకృష్ణాపురంలోని రామలక్ష్మమ్మ, లలిత, విజయ్ తెగేసి చెప్పారు. ఎలాంటి పోరాటానికైనా తాము సిద్ధమని నాయకుల ఎదుట తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య మాట్లాడుతూ.. ప్రజాభిప్రాయాన్ని మన్నించి జిఒ నంబర్ 43ను వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్ణాటక రాష్ట్రంలో రైతులు ఏ విధంగా పోరాటం చేశారో అదే విధంగా కరేడు ప్రజలు పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కరేడు ప్రజల పోరాటానికి రైతు సంఘం వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోపసాని రమేష్, రామకృష్ణాపురం నాయకులు పాల్గొన్నారు.తమ పర్యటనలో భాగంగా రామకృష్ణాపరం గిరిజన కాలనీలో రైతు సంఘం నాయకులు సభ నిర్వహించారు. ఈ సభకు గిరిజన సంఘం నాయకులు పొన్నం రామలక్ష్మమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్, మూలి వెంగయ్య, రైతు సంఘం నాయకులు గోపసాని రమేష్, జి వెంకటేశ్వర్లు మాట్లాడారు. పచ్చని పొలాలను ఇండోసోల్ కంపెనీకి ధారాదత్తం చేసి ఎడారిగా మార్చడానికి ప్రయత్నిస్తే పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ప్రభుత్వానికి కార్పొరేట్ ప్రయోజనాలు తప్ప ప్రజల ప్రయోజనాలు పట్టడం లేదని విమర్శించారు. 41 మంది రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కరేడు పోరాట కమిటీ నాయకులు మిరియం శ్రీనివాసులును రైతు సంఘం నాయకులు కలిశారు. కరేడు ప్రజల్ని కాపాడడం కోసం, అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు సహకారం తీసుకుంటామని ఆయన రైతు సంఘం నేతలకు తెలిపారు.

తిరుపతి జిల్లాలో దారుణం

- భార్య, ఇద్దరు పిల్లలను బావిలో తోసి చంపేసిన ఉన్మాది
- అనంతరం తాను ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- రామచంద్రపురం (పాకాల)(తిరుపతి జిల్లా)

కుటుంబ కలహాలతో సైకోగా మారిన ఓ వ్యక్తి తన భార్యను, ఇద్దరు పిల్లలను హత్య చేశాడు. అనంతరం ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ దారుణ ఘటన తిరుపతి జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పాకాల మండలం మద్దినాయనపల్లి దళిత వాడకు చెందిన టి.గిరి, హేమలత (39) 13 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు తనుశ్రీ (12), తేజశ్రీ (8) ఉన్నారు. వీరి కుటుంబం తిరుపతిలో ఉంటోంది. గిరి... ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుమార్తెలను చదివిస్తున్నాడు. ఇటీవల కాలంలో భార్యాభర్తలు తరచూ గొడవ పడేవారు. బుధవారం మధ్యాహ్నం భార్య, ఇద్దరు పిల్లలను తన ద్విచక్ర వాహనంలో ఎక్కించుకుని స్వగ్రామమైన మద్దినాయనపల్లి దళితవాడకు గిరి వచ్చాడు. అక్కడ మరోసారి భార్యాభర్తలు గొడవ పడ్డారు. గురువారం మధ్యాహ్నం మద్దినాయనపల్లి దళితవాడ నుంచి స్కూటర్‌పై భార్య, ఇద్దరు పిల్లలను ఎక్కించుకుని రోడ్డు పక్కనే ఉన్న పాడుబడిన బావి వద్దకు తీసుకెళ్లాడు. అనంతరం వారిని అందులో తోసేశాడు. అటుగా ఓ వ్యక్తి రావడం చూసి తన దగ్గర ఉన్న కత్తితో గొంతు కోసుకుని బావిలో దూకేశాడు. గిరికి ఈత రావడంతో బావి మెట్టు దగ్గరకు వచ్చేశాడు. ఆయన భార్య, ఇద్దరు పిల్లలు మృతి చెందారు. స్థానికులు గిరిని వైద్యం కోసం ఆస్పత్రికి తరలించారు. సిఐ సుదర్శన్ ప్రసాద్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బంది సాయంతో బావిలోని తల్లీకూతుళ్ల మృతదేహాలను వెలికితీశారు. గిరి మానసిక పరిస్థితి గత కొన్నాళ్లుగా సరిగా లేదని, సైకోలా వ్యవహరిస్తున్నాడని బంధువులు తెలిపారు. కేసును సిఐ దర్యాప్తు చేస్తున్నారు.

గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గిరి

మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

బలవంతపు భూసేకరణ చేస్తే భారీ మూల్యం తప్పదు

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో బలవంతంగా భూ సేకరణ చేస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని రాష్ట్రప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం హెచ్చరించింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సారవంతమైన రైతులు, పేదల భూములను ఏరో స్పేస్ పరిశ్రమకు కట్టబెట్టడానికి మంత్రి నారా లోకేష్ అత్యుత్సాహంగా ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏరో స్పేస్ పరిశ్రమ కోసం 8వేల ఎకరాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, అత్యుత్తమ ప్రోత్సాహకాలు, ఆకర్షణీయమైన ఏరో స్పేస్ విధానం తమ వద్ద ఉందని ఎక్స్ వేదికగా ఏరో స్పేస్ కంపెనీని ఆహ్వానించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కర్ణాటకలో గత బిజెపి ప్రభుత్వం 1,777 ఎకరాలు రైతుల నుంచి బలవంతంగా తీసుకుని ఏరోస్పేస్ కంపెనీకి అప్పగించిందని పేర్కొన్నారు. ఈ భూముల కోసం మూడేళ్లుగా రైతులు, పేదలు పోరాడటంతో ప్రస్తుత ప్రభుత్వం తిరిగి రైతులకు వెనక్కి అప్పగించిందని వివరించారు. పరిశ్రమలు పెట్టి ఉపాధి అవకాశాలు కల్పిస్తే ఏ రాష్ట్రంలోనైనా ఏవరూ వ్యతిరేకించరని పేర్కొన్నారు. పరిశ్రమలు, ప్రాజెక్టులు, హైవేలు, విమానాశ్రయాలు పేరుతో అవసరానికి మించి వేలాది ఎకరాలు తీసుకొని వాటిని రియల్‌ఎస్టేట్‌గా మారుస్తున్నారని, కోట్లు సంపాదించేందుకు రాజకీయ నాయకులు, పారిశ్రామిక వేత్తలు కుమ్మక్కై దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రంలో గత వైసిపి, ప్రస్తుత టిడిపి ప్రభుత్వాలు 2013 భూ సేకరణ చట్టాన్ని తుంగలో తొక్కి పదేళ్లల్లో 5లక్షలకు పైగా వివిధ పేర్లతో భూములు తీసుకున్నాయని, వీటిల్లో ఎక్కువ శాతం వృద్ధాగా ఉన్నాయని తెలిపారు. ఇప్పుడు కరేడు, అన్నెమడుగు, ఎస్‌కోట, కుప్పం, అనకాపల్లి వంటి చోట వేలాది ఎకరాలు తీసుకోవడానికి ప్రభుత్వం నోటీసులు ఇచ్చిందని పేర్కొన్నారు. దీనికి వ్యతిరేకంగా రైతాంగం పెద్దఎత్తున పోరాడుతుందని వెల్లడించారు. ఇలాంటి నేపథ్యంలో బెంగుళూరుకు అనుకొని రాష్ట్రంలో 8వేల ఎకరాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు మంత్రి ప్రకటించడం రైతాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పించే ప్రోత్సాహకాలు, పంటల గిట్టుబాటు ధర రైతాంగానికి కలిపిస్తే మూడు రెట్లు అదనంగా ఆ భూముల్లో ఉత్పత్తి పెంచి రాష్ట్రానికి ఆదాయం కల్పిస్తారని సూచించారు. అలా కాకుండా రైతులు భూములను తీసుకొని వ్యాపారం చేసుకోవడానికే టిడిపి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, దీనిని విడనాడకపోతే రైతాంగం తగిన బుద్ధి చెబుతుందని హెచ్చరించారు.

యువత భవిష్యత్తుతో జగన్ చెలగాటం

- శాప్ చైర్మన్ రవినాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని ఎపి క్రీడాప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు విమర్శించారు. విజయవాడలోని శాప్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైస్ జగన్ తన రాజకీయ మనుగడ కోసం యువతను అభద్రతా భావానికి గురిచేస్తున్నారని అన్నారు. జగన్ ఎక్కడ పర్యటన చేసినా హడావుడి, బెదిరింపులే తప్ప అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడిన సందర్భాలు లేవని, పల్నాడు, చిత్తూరు పర్యటనలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతిపక్షం అంటే ప్రజల పక్షాన ఉండి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని జగన్ తీరు దానికి భిన్నంగా ఉందని చెప్పారు.



నిందితుడు షేక్ సమీత్ పుష్ప (ఫైల్)

ప్రియురాలి దారుణ హత్య

- అడ్డొచ్చిన ఆమె తల్లి, అన్న పైనా దాడి

ప్రజాశక్తి - రాజోలు

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. వ్యభిచారం చేసేందుకు ప్రియురాలు అంగీకరించకపోవడంతో ప్రియుడు కత్తితో దారుణంగా పొడిచి హత్య చేశాడు. అడ్డొచ్చిన ఆమె తల్లి, సోదరుడిపైనా దాడి చేశాడు. ఈ సంఘటన రాజోలు మండలం బి.సావరం గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు, మృతురాలి తల్లి గంగ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం ఎనుములంకకు చెందిన ఓలేటి పుష్ప (32)కు కోనసీమ జిల్లా రాజోలు మండలం మేకలపాలెం గ్రామానికి చెందిన ఓలేటి నరేష్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వారికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో పెళ్లైన రెండేళ్లకే పెద్దల సమక్షంలో విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి పుష్ప తన కుమారుడు, తల్లి అంగాని గంగ, సోదరుడితో కలిసి బి.సావరం సిద్ధార్థనగర్‌లో ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఈ సమయంలో రాజోలులోని కోళ్లవారి వీధికి చెందిన ఎస్‌కె మెకానిక్ షేక్ సమీత్‌తో పరిచయం ఏర్పడింది. రెండేళ్లుగా వారు సహజీవనం చేస్తున్నారు. మద్యానికి బానిసైన సమీ తరచూ డబ్బుల కోసం పుష్పను వేధిస్తుండేవాడు. అంతేకాకుండా వ్యభిచారం చేయాలని బలవంతం చేసేవాడు. దీనికి నిరాకరించడంతో విచక్షణ రహితంగా కొట్టేవాడు. అతని వికృత చేష్టలపై పుష్ప తన తల్లి గంగకు తెలిపింది. దీంతో సమీ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. బుధవారం రాత్రి మద్యం సేవించి పుష్ప ఇంటికి వచ్చి గొడవపడ్డాడు. ఈ క్రమంలో విచక్షణ కోల్పోయి ఆమెను కత్తితో పొడిచి హత్య చేశాడు. అడ్డొచ్చిన ఆమె తల్లి గంగ, సోదరుడు వినోద్‌పైనా దాడి చేశాడు. అనంతరం సమీ అక్కడ నుంచి పరారయ్యాడు. మృతురాలి తల్లి గంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని రాజోలు డిఎస్‌పి సుంకర మురళీమోహన్ పరిశీలించారు. సిఐ నరేష్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి కోసం గాలిస్తున్నామని ఆయన తెలిపారు.

ఖ్యాతి ఘనం... ప్రోత్సాహకం శూన్యం

- మిర్చి రైతుకు దక్కని కేంద్రం చేయూత
- గుంటూరు మిర్చికి బంగారు అవార్డు ఇచ్చి చేతులు దులుపుకొన్న వైనం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

ఖ్యాతి ఘనం... ప్రోత్సాహకం శూన్యం అనే విధంగా గుంటూరు మిర్చి పరిస్థితి ఉంది. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన గుంటూరు మిర్చికి వ్యవసాయ ఉత్పత్తుల్లో స్వర్ణ కేటగిరిలో జాతీయ స్థాయిలో మొదటి స్థానం దక్కింది. ఒక జిల్లా ఒక పంట విధానం కింద కేంద్రం ప్రభుత్వం స్వర్ణ అవార్డును ప్రకటించింది. ఈ అవార్డును ఢిల్లీలో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ నుంచి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సోమవారం అందుకున్నారు. గుంటూరు మిర్చికి అవార్డు అయితే కేంద్రం ఇచ్చిందిగానీ మిర్చి రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు. ప్రపంచ వ్యాప్తంగా గుంటూరు మిర్చికి గిరాకీ ఉంది. మిర్చిని పండిస్తున్న రైతులకు ఎటువంటి ప్రోత్సాహకాలను ప్రకటించలేదు. ఆసియాలోనే అతిపెద్ద మిర్చి మార్కెట్ యార్డు గుంటూరులో ఉంది. గుంటూరు మిర్చి ఢిల్లీ సీట్ ఆఫ్ ఇండియాగా పేరుంది. ఇక్కడ ఏటా రూ.10 వేల కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయి. పొరుగు రాష్ట్రాల వ్యాపారులు కూడా గుంటూరులో మిర్చి కొనుగోలు చేస్తారు. రాయలసీమ రైతులు కూడా గుంటూరు వచ్చి విక్రయిస్తుంటారు. దేశవిదేశాలకు గుంటూరు మిర్చి ఎగుమతి అవుతోంది. గుంటూరు కేంద్రంగా మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ 30 ఏళ్లుగా కాగితాలకే పరిమితమైంది. ఇప్పటికీ సుగంధ ద్రవ్యాల బోర్డు కింద మిర్చిని కూడా ఒక పంటగానే పరిగణిస్తున్నారు తప్ప, ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయలేదు.

అవార్డు అందుకుంటున్న గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి (ఫైల్)

మిర్చి వ్యాపారం ద్వారా ఏటా రూ.2 వేల కోట్లు విదేశీ మారక ద్రవ్యం వస్తున్నా కేంద్రం రైతులకు తగిన ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదు. ఈ ఏడాది మిర్చి ధర రూ.18 వేల నుంచి రూ.9 వేలకు తగ్గినా ఎటువంటి సాయమూ అందించలేదు. కనీస ధర క్వింటాలు రూ.11,781కి తగ్గితే సాయం చేస్తామని ప్రకటించినా ఎవ్వరికీ సాయం అందించలేదు. అయినా, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. మిర్చికి నిల్వ సమస్య తీవ్రంగా ఉంది. శీతల గిడ్డంగులు 1992లో అందుబాటులోకి వచ్చాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 132 కోల్డ్ స్టోరేజీలు ఉన్నాయి. ధర లేనప్పుడు రైతులు, ఎగుమతి అవకాశాలు వచ్చే వరకు వ్యాపారులు కోల్డ్ స్టోరేజీల్లో ఏటా 70 లక్షల టిక్కిలు నిల్వ చేస్తున్నారు. మిర్చి రైతులకు ఏటా పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఎకరాకు కనీసం రూ.2 లక్షల వరకు ఖర్చవుతోంది. చీడలపీడల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. వీటి నివారణకు పురుగుమందులు వాడాల్సి రావడంతో ఖర్చులు పెరుగుతున్నాయి.

ఏ రకం విత్తనాలు వాడినా చీడపీడల ప్రభావం తగ్గడం లేదు. 15 ఏళ్ల క్రితం వచ్చిన వంగడాలే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఉద్యాన విశ్వవిద్యాలయం కూడా చీడపీడలను తట్టుకునే వంగడాలను 15 ఏళ్లుగా రూపొందించలేదని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొత్త సీడ్స్‌ను రూపొందించడానికి, తెగుళ్ల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్నాయి. మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని, తమకు ప్రోత్సాహకాలు అందజేయాలని, అధిక దిగుబడిని ఇచ్చే, చీడపీడలను తట్టుకొనే కొత్త రకాల విత్తనాలను ప్రవేశపెట్టాలని రైతులు కోరుతున్నారు.

బియ్యం సరఫరాకు మిల్లర్లు సిద్ధం కావాలి

- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి కేటాయించిన లక్ష్యం మేరకు కేంద్రానికి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) సరఫరా చేసేందుకు మిల్లర్లు సిద్ధం కావాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. విజయవాడ కానూరు సివిల్ సప్లయ్ భవన్‌లో రైస్ మిల్లర్ల ప్రతినిధులతో సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు జిల్లాలో 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం సేకరించిందని ఫైలెట్ ప్రాజెక్ట్ విజయవంతమైందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని 5 రాష్ట్రాల నుంచి 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. రాష్ట్రంతోపాటు హర్యానా, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి 10 శాతం బ్రోకెన్ రైస్ (విరిగిన బియ్యం) సేకరించేందుకు లక్ష్యాలు ఇచ్చారని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రం నుంచి కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను 10 శాతం బ్రోకెన్ రైస్‌ను కేంద్రానికి సరఫరా చేసేందుకు రైస్ మిల్లర్లు వారి సంసిద్ధతను స్పష్టమైన ప్రతిపాదనల రూపంలో తెలియజేయాలని కోరారు. ఇతర రాష్ట్రాలతో పోటీ పడి బియ్యం అందించడంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి రైస్ మిల్లర్లకు సూచించారు.

అక్రమాలు బయటపెడుతున్నందుకే మీడియాపై ఆంక్షలు : వైసిపి

- సాక్షి, మరికొన్ని ఛానళ్ల ప్రసారాల నిలిపివేతను నిరసిస్తూ ర్యాలీ

ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు జిల్లా)

టిడిపి కూటమి పాలన వైఫల్యాలను వెలుగులోకి తెస్తున్నందుకే మీడియాపై ఆంక్షలు విధించారని వైసిపి నాయకులు ఆరోపించారు. సాక్షి, మరికొన్ని టివి ఛానళ్ల ప్రసారాల నిలిపివేతను నిరసిస్తూ గుంటూరు జిల్లా తెనాలిలో వైసిపి శ్రేణులు గురువారం ర్యాలీ నిర్వహించాయి. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశాయి. ఈ సందర్భంగా వైసిపి లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు చింక సురేష్ యాదవ్ మాట్లాడుతూ.. కేబుల్ ఆపరేటర్లపై ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి సాక్షి, టివి9, ఎన్‌టివి ఛానళ్ల ప్రసారాలు రాకుండా నిలిపివేసిందన్నారు. మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించడమే కాకుండా, ప్రజల భావప్రకటన స్వేచ్ఛను కూడా ప్రభుత్వం హరించి వేస్తోందని విమర్శించారు. నిలిపివేసిన ఛానళ్ల ప్రసారాలను ఎంఎస్‌ఒలు తక్షణమే పునరుద్ధరించాలని, లేకుంటే వినియోగదారుల కోర్టులో సమాధానం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. వైసిపి కౌన్సిలర్ కె.యశోద మాట్లాడుతూ సూపర్-6 హామీలను టిడిపి కూటమి ప్రభుత్వం నెరవేర్చలేకపోయిందని, ఆ వైఫల్యాలు బయటకు రాకుండా మీడియా గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు.

జనగణనలో ఆదివాసీలకు ప్రత్యేక కాలమ్ ఉండాలి

- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి జిల్లా): జనగణనలో ప్రస్తుతం పేర్కొన్న ఆరు మతాలతోపాటు 10.43 కోట్ల జనాభా ఉన్న ఆదివాసీ మత విశ్వాసాలకు, సంస్కృతీ సంప్రదాయాలకు ప్రత్యేక కాలమ్ పెట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. పాడేరులో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం జన గణనను 2027లో చేపట్టడానికి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఆదివాసీల అస్తిత్వాన్ని, విశ్వాసాలను గుర్తించే విధంగా ఆ ప్రక్రియలో తగు విధానాలను అమలు చేయాలని కోరారు. ఆదివాసీలు సుదీర్ఘ కాలంగా చేస్తున్న డిమాండ్లపై జనగణన నోటిఫికేషన్‌లో ఎలాంటి ప్రస్తావనా లేదన్నారు. జనాభా లెక్కింపులో భాగంగా దేశ వ్యాప్తంగా ఆయా వ్యక్తుల మత విశ్వాసాల నమోదు జరుగుతుందని.. హిందూ, క్రైస్తవం, బౌద్ధం, ఇస్లాం, జైన, సిక్కు మతాలకు సంబంధించి నిర్దిష్ట ప్రస్తావనలు ఉన్నాయే తప్ప మిగిలిన మతాల సంగతేంటని ప్రశ్నించారు. షెడ్యూల్ తెగల ప్రజానీకం నమ్మకాలు, విశ్వాసాలు, సంప్రదాయాల పరిరక్షణకు సంబంధించిన నిర్దిష్టమైన హామీలు రాజ్యాంగంలోని 5, 6వ షెడ్యూల్‌లో పొందుపరచబడ్డాయన్నారు. ప్రకృతి ఆరాధన, వారసత్వ సంప్రదాయల ఆధారంగా షెడ్యూల్ తెగల ప్రజలు అనుసరించే వైవిధ్యభరితమైన మతవిశ్వాసాలను జనాభా లెక్కింపు ప్రక్రియ సహా న్యాయపరమైన, విధాన పరమైన ప్రతి మౌలిక చట్రంలో పరిగణనలో తీసుకోవాలన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో బిజెపి ప్రభుత్వం హిందూమత విశ్వాసాలను వ్యాప్తి చేసి ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలు, ఆచారాలు లేకుండా చేయడానికే కేంద్ర జనగణన లెక్కింపులో ఆదివాసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయడం లేదని అన్నారు. సమావేశంలో సంఘం అల్లూరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ధర్మన్నపడాల్, పొద్దు బాలదేవ్, జిల్లా నాయకులు టి.సూర్యనారాయణ, కె.కృష్ణారావు, కె.బాలయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

ఫ్రీవరల్డ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో) కొరకు గోయింగ్ కన్‌సర్న్‌గా కంపెనీ లేదా అసెట్స్ బ్లాకుల అమ్మకం ప్రకటన

నమోదిత కార్యాలయం: నెం.45, ఫస్ట్ మెయిన్ రోడ్, గాంధీ నగర్, అడయార్, చెన్నై తమిళనాడు-600 020.
CIN: 51420TN2004PTC052776

15 జూలై , 2025న ప్రచురించబడిన 7వ ఇ-వేలం అమ్మకపు నోటీసు రద్దు చేయబడింది మరియు 7వ ఇ-వేలం కోసం సవరించిన అమ్మకపు నోటీసు ఈ క్రింది విధంగా ఉంది.

(ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్, 2016 క్రింద అమ్మకం)

ఫ్రీవరల్డ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్ లో) ('కార్పొరేట్ డెబ్టార్') అమ్మకానికి బిడ్‌లను ఆహ్వానించడానికి లేదా కార్పొరేట్ రుణగ్రహీత యొక్క లిక్విడేషన్ అస్టేట్‌లో భాగమైన దిగువ చరాస్తులు మరియు స్థిరాస్తుల అమ్మకానికి లేదా గోయింగ్ కన్‌సర్న్‌గా ఇ-వేలం ద్వారా **"ఎక్కడ ఎలా వున్నది", "ఉన్నది ఉన్నట్లుగా", "అక్కడ అలాగే" మరియు "రికోర్స్ లేకుండా ప్రాతిపదికన"** బిడ్‌లను ఆహ్వానించడానికి ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. అమ్మకం వెబ్‌సైట్: https://ibbi.baanknet.com/eauction-ibbi ద్వారా దిగువ సంతకందారు ద్వారా విక్రయం జరుగుతుంది.

ఇ-వేలం కొరకు ముఖ్యమైన తేదీల షెడ్యూలు

వేలం క్రింద ఆస్తులపై తగిన శ్రద్ధ మరియు తనిఖీ	బుధవారం, 6 అగస్టు, 2025 (ఒక రోజు ముందు శ్రీ.సుధాన్షు పాండే, మొ.నం.9821916190- ఉ.11.00 గం. నుండి మ.3.30 గం. మధ్య (ఆదివారాలు మరియు ప్రభుత్వ సెలవు దినాలు తప్ప) వరకు.
బిడ్ పత్రాలు మరియు బయానా మొత్తం సమర్పించుటకు చివరి తేది	శుక్రవారం, 8 అగస్టు, 2025 వరకు
7వ ఇ-వేలం తేది మరియు సమయం	సోమవారం, 11 అగస్టు, 2025 ; లాట్-1 కొరకు - మ.12.00 గం. నుండి 2.00 గం. లాట్-2 కొరకు- మ.3.30 గం. నుండి సా.5.30 గం.
అత్యధిక బిడ్డరుదారు డిక్లరేషన్	మంగళవారం, 13 అగస్టు, 2025
విజయవంతమైన బిడ్డరుదారు డిక్లరేషన్	శనివారం, 16 అగస్టు, 2025

లాట్-1 వివరాలు

క్ర.సం.	వివరణ (ఆస్తులు)	రిజర్వ్ ధర (రూ.లక్షల్లో)	ఈఎండి (రిజర్వ్ ధరలో 5%) (రూ.లక్షల్లో)
లాట్ 1	మొత్తంగా కార్పొరేట్ డెటార్ (గోయింగ్ కన్‌సర్న్ ప్రాతిపదికన)	3249.54	162.48

లాట్-2లోని బ్లాకుల వివరాలు

క్ర.సం.	వివరణ (ఆస్తులు)	రిజర్వ్‌ధర (రూ.లక్షల్లో)	ఈఎండి (రిజర్వ్‌ధరలో 5%)(రూ.లక్షల్లో)
బ్లాక్ 1	**మైనింగ్ లీజు భూమి-** కొత్తగట్టు గ్రామం, శంకరపట్నం మండలం, కరీంనగర్ జిల్లా, తెలంగాణ రాష్ట్రంలో సర్వే నెం.552 మరియు 573 (18.269946ఎన్ మరియు 79.32707ఇ) లోని 1.80 హెక్టార్ల విస్తీర్ణంలోగల కలర్ గ్రానైట్ కోసం లీజుకు తీసుకున్న క్వారీ.	276.22	13.81
బ్లాక్ 2	**మైనింగ్ లీజు భూమి-**కొత్తగట్టు గ్రామం, శంకరపట్నం మండలం, కరీంనగర్ జిల్లా, తెలంగాణ రాష్ట్రంలో సర్వే నెం.499పి మరియు 551లోని 3.33 హెక్టార్ల విస్తీర్ణంలోగల కలర్ గ్రానైట్ కోసం లీజుకు తీసుకున్న క్వారీ.	513.14	25.66
బ్లాక్ 3	**మైనింగ్ లీజు భూమి-** క్వారీని కలర్ గ్రానైట్ కోసం లీజుకు ఇది క్వారీలు 4.929 హెక్టార్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నాయి, మైనింగ్ అధికారి, బెర్హంపూర్, ఒడిశా రాష్ట్రం నుండి లీజుకు తీసుకున్నారు, గ్రామాలు బబన్‌పూర్ (నెం.186) మరియు పితాంబ్‌పూర్ (నెం.230) సంతోష్‌పూర్ పోస్ట్, పత్రపూర్ తహశీల్, ఒడిశా జిల్లా, గంజాం జిల్లా పిన్: 760104)లో కలదు.	859.59	42.98
బ్లాక్ 4	**బాబన్‌పూర్ గ్రామం,** పాతపూర్ తాహసిల్, జిల్లా గంజాం, ఒడిషాలోని ఖాతా నెం.159/7 మరియు వివిధ ఒడిశా రాష్ట్రానికి చెందిన ఖాతా సంఖ్యలు (ఎసి. 6.886 డిసెంబరు)లో **ఫ్రీహోల్డ్ ల్యాండ్.**	210.77	10.54
బ్లాక్ 5	చెమబరంబాక్కం గ్రామం, పూనమల్లె తాలూకా, తిరువళ్లూరు జిల్లా, తమిళనాడులోని సర్వే నెం.184/1ఏ1 లోని 2.43 ఎకరాల **ఫ్రీహోల్డ్ భూమి.**	849.07	42.45
బ్లాక్ 6	మజిగామ్ గ్రామం & మౌజా, తహసిల్ కోసిని, జిల్లా గంజాం, బెర్హమూర్, ఒడిషా (ఎక.2.130 డిఇసి)లోని సర్వే నెం.లు 119, 130, 155, 169, 181, 352 వివిధ ఖాతా నెం.లలోని ప్లాట్ నెం.లు 149, 161, 293, 295, 296, 301, 154/961, 155/962, 245/1883, 295/1811, 295/1812, 301/1840తో **ఫ్యాక్టరీ బిల్డింగ్‌తో కూడిన ఫ్రీహోల్డ్ భూమి.**	128.40	6.42
బ్లాక్ 7	**ప్లాంట్ మరియు మెషినరీ ఇక్కడ ఉంది: ఎ)** కలర్ గ్రానైట్ క్వారీల కోసం క్వారీ లీజు విస్తరించింది ఇది 4.929 హెక్టార్ల విస్తీర్ణం, మైనింగ్ అధికారి నుండి లీజుకు తీసుకోబడింది, ఇది బెర్హంపూర్, ఒడిషా రాష్ట్రం బబన్‌పూర్ గ్రామాలలో (నెం.186) మరియు సంతోష్‌పూర్ పోస్ట్, పత్రాపూర్‌లోని పితాంబ్‌పూర్ (నెం.230), తహసిల్, గంజాం జిల్లా, ఒడిశా రాష్ట్రం (పిన్: 760104) **బి)** బాబన్‌పూర్ గ్రామం, పాతపూర్ తహసిల్, జిల్లా గంజాం ఒడిషా, ఖట్టా నెం.159/7 మరియు వివిధ ఖట్టా నెం.లు (ఎసి 6.886 డిసెంబరు) ఒడిషా రాష్ట్రంలో కలదు. **సి)** మజిగామ్ గ్రామం & మౌజా, తహశీల్ కోసిని, జిల్లా గంజాం, బెర్హమూర్, ఒడిషా (ఎక.2.130 డిఇసి)లోని సర్వే నెం.లు 119, 130, 155, 169, 181, 352 భూమి & వివిధ ఖాతా నెం.లలోని భూమి & ఫ్యాక్టరీ బిల్డింగ్ ప్లాట్ నెం.లు 149, 161, 293, 295, 296, 301, 154/961, 155/962, 245/1883, 295/1811, 295/1812, 301/1840 లో గలదు.	76.88	3.84
బ్లాక్ 8	**స్టాక్ / ఇన్వెంటరీ (ప్రధానంగా గ్రానైట్ స్లాబ్‌లను /క్వారీలోని బ్లాక్‌లు/ రాళ్లు కలిగియున్నది.** **ఎ)** కొత్తగట్టు గ్రామం, శంకరపట్నం మండలం, కరీంనగర్ జిల్లా, తెలంగాణ రాష్ట్రంలోని సర్వే నెం.553 లోగల 1.44 హెక్టార్ల విస్తీర్ణంలోని కలర్ గ్రానైట్ కొరకు క్వారీ లీజు. **బి)** కొత్తగట్టు గ్రామం, శంకరపట్నం మండలం, కరీంనగర్ తెలంగాణ రాష్ట్రంలో సర్వే నెం.552 మరియు 573 (18.269946ఎన్ మరియు 79.32707ఇ) లోని 1.80 హెక్టార్ల మేరకు కలర్ గ్రానైట్ కోసం క్వారీ లీజు. **సి)** కొత్తగట్టు గ్రామం, శంకరపట్నం మండలం, కరీంనగర్ తెలంగాణ రాష్ట్రంలో సర్వే నెం.499పి మరియు 551 లోని 3.33 హెక్టార్ల విస్తీర్ణంలో గల కలర్ గ్రానైట్ కోసం క్వారీ లీజు.	271.79	13.59
బ్లాక్ 9	**స్టాక్/ ఇన్వెంటరీ (ప్రధానంగా గ్రానైట్ స్లాబ్‌లు/క్వారీలోని బ్లాక్‌లు/ రాళ్లు కలిగియున్నది.** **ఎ)** కలర్ గ్రానైట్ క్వారీల కోసం క్వారీ లీజు 4.929 హెక్టార్ల విస్తీర్ణంలో విస్తరించి, ఇది మైనింగ్ ఆఫీసర్ నుండి బెర్హంపూర్, ఒడిశా రాష్ట్రం బబన్‌పూర్ (నెం 186) మరియు పితాంబ్‌పూర్ (నెం.230) గ్రామాలలో లీజుకు తీసుకోబడింది. సంతోష్‌పూర్ పోస్ట్, పత్రపూర్ తహశీల్, గంజాం జిల్లా, ఒడిశా రాష్ట్రం (పిన్: 760104)లో కలదు. **బి)** బాబన్‌పూర్ గ్రామం, పతాపూర్ తహసిల్, జిల్లా గంజం, ఒడిషా, ఖాతా నెం.159/7 మరియు వివిధా ఖాతా నెం.లు (ఎక 6.886 డిఇసి), ఒడిషా రాష్ట్రంలో కలదు.	45.33	2.27
బ్లాక్ 10	**స్టాక్/ ఇన్వెంటరీ (ప్రధానంగా గ్రానైట్ స్లాబ్‌లు/బ్లాకులు/ రాళ్లను కలిగి ఉంటుంది)** హనకడపురా గ్రామం, కనకపుర తాలూకా, రామనగర జిల్లా, కర్ణాటక-562117	18.35	0.92

వేలం రెండు లాట్‌లను కలిగి ఉంటుంది మరియు నిర్దేశించిన ఫార్మాట్‌లో లిక్విడేటర్ (ఆన్‌లైన్ లేదా హార్డ్ కాపీ)కి బిడ్‌లు సమర్పించబడతాయి. లాట్-1 కోసం విజయవంతమైన బిడ్డర్ లేనప్పుడు మాత్రమే లాట్-2లోని బ్లాకుల వేలం ప్రారంభమవుతుంది. పూర్తి ఇ-వేలం యొక్క వివరణాత్మక నిబంధనలు & షరతులతో పాటు బిడ్ ఫారమ్‌ప్రక్రియను వెబ్‌సైట్: https://ibbi.baanknet.com/eauction-ibbi నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
బిడ్డరుదారులు వివరణాత్మక నియమ& నిబంధనలు మరియు ఇ-వేలం ప్రక్రియ మెమోరాండంను చూడవచ్చు, వీటిని freeworldliquidation@gmail.com వద్ద దిగువ సంతకందారుకు ఇ మెయిల్ చేయడం ద్వారా పొందవచ్చు మరియు అమ్మకపు వేలం నోటీసు కోసం www.ibbi.gov.in ని కూడా సందర్శించవచ్చు. బిడ్డరుదారులు శ్రీ.సుధాన్షు పాండే, మొబైల్ నెం.+91-9821916190ని కూడా సంప్రదించవచ్చు. ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఐబిబిఐ) ఆదేశించిన వెబ్‌సైట్: https://ibbi.baanknet.com/eauction-ibbi ను ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్‌గా ఉపయోగించారు. ఆస్తుల అమ్మకాన్ని ఇ- వెబ్‌సైట్: https://ibbi.baanknet.com/eauction-ibbi లో కల్పించిన ఇ-వేలం ప్లాట్‌ఫామ్ ద్వారా విక్రేత తరపున నిర్వహించబడును మరియు చేపట్టబడును.
నిర్ణీత బిడ్డరుదారులు వర్తించే మేరకు సెక్షన్ 29 ఏ కింద ఎటువంటి అనర్హతకు గురికావడం లేదని హామీ ఇవ్వాలి మరియు ఏ దశలోనైనా అనర్హులుగా తేలితే, డిపాజిట్ చేసిన డబ్బును జప్తు చేయబడును.
అత్యధిక బిడ్డర్‌ను ప్రకటించిన 3 రోజుల్లోపు, లిక్విడేటర్ తగిన శ్రద్ధ వహించి, అత్యధిక బిడ్డర్ యొక్క అర్హతను ధృవీకరిస్తారు. అత్యధిక బిడ్డరుదారు అనర్హులుగా తేలితే, లిక్విడేటర్, ఎస్‌సిసితో సంప్రదించి, తదుపరి అత్యధిక బిడ్డర్‌ను విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించవచ్చు.
అమ్మకాన్ని ముగించడానికి విజయవంతమైన బిడ్డర్ ద్వారా రిజిస్ట్రేషన్ ఛార్జీలు మరియు ఇతర వర్తించే పన్నులు/ఛార్జీలు అదనంగా చెల్లించాలి. లిక్విడేటర్ ద్వారా అమ్మకపు ధృవీకరణ పత్రం జారీచేయబడిన తేదీనాటికి, ప్రస్తుత ఆపరేషనల్ ఆస్తులు మరియు లయబిలిటీస్ ఇ-వేలం ప్రక్రియ పత్రాల నిబంధనలు మరియు షరతులకు లోబడి గోయింగ్ కన్‌సర్న్‌గా విక్రయించబడుతున్న కార్పొరేట్ డేటార్‌లో భాగంగా బదిలీ చేయబడతాయి/ బదిలీ చేయబడినట్లు పరిగణించబడతాయి. కంపెనీ ఆస్తులు, ఏవైనా భారాలు, ఆస్తుల టైటిల్ మరియు క్లెయిమ్‌లు/హక్కులు/బకాయిలు/ఆస్తులను ప్రభావితంచేసేవి మొదలైనవాటి గురించి బిడ్డర్(లు) స్వయంగా స్వతంత్ర విచారణలు చేసుకోవాలి మరియు ఆస్తులు/ఆస్తులను వారి స్వంత ఖర్చుతో తనిఖీ చేయాలి.
వర్తించే విధంగా వడ్డీ, ఛార్జీలు లేదా పన్నులతో పాటు బిడ్ ధరను విజయవంతమైన బిడ్డర్ ఇ-వేలం అమ్మకపు ప్రక్రియ మెమోరాండంలో నిర్దేశించిన వ్యవధిలోపు పూర్తి చేయాలి మరియు అలా చేయడంలో విఫలమైతే డిపాజిట్ చేసిన మొత్తాలను జప్తు చేయడం మరియు అమ్మకాన్ని రద్దు చేయడంతో సహా శిక్షా చర్యలకు అతను బాధ్యత వహిస్తాడు. ఐబిబిఐ (లిక్విడేషన్ ప్రాసెస్) రెగ్యులేషన్స్, 2016 యొక్క రెగ్యులేషన్ 31ఏ(1)(హెచ్) ప్రకారం, అనగా వాటాదారుల సంప్రదింపుల కమిటీతో సంప్రదించి, లిక్విడేటర్ తొంభై రోజులకు మించి సహేతుకమైన కాలానికి చెల్లింపు వ్యవధిని పొడిగించడాన్ని పరిగణించవచ్చు.
ఈ ఆహ్వానం నిర్ణీతబిడ్డర్లను ఆహ్వానించడానికి ఉద్దేశించబడింది మరియు అమ్మకాన్ని అమలు చేయడానికి లిక్విడేటర్ లేదా కార్పొరేట్ డైటార్ వైపు నుండి ఎలాంటి బంధన బాధ్యతను సృష్టించదు. లిక్విడేటర్‌కు ఏవైనా లేదా అన్ని ఆఫర్(లు)/బిడ్‌లను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా ఇ-వేలాన్ని వాయిదా వేయడానికి/ వాయిదా వేయడానికి/ రద్దు చేయడానికి లేదా ఏ దశలోనైనా వేలం ప్రక్రియ నుండి ఏదైనా ఆస్తి లేదా దాని భాగాన్ని ఉపసంహరించుకోవడానికి లేదా ఆసక్తిగల పార్టీ / పొటెన్షియల్ ఇన్వెస్టర్ / బిడ్డర్‌ను ఎటువంటి బాధ్యత లేకుండా అనర్హులుగా ప్రకటించడానికి పూర్తి హక్కు ఉంది. అమ్మకపు నోటీసులోని ఏదైనా సవరణ https://ibbi.baanknet.com/eauction-ibbi వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయబడుతుంది. బిడ్డర్లందరూ దయచేసి వెబ్‌సైట్‌ను క్రమం తప్పకుండా సందర్శించాలని అభ్యర్థించడమైనది.

సం/-
ఎం జి చంద్రశేఖరన్
లిక్విడేటర్ ఆఫ్ ఫ్రీవరల్డ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్ లో)
IBBI Regn. No.: No: IBBI/IPA-003/00337/2021-2022/13620 - ఏఎఫ్ఏ 30.06.2026 వరకు చెల్లుతుంది.
సంప్రదించు చిరునామా: 31-ఇ, బికెసి సెంటర్, లక్ష్మి ఇండస్ట్రియల్ ఎస్టేట్, న్యూ లింక్ రోడ్, అంధేరి (వెస్ట్), ముంబయి-400 053

ప్రదేశం: ముంబై
తేది: 18.07.2025

శాస్త్రీయ దృక్పథంతోనే సమాజాభివృద్ధి

- జెవివి రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్సీ విఠపు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

శాస్త్రీయ దృక్పథంతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని, ఇందుకోసం జన విజ్ఞాన వేదిక 40 ఏళ్లుగా కృషి చేస్తోందని పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ, విద్యారంగ నిపుణులు, జన విజ్ఞానవేదిక సీనియర్ నాయకులు విఠపు బాలసుబ్రమణ్యం చెప్పారు. మహాకవి గురజాడ పుట్టిన విజయనగరంలో సెప్టెంబర్ 13, 14 తేదీల్లో 18వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయనగరంలోని గురజాడ అప్పారావు నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తొలుత జన విజ్ఞాన వేదిక 18వ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యారంగంలో నూతనత్వం, సైన్స్ దుర్వినియోగం, పర్యావరణ సంక్షోభం, ఆధునిక దృక్పథం అనే నాలుగు అంశాలపై మహాసభలో లోతుగా చర్చించడంతో పాటు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు రూపొందించి ప్రచారం చేస్తామని తెలిపారు. శాస్త్రీయ, వైజ్ఞానిక దృక్పథాన్ని ప్రజల్లో ప్రచారం చేయడంతో పాటు సగటు మనిషి జీవితంలో అంతర్భాగం కావాలని ఆకాంక్షించారు. సైన్స్ ప్రకారం జీవించడం, ఆలోచించడం, సమాజాన్ని నిర్మించడం ద్వారా మరింత ముందుకు వెళ్లేందుకు అవకాశం ఉంటుందని జన విజ్ఞాన వేదిక విశ్వసిస్తుందన్నారు. మహాసభలకు సుమారు 400 మంది ప్రతినిధులు, ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ఇందులో అన్ని రంగాలు, తరగతులకు చెందిన విద్యావంతులు, మేధావులు, సామాజికవేత్తలు ఉంటారని వివరించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.రాజగోపాల్, రాష్ట్ర నాయకులు జి.మురళీధర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవిఎన్ వెంకటరావు, రమణ ప్రభాత్, గౌరవాధ్యక్షులు కె.శివానంద్, సమతా రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విఠపు బాలసుబ్రమణ్యం, జెవివి నాయకులు

వచ్చే వారమే.. భారత్- బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

- తోలు, దుస్తుల ఉత్పత్తులకు మద్దతు
- చౌకగా యుకె వాహన దిగుమతులు
- స్థానిక పరిశ్రమలపై ఒత్తిడి..!

న్యూఢిల్లీ : వచ్చే వారంలోనే భారత్, బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) జరగనుంది. ఇరు దేశాల ప్రతినిధులు దీనిపై సంతకం చేయనున్నారని అధికార వర్గాలు వెల్లడించాయి. "స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చట్టపరమైన సమీక్ష, ప్రక్రియ కొనసాగుతోంది. దీనిపై వచ్చే వారమే సంతకాలు కానున్నాయని భావిస్తున్నాము." అని ఓ కీలక అధికారి వెల్లడించారు. ఈ ఒప్పందంలో రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులను పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ ఒప్పందంలో భాగంగా తోలు, పాదరక్షలు, దుస్తుల వంటి భారతీయ ఎగుమతులపై యుకె పన్నులను రద్దు చేస్తుంది. అదే విధంగా బ్రిటన్‌కు చెందిన విస్కీ, కార్లు వంటి వస్తువులపై ఇండియా సుంకాలను తగ్గించనుంది. 2030 నాటికి ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని 120 బిలియన్ డాలర్లకు చేర్చాలని నిర్దేశించుకుంది. ఇది ప్రస్తుత స్థాయి కంటే బహుళ రెట్లు ఎక్కువ. ఈ ఎఫ్‌టిఎకు బ్రిటిష్ పార్లమెంట్ నుండి ఆమోదం, భారత కేబినెట్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఒప్పందాల అనంతరం పూర్తి అమలుకు దాదాపు ఒక సంవత్సరం పడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఒప్పంద చర్చలు 2025 మే 6ననే ముగిసినట్లు ఇరు దేశాలు వెల్లడించాయి. దీనిపై తాజాగా సంతకాలు చేయడమే ఆలస్యమని అధికారులు తెలిపారు.

లెదర్, ఫుట్‌వేర్, దుస్తులు వంటి భారతీయ ఎగుమతులపై బ్రిటన్ సుంకాలు రద్దు చేయడంతో ఈ రంగాల్లో మరింత పోటీతత్వాన్ని సాధించడంతో ఎగుమతులు పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు. 2021-22లో ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం 17.5 బిలియన్ డాలర్లుగా ఉండగా.. 2030 నాటికి 120 బిలియన్లకు చేరుతుందని అంచనా. బ్రిటన్‌లో ఐటి, ఇతర సేవల రంగాలకు సులభమైన మార్కెట్ అవకాశాలు మెరుగుపరుస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. బ్రిటన్ నుంచి చౌకగా విస్కీ, కార్లు, మెషినరీ ఉత్పత్తులు దిగుమతి కానున్నాయి. దీంతో భారత్‌లోని స్థానిక తయారీదారులపై పోటీ ఒత్తిడి పెరుగుతుంది. ముఖ్యంగా వాహన, ఆల్కహాల్ రంగాల దిగుమతులు పెరిగితే దేశ వాణిజ్య లోటు పెరగనుంది. స్థానిక పరిశ్రమలను రక్షించడానికి తగు జాగ్రత్తలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

స్కూల్ బస్సు బోల్తా

- నలుగురు విద్యార్థులకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి - తణుకు (పశ్చిమగోదావరి)

పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన ఓ ప్రయివేటు స్కూలు బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తణుకు పట్టణంలోని శ్రీ సాయి విద్యాసంస్థలకు చెందిన బస్సు... పెనుమంట్ర మండలం బ్రాహ్మణచెరువు, వెలగలవారిపాలెం, పెనుమంట్ర, జుత్తిగ, రామేశ్వరం గ్రామాలకు చెందిన సుమారు 20 మంది విద్యార్థులతో తణుకుకు బయలుదేరింది. పాలి గ్రామం దాటి రేలంగి శివారు గమళ్లపాడు వద్దకు వచ్చేసరికి అదుపు రోడ్డు పక్కన ఉన్న వరి పొలంలోకి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో జుత్తిగ గ్రామానికి చెందిన బాదంపూడి స్వరూప, బ్రాహ్మణచెరువు గ్రామానికి చెందిన కౌరు పల్లవి, అదే గ్రామానికి చెందిన చిరాకు అశోక్, పెనుమంట్రకు చెందిన అమీరపు రేష్మాంజలి తీవ్రంగా గాయపడ్డారు. మిగతా విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను తణుకులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

ప్లాస్టిక్ రహితంగా ప్రభుత్వ కార్యాలయాలు

- సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో.. పి4 పౌండేషన్, స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర, ఎంఎస్‌ఎంఇ పార్కులు, ర్యాంప్, పిఎం ఆదర్శ గ్రామ యోజన తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్‌ను ఆయన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణకు దశల వారీగా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వచ్చే అక్టోబరు నాటికి 17 మున్సిపల్ కార్పొరేషన్లను ప్లాస్టిక్ రహిత కార్పొరేషన్లుగా ప్రకటించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒక సారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ వస్తువుల వల్ల జల, వాయు కాలుష్యంతో పర్యావరణానికి కలుగుతున్న హానిని గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమాజంలో పేదరిక నిర్మూలనకు, ఆర్థిక అసమానతలను తొలగించాలనే పవిత్ర లక్ష్యంతో ప్రభుత్వం స్వర్ణాంధ్ర పి4 పౌండేషన్‌ను ప్రారంభించిందని తెలిపారు. ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందన్నారు.

ఇప్పటికే 19.17 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించగా, 5.20 లక్షల కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారని తెలిపారు. పిఎం ఆదర్శ గ్రామ యోజన పథకం కింద 1,027 గ్రామాలను ఎంపిక చేయగా ఇప్పటికే 765 గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా ప్రకటించామన్నారు. ఎంఎస్‌ఎంఇ పార్కులు, ర్యాంపు (రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్‌ఎంఇ ఫెర్ఫార్మెన్స్) క్లస్టర్ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సర్క్యులర్ ఎకానమీ క్లస్టర్ల ఏర్పాటులో తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంటెల్‌లో 5,000 మందిపై వేటు

శాన్‌ఫ్రాన్సిస్కో : టెక్ దిగ్గజం ఇంటెల్‌లో ఉద్యోగులపై వేటు కొనసాగుతోంది. తాజాగా 5,000 మందిని తొలగిస్తున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఇప్పటి వరకు 4వేల మందిని ఇంటికి పంపిస్తుందని వచ్చిన వార్తలతో పోల్చితే ఈ సంఖ్య మరో వెయ్యి పెరగడం ఆందోళనకరం. ఆర్థిక అస్థిరతతో గ్లోబల్ మార్కెట్లలో ఒత్తిడి, పొదుపు చర్యలు, ఎఐ వినియోగం పెరగడంతో టెక్ కంపెనీలు తమ ఉద్యోగులను రోడ్డున పడేస్తున్న విషయం తెలిసిందే. ఈ వారంలోనే అమెరికా వ్యాప్తంగా తొలగింపులు ఉంటాయని ఇంటెల్ స్పష్టం చేసింది. ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా లే ఆఫ్‌లు అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. ఒరెగాన్, కాలిఫోర్నియాలో ఎక్కువగా తొలగింపులు ఉంటాయని తెలిపింది.

మరింత తగ్గిన రూపాయి విలువ

న్యూఢిల్లీ : అమెరికా టారీఫ్ చర్చలకు తోడు దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడంతో రూపాయి విలువ మరింత పడిపోయింది. మరోవైపు స్టాక్ మార్కెట్ల వరుస పతనం.. ఎఫ్ఐఐలు తరలిపోవడంతో గురువారం డాలర్‌తో రూపాయి మారకం విలువ 15 పైసలు క్షీణించి 86.07కు దిగజారింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజీలో డాలర్‌తో రూపాయి విలువ 85.96 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 85.80-86.09 మధ్య కదలాడింది. ముడి చమురు బ్యారెల్ ధర 0.06 శాతం శాతం పెరిగి 68.48 వద్ద ముగిసింది.

యాక్సిస్ బ్యాంక్ లాభాల్లో తగ్గుదల పెరిగిన మొండి బాకీలు

ముంబయి : ప్రయివేటు రంగ విత్త సంస్థ యాక్సిస్ బ్యాంక్ లాభాల్లో తగ్గుదల చోటు చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 3.8 శాతం పతనంతో రూ.5,806 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.6,034.64 కోట్ల లాభాలు సాధించింది. ఇదే సమయంలో రూ.13,448 కోట్లుగా ఉన్న నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ).. గడిచిన క్యూ1లో 0.8 శాతం పెరిగి రూ.13,560 కోట్లుగా చోటు చేసుకుంది. గడిచిన జూన్ ముగింపు నాటికి బ్యాంక్ మొత్తం డిపాజిట్లు 9 శాతం పెరిగి రూ.11.62 లక్షల కోట్లకు చేరాయి. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 1.54 శాతం నుంచి 1.57 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పిఎలు కూడా 0.34 శాతం నుంచి 0.45 శాతానికి ఎగిశాయి. గడిచిన త్రైమాసికంలో యాక్సిస్ బ్యాంక్ రూ.2,778 కోట్ల మొండి బాకీలను రద్దు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలోనూ రూ.904 కోట్ల అప్పులను రద్దు చేసింది.

సంపాదకీయం

భద్రత కరువు

ఉపాధ్యాయ విద్యార్థిని పట్ల ఓ అధ్యాపకుడే వేధింపులకు పాల్పడితే..; కళాశాలకు వెళ్లిన విద్యార్థిని విగతజీవిగా తుప్పల్లో పడి ఉంటే ... మహిళలకు ఇంకేం భద్రత? 'అర్ధరాత్రి వేళ మహిళ వీధిలో ఒంటరిగా తిరగ్గలిగినప్పుడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు' అన్న మహాత్మా గాంధీ మాటకు ఇంకెప్పుడు సార్థకత? కొంతకాలంగా దేశంలో, రాష్ట్రంలో విద్యార్థినులపై జరుగుతున్న దారుణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సామాజికంగా, శాంతిభద్రతల పరంగా మన వెనుకబాటుతనాన్ని, పాలకుల నిర్లక్ష్య, నిర్లిప్త ధోరణులను ఎత్తి చూపుతున్నాయి. విద్యా నైపుణ్యాలను అందించి, వికాసానికి తోడ్పాడాల్సిన విద్యాలయ ప్రాంగణాలు కూడా అమ్మాయిల పట్ల అభద్రతా వలయాలుగా మారటం విచారకరం. ఒడిషాలో బిఇడి విద్యార్థిని ... తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న అధ్యాపకుడి మీద ఫిర్యాదు చేసినా యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణం. బాధితురాలి ఆవేదనపై సంబంధిత అధికారులు, పోలీసులు తగు విధంగా స్పందించనప్పుడు - అది వేధించేవాడికి మరింత బలమవుతుంది. ధైర్యాన్ని కూడగట్టుకొని ఫిర్యాదు చేసిన బాధితురాలి ఆత్మస్థైరాన్ని దెబ్బ తీస్తుంది. ఈ దుస్థితే భవిష్యత్తులో ఉపాధ్యాయినిగా ఎదగాల్సిన విద్యార్థిని బలన్మరణానికి దారి తీసింది. ఫిర్యాదు చేసినప్పుడు స్పందించని కళాశాల యాజమాన్యంపైనా, అధికారుల పైనా ఒడిశాలో పెద్దఎత్తున నిరసన వ్యక్తమవుతోంది. విద్యార్థి సంఘాలు గురువారం రాష్ట్ర బంద్ పాటించాయి.

చదువుకునే చోట విద్యార్థినులకు తగిన భద్రత కరువైన సంఘటనలు ఇటీవల అనేకం వెలుగు చూశాయి. కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన ఇంటర్ విద్యార్థిని కళాశాలకు వెళ్లి, గండికోటలో అనుమానాస్పద స్థితిలో విగతజీవిగా కనిపించింది. ఏం జరిగిందో పోలీసు దర్యాప్తులో తేలాల్సి ఉంది. కొద్ది రోజుల క్రితం కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పారా మెడికల్ విద్యార్థినులు... తమను ల్యాబ్ అసిస్టెంటు, మరో ముగ్గురు సిబ్బంది లైంగిక వేధింపులకు గురి చేస్తున్నట్టు ఫిర్యాదు చేశారు. ఏలూరులోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) కేంద్రంలో క్రీడాకారిణుల పట్ల కోచ్‌లు లైంగిక వేధింపులకు పాల్పడినట్టు గత నెలలో వచ్చిన వార్తలు సంచలనం కలిగించాయి. కోల్‌కత్తా లా కాలేజీ విద్యార్థినిపై సహ విద్యార్థుల అత్యాచారం, ఐఐఎం విద్యార్థినిపై కళాశాల హాస్టల్లోనే అఘాయిత్యం జరిగాయి. బెంగాల్‌లో అధికార పార్టీకి చెందిన విద్యార్థి సంఘం నాయకులు ఈ దుర్మార్గం వెనుక ఉన్నారని వార్తలు వచ్చాయి. గతేడాది ఆగస్టు 9వ తేదీన కోల్‌కతాలోని ఆర్‌జి కర్ హాస్పటల్లో జూనియర్ డాక్టర్ అత్యాచారానికి, హత్యకు గురి కావడం దేశవ్యాప్త ఆందోళనలకు దారి తీసింది. జాతీయ నేర నివారణ విభాగం గణాంకాల ప్రకారం.. దేశంలో రోజుకు 86 అత్యాచారాలు నమోదవుతున్నాయి. ఇందులో 90 శాతం దారుణాలు తెలిసిన వ్యక్తుల ద్వారానే జరుగుతుండడం గమనార్హం. బాధితుల్లో 10 శాతం మంది 18 ఏళ్ల లోపు వారు కాగా, 66 శాతం మంది 18 - 30 ఏళ్ల లోపువారు.

చదువుకున్న చోట, శిక్షణ పొందుతున్న చోట విద్యార్థినులకు రక్షణ లేకపోవటం అత్యంత విచారకరం. తమ మాట వినకుంటే భవిష్యత్తుకు నష్టం కలిగిస్తామన్న బెదిరింపులతో కొంతమంది శిక్షకులు, అధ్యాపకులు, సిబ్బంది వికృత చేష్టలకు పాల్పడడం నిత్యకృత్యంగా మారుతోంది. ఇలాంటి వాటిపై కొద్దిపాటి సమాచారం తమ దృష్టికి వచ్చినా యాజమాన్యాలూ, అధికారులూ తక్షణ చర్యలు తీసుకోవాలి. ఏ పేరుతో ఆలస్యం చేసినా అది దుర్మార్గుల దుశ్చేష్టలకు ఊతమిచ్చినట్టే అవుతుంది. అలాగే, నేర నిరూపణ చేయటంలోనూ పోలీసు యంత్రాంగం తరచూ విఫలమవుతుంది. సంచలనం కలిగించిన ఆయేషా, రిషితేశ్వరి ఉదంతాలు రెంటిలోనూ నిందితులకు శిక్ష పడలేదు. దర్యాప్తులో చోటు చేసుకునే వైఫల్యాలు కూడా నేర ప్రవర్తకులకు పరోక్ష ధైర్యాన్నిస్తాయి. దీనికి తోడు సినిమాల్లో, వెబ్ సిరీస్‌లో, సోషల్ మీడియాలో అడ్డూ అదుపూ లేని విష సంస్కృతి ప్రవహిస్తోంది. దీనిని నియంత్రించడంతో పాటు- పని ప్రాంతాల్లో, విద్యా వైద్య కేంద్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలి. మహిళను తక్కువగా చూసే మనువాద ధోరణికి, సరుకుగా చూపించే మార్కెట్టు దృష్టికీ కళ్లెం వేయాలి. స్త్రీ పురుష సమానత్వ భావనను ఇంటా బయటా పెంపొందించాలి. అప్పుడే ఆడపిల్లలపై అకృత్యాలకు అడ్డుకట్ట పడుతుంది.

సందర్భం



ప్రపంచాన్ని మార్చే ఆయుధం చదువు ఒక్కటే.

- నెల్సన్ మండేలా

జననం : 18.7.1918

మరణం : 5.12.2013

విశ్లేషణ

వక్ర మార్గంలో మన విదేశాంగ విధానం



ప్రకాశ్ కరత్

ఈ మధ్య కాలంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానం ఎంతగా భ్రష్టు పట్టి పోయిందంటే దానిని వివరించడానికి మాటలు చాలవు. గాజాలో తక్షణమే కాల్పుల విరమణను పాటించాలని ఐరాస సర్వసభ్య సమావేశం జూన్ 13న జరిగినప్పుడు స్పెయిన్ తీర్మానాన్ని ప్రతిపాదించింది. "ఆకలితో ప్రజానీకాన్ని మాడ్చి చంపడం" ఒక యుద్ధరంగ ఎత్తుగడగా ఇజ్రాయిల్ అనుసరిస్తోందంటూ ఆ తీర్మానం ఇజ్రాయిల్‌ను తీవ్రంగా అభిశంసించింది. 193 సభ్య దేశాలకు గాను 149 దేశాలు ఆ తీర్మానానికి అనుకూలంగా ఓటు చేశాయి. 12 దేశాలు వ్యతిరేకించాయి. 19 దేశాలు గైర్హాజరయ్యాయి. భారతదేశం తీర్మానానికి అనుకూలంగా ఓటు చేయకపోగా గైర్హాజరైంది.

ఇంతకన్నా సిగ్గు చేటైన విషయం మరొకటి ఉండదు. అక్కడ గాజాలో 20 లక్షల మంది ప్రజానీకానికి ఆహారం అందకుండా చేసి వారిని సామూహికంగా చావు వైపు నెడుతూ, మరోపక్క వారి మీద దాడులు చేస్తున్న ఇజ్రాయిల్ దారుణాన్ని తక్షణమే అడ్డుకోవలసిన సందర్భం ఇది. తక్షణ కాల్పుల విరమణ అందుకు వెంటనే జరగాలి. అందుకోసం ప్రతిపాదించిన తీర్మానం మీద ఓటు చేయకుండా భారతదేశం గైర్హాజరవడం దారుణం. నిజానికి ఆరు నెలల ముందు భారతదేశం తీసుకున్న వైఖరికి కూడా ఇది భిన్నంగా ఉంది. డిసెంబర్ 2024లో తక్షణమే గాజాలో కాల్పుల విరమణ జరగాలని చేసిన తీర్మానానికి అనుకూలంగా భారతదేశం ఓటు చేసింది. ఇప్పుడు యావత్తు ఆసియా ఖండం లోని దేశాలూ తీర్మానానికి అనుకూలంగా ఓటు చేస్తే కేవలం భారతదేశం, తైమర్-లెస్టె మాత్రమే గైర్హాజరయ్యాయి! జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు అమెరికాకు గట్టి మిత్రులు. ఆ రెండూ కూడా తీర్మానానికి అనుకూలంగా ఓటు చేశాయి.

నెతన్యాహు పాలస్తీనాను పూర్తిగా భూమండలం మీద లేకుండా తుడిచిపెడతానని చేసిన ప్రకటనకు ట్రంప్ తన సంపూర్ణ మద్దతు ప్రకటించాడు. దీని తర్వాత భారతదేశం మరింతగా ఇజ్రాయిల్ అనుకూల వైఖరిని తీసుకుంది. పాలస్తీనా, ఇజ్రాయిల్ దేశాలు రెండూ ఉనికిలో కొనసాగాలన్న వైఖరిని అమెరికా బలపరచబోదని ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. ఒక బానిస మాదిరిగా ట్రంప్ నకు విశ్వాసపాత్రంగా వ్యవహరించడం కోసం మోడీ ప్రభుత్వం ఎప్పటి నుంచో భారతదేశం పాలస్తీనా విషయంలో అనుసరిస్తున్న సూత్రబద్ధ వైఖరిని విడనాడి సామ్రాజ్యవాదుల జాతిహనన దురాగతాలకు కొమ్ము కాస్తోంది.

> 'ఆపరేషన్ సిందూర్' తర్వాత భారతదేశ విదేశాంగ విధానం పూర్తిగా వంకరదారి పట్టిందన్నది స్పష్టం అయింది. భారత-పాక్ దేశాలను రెండింటినీ తన చెప్పుచేతల్లో ఉంచుకుని రెండు దేశాల మధ్య సంబంధాల విషయంలో తానే మధ్యవర్తిగా వ్యవహరించాలన్న ట్రంప్ వ్యూహానికి అనుగుణంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

> ఒక బానిస మాదిరిగా ట్రంప్ నకు విశ్వాసపాత్రంగా వ్యవహరించడం కోసం మోడీ ప్రభుత్వం ఎప్పటి నుంచో భారతదేశం పాలస్తీనా విషయంలో అనుసరిస్తున్న సూత్రబద్ధ వైఖరిని విడనాడి సామ్రాజ్యవాదుల జాతిహనన దురాగతాలకు కొమ్ము కాస్తోంది.

జూన్ 14న షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సివో) సమావేశం ఇరాన్ పై ఇజ్రాయిల్ సైన్యం చేసిన దాడులను ఖండించింది. ఆ దాడులు ఐరాస నియమావళిని, అంతర్జాతీయ న్యాయ సూత్రాలను ఉల్లంఘించాయని ఆ ప్రకటన పేర్కొంది. వెంటనే భారత ప్రభుత్వం ఆ ప్రకటనతో తనకేమీ సంబంధం లేదని, ఆ ప్రకటనను ఇచ్చే ముందు తమను ఎవరూ సంప్రదించలేదని ప్రకటించింది. నిజానికి ఇరాన్ ఎస్‌సివో లో ఒక సభ్య దేశంగా ఉంది. తమ తోటి సభ్య దేశం మీద దాడి జరిగినప్పుడు స్పందించాలన్న కనీస స్పృహను సైతం భారత ప్రభుత్వం కోల్పోయింది. పైగా ఇరాన్ తో భారతదేశానికి వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది. కాని మన మిత్ర దేశంపై జరిగిన సైనిక దాడిని మోడీ ప్రభుత్వం ఖండించలేదు. అదే జపాన్ వైఖరిని చూడండి. ఎంత తేడా ఉందో! జపాన్ అమెరికాతో క్వాడ్ లో వ్యూహాత్మక సైనిక భాగస్వామి. అమెరికాకు సన్నిహిత మిత్రుడు. కాని ఇరాన్ మీద ఇజ్రాయిల్ దాడి చేసినప్పుడు ఆ దాడిని ఖండించింది. అది ఇరాన్ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘిస్తోందని, అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు అది విరుద్ధం అని ప్రకటించింది.

జూన్ 22న అమెరికా ఇరాన్ లోని మూడు అణు స్థావరాల మీద బాంబుల దాడికి దిగింది. ఈ దాడి అన్ని అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు, సాంప్రదాయాలకు పూర్తి విరుద్ధం. కాని భారతదేశం మాత్రం మౌనంగా ఉండిపోయింది. ఇరాన్ అధ్యక్షుడితో టెలిఫోన్‌లో మాట్లాడుతూ మన ప్రధాని మోడీ తన ఆందోళనను వెలిబుచ్చారు. ఉద్రిక్తతలను తగ్గించాలని కోరారు. అంటే ఎవరైతే దాడులకు బలి అయ్యారో, వారికే తమను తాము రక్షించుకునే ప్రయత్నాలు ఏవీ చేయవద్దని కోరారన్నమాట! రియో డి జెనెరో లో (బ్రెజిల్) మోడీ తన ప్రసంగంలో ఇరాన్ పై ఇజ్రాయిల్ చేసిన దాడి గురించి ఎలాంటి ప్రస్తావనా తేలేదు. కాని ఆ శిఖరాగ్ర సమావేశం చేసిన ప్రకటన మాత్రం ఇజ్రాయిల్ ఇరాన్‌పై చేసిన దాడిని ఖండించింది. అంటే బ్రిక్స్ లోని తక్కిన పది సభ్య దేశాలూ భారతదేశం వైఖరితో ఏకీభవించలేదన్న మాట.

జులై 1న వాషింగ్టన్ లో జరిగిన క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం చైనాపై ఎక్కుపెడుతూ అది భద్రతకు ముప్పుగా పరిణమించిందని వ్యాఖ్యానించింది. దాని ఆర్థిక బలాన్ని, మిత్రులను బలహీన పరచాలని తీర్మానించింది. క్వాడ్ తరువాయి సమావేశం ఈ సంవత్సరంలో ఢిల్లీలో జరగబోతోంది. ట్రంప్ ఎలాగైనా ఆ సమావేశానికి హాజరు అయ్యేట్టు చూసేందుకు భారతదేశం నానా తంటాలూ ఇప్పటి నుంచీ పడుతోంది. అంటే మన భారత దేశ విదేశాంగ విధానం మితవాద దిశగా ఎంతగా మొగ్గుతోందో, ట్రంప్ ను సంతృప్తి పరచడానికి మోడీ ప్రభుత్వం ఎంత ఆరాటపడుతోందో, అందుకోసం ఎంత లొంగుబాటుతనాన్ని ప్రదర్శిస్తోందో అర్థం ఔతోంది.

ఇక వాణిజ్య సుంకాల విషయంలో ట్రంప్ చేస్తున్న డిమాండ్ల విషయంలోనూ మోడీ ప్రభుత్వం ఒక గట్టి వైఖరిని అవలంబించలేకపోతోంది. తాను ప్రకటించిన సుంకాల పెంపు అమలు కావడానికి ట్రంప్ 90 రోజుల గడువు ప్రకటించాడు. అది జులై 9తో ముగిసింది. ఆలోపే ఏదో ఒక విధంగా, అమెరికాతో వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని, అందుకోసం అమెరికా షరతులకు తలవొగ్గడానికైనా సిద్ధపడాలని మోడీ ప్రభుత్వం భావించింది. ఐనప్పటికీ ఇంతవరకూ ఆ ఒప్పందం కుదరనేలేదు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత భారతదేశ విదేశాంగ విధానం పూర్తిగా వంకరదారి పట్టిందన్నది స్పష్టం అయింది. భారత-పాక్ దేశాలను రెండింటినీ తన చెప్పుచేతల్లో ఉంచుకుని రెండు దేశాల మధ్య సంబంధాల విషయంలో తానే మధ్యవర్తిగా వ్యవహరించాలన్న ట్రంప్ వ్యూహానికి అనుగుణంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

మన విదేశాంగ విధానం ఇంతగా భ్రష్టు పట్టిపోవడం వెనుక ప్రధాన కారణం మన దేశాన్ని అమెరికాకు జూనియర్ భాగస్వామిగా చేయాలన్న మోడీ ప్రయత్నమే. మన దేశ రక్షణమంత్రి రాజనాథ్ సింగ్ త్వరలో అమెరికన్ విదేశాంగ కార్యదర్శితో భేటీ కానున్నాడు. అప్పుడు మరో పదేళ్లపాటు అమెరికా-భారత సైనిక సహకార ఒడంబడికను పొడిగించే పత్రం మీద సంతకం పెట్టబోతున్నాడు. గత ఫిబ్రవరిలో మోడీ అమెరికా పర్యటించినప్పుడు భారీ స్థాయిలో అమెరికన్ మిలిటరీ పరికరాలను కొనుగోలు చేయడానికి అంగీకరించి వచ్చాడు. జూన్‌లో ఇక్కడికి వచ్చిన అమెరికన్ వాణిజ్య కార్యదర్శి హోవర్డ్ లుట్నిక్ భారతదేశం ఇంకా రష్యా నుండి మిలిటరీ పరికరాలను కొనుగోలు చేస్తున్నందుకు తీవ్ర అసంతృప్తిని వెలిబుచ్చాడు. ఐతే, మోడీ ప్రభుత్వం ఈ అభ్యంతరాన్ని పట్టించుకుందని, "అమెరికా నుండి మిలిటరీ పరికరాల కొనుగోలుకు సిద్ధపడుతోంద"ని ప్రకటించాడు.

ఇదంతా చూసినప్పుడు మోడీ ప్రభుత్వం మన దేశపు కీలక ప్రయోజనాలను బలిపెడుతోందని, ఆర్థిక స్వావలంబనను, విదేశాంగ విధానాన్ని, వ్యూహాత్మక స్వయం నిర్ణయాధికారాన్ని దెబ్బ తీస్తోందని స్పష్టమౌతోంది.

/ వ్యాసకర్త సిపిఐ(ఎం) పూర్వ ప్రధాన కార్యదర్శి /

సెటైర్

ఓపాలి రమ్మనండి సారూ !

- సుబ్రమణ్యం

"హలో హలో ! ఎవరండీ మాట్టాడేది? సినబాబుగోరేనా?"

" సినబాబు ఎవరయ్యా? నేను మంత్రి లోకేష్ గారి పియ్యేని"

"హద్దిగది, మని నానూ అడిగింది ఆయనగోరినేనండీ బాబూ! సినబాబుగోరంటే ఈ వోల్ స్టేటుకి ఆయనగోరే కదా మరి? ఇంతకీ ఆయనకోపాలి పోనిద్దురూ బాబ్బాబు, అరిజెంటు యవ్వారం."

"ఏంటయ్యా అంత అర్జెంటు. అలా ఎవరు బడితే వారు అడగ్గానే సార్‌కి ఫోనివ్వకూడదు. నాకు విషయం ఏమిటో చెప్పు. ఆ తర్వాత సార్‌కి ఫోన్ ఇవ్వాలో వద్దో నేను తేల్చుకుంటాను."

"అలాగంతారేటండీ? ఎవర్ని బడితే ఆరిని వోట్లుడగడానికి సినబాబుగోరు, బాబుగోరు సొయంగా తిరగనేదా? అప్పుడేటి మీరుగాని వొచ్చి మద్దెవొర్తిత్వం నడిపీసినారేటండీ? అప్పుడు డవిరెట్టుగా మాట్టాడినాను. ఇప్పుడూ అలాగే మాట్టాడాల. బాబ్బాబు, ఓ పాలి పోనిద్దురూ సినబాబుగోరికి"

"అలా కుదరదయ్యా, ముందు విషయం ఏమిటో చెప్పు. "

"మరేటి నేదండీ, సినబాబుగోరు ఓపాలి అరిజెంటుగా మా పొలం కాడికి వచ్చియ్యాల. ఎంతో సేపు ఉండక్కరనేదండీ బాబూ. ఓ సిటం లో పనైపోద్ది. ఓ పాలి ఎలికాప్టరులో తుర్రున ఎగిరొచ్చి ఇక్కడ ఇలాగ వోలడం, ఏటి! పనైపోగానే ఎంటనే మల్లీ తుర్రుమని ఎల్లిపోడం. అంతేనండి బాబూ! అరిజెంటు యవ్వారమండీ"

> మరేమో మొన్నెప్పుడో నాను లేని సమయం సూసి నా పొలంలో ఆ ఇస్మార్ట్ మీటర్ ఏదో తెచ్చి బిగించీసినారు. పాత మీటరట్టుకుపోనారు. నానున్నప్పుడొచ్చుంటే ఆల్ల లెక్కలు అక్కడికక్కడే తేల్చిసీవోణ్ణి. మరి ఆల్లు బిగించీసినారు కనక, సినబాబుగోరు సెప్పినట్టు నాను ఆ ఇస్మార్ట్ మీటర్‌ని సుత్తట్టుకుని పగలగొట్టియ్యాల కాదా, నానైతే సుత్తట్టుకుని రెడీగా ఉన్నాను. సినబాబుగోరు రావడమే ఆలిస్సెం. ఒక్క దెబ్బతో పనైపోద్ది. నాను ఇస్మార్ట్ మీటరుని పగలగొట్టినప్పుడు సినబాబుగోరు సొయంగా సూడాల కదా.

"అబ్బబ్బ ! ఆ వ్యవహారం ఏదో చెప్పవయ్యా బాబూ విసిగించక"

"కోపగించుకోకండి బాబూ, తవఁరినాగ నాను సదూకోనేదు కదా, అప్పుడు ఓటడగడానికి వొచ్చినాడు కదా సినబాబుగోరు. అప్పుడేటన్నాడంటే, అదేటబ్బా అది, నోరు సరిగా తిరగడంనేదు, ఆ! అది! ఇస్మార్ట్ మీటర్! అదండి మరి. అట్టాటిది గనుక మీ పొలంలో గాని ఇంట్లో గాని ఎవులైనా ఎడితే ఎంటనే సుత్తుచ్చుకుని ఇరగ్గొట్టేయండి, నాను దగ్గరుండి సూసుకుంటాను అన్నారండి సినబాబుగోరు. నాకైతే సేనా ఆనందమైపోనాదండి బాబూ!"

"ఇంతకీ ఇప్పుడు సార్‌కి ఫోన్ ఎందుకివ్వాలో చెప్పవయ్యా విసిగించక"

"మజ్జెలో తవఁరే అడ్డు తగల్తన్నారు బాబూ. సెప్తన్నాను కదా, ఇనుకోండి. మరేమో మొన్నెప్పుడో నాను లేని సమయం సూసి నా పొలంలో ఆ ఇస్మార్ట్ మీటర్ ఏదో తెచ్చి బిగించీసినారు. పాత మీటరట్టుకుపోనారు. నానున్నప్పుడొచ్చుంటే ఆల్ల లెక్కలు అక్కడికక్కడే తేల్చిసీవోణ్ణి. మరి ఆల్లు బిగించీసినారు కనక, సినబాబుగోరు సెప్పినట్టు నాను ఆ ఇస్మార్ట్ మీటర్‌ని సుత్తట్టుకుని పగలగొట్టియ్యాల కాదా, నానైతే సుత్తట్టుకుని రెడీగా ఉన్నాను. సినబాబుగోరు రావడమే ఆలిస్సెం. ఒక్క దెబ్బతో పనైపోద్ది. నాను ఇస్మార్ట్ మీటరుని పగలగొట్టినప్పుడు సినబాబుగోరు సొయంగా సూడాల కదా. సూసీసినాక ఎంటనే ఎలికాప్టరెక్కి తుర్రునెల్లిపోవడమే. అద్దది. అదండి బాబూ సంగతి. ఇసయం తమకి సెప్పీసినాను గనక తవఁరోపాలి ఆ పోను సినబాబు గోరి సెవిదగ్గరెట్టీయండి బాబూ! మరి నామీద దయుంచండి బాబూ! హలో ! హలో! ఏటి! పోను ఆపీసినారేటండీ బాబూ ఇదిగో! సుత్తట్టుకుని రెడీగా ఉన్నాను బాబూ!"

★

జనవాక్యం

హడలెత్తిస్తున్న మైనర్ల డ్రైవింగ్

ఈ మధ్య కాలంలో స్కూల్ పిల్లలు, మైనారిటీ తీరని ఇంటర్మీడియట్ చదివే పిల్లలు సైతం ఎస్.యూవీ వంటి అత్యంత వేగవంతమైన బైకులు, కార్లు నడుపుతున్నారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల పట్ల ఎలాంటి అవగాహన లేని పిల్లలు వాహనాలు తీసుకుని రోడ్డు ఎక్కితే చాలా నష్టం జరుగుతుంది. ఈ నష్టంతో ఆ పిల్లల కుటుంబాలే కాకుండా సమాజం కూడా ఆ నష్టాన్ని ఎదుర్కోవలసి వస్తుంది. తల్లిదండ్రులు, పెద్దలు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదు. అలాగే మోటారు వాహన చట్టాలకు రవాణా శాఖ గట్టి పదును పెట్టాలి. ముఖ్యంగా మోటారు వాహన చట్టం లోని సెక్షన్ 199(ఎ)ను సమర్థంగా అమలు చేసేలా అన్ని జిల్లాల, ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం అధికారులకు దిశానిర్దేశం చేస్తే ముందు ముందు మైనర్ల డ్రైవింగ్‌ను అరికట్టేందుకు వీలు అవుతుంది. అలాగే ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రవాణా శాఖ కార్యాలయాల అధికారులకు దిశానిర్దేశం చేస్తే మేలు.

- దాసం వెంకటరెడ్డి

అంతర్జాతీయం

ట్రంప్ సుంకాలు - వాణిజ్యం కుదేలు

పి. మధు



> ప్రపంచీకరణలో పోగొట్టుకొన్న తయారీ రంగాన్ని రాబట్టడానికే ఈ సుంకాల విధానాన్ని ట్రంప్ లక్ష్యంగా ఎంచుకొన్నాడు. అయితే పైకి ఇదే కనపడ్డా అసలు వాస్తవం వర్ధమాన దేశాల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని తమ ఒత్తిడితో లొంగదీసుకో దలుచుకున్నాడు. సుంకాలతో పెరుగుతున్న ఆర్థిక భారాలు, ప్రతిఘటన, వ్యాపార అడ్డంకులు, వ్యవస్థీకృత పరిమితులు (ఆటోమేషన్, గ్లోబల్ సప్లై చైన్లు), అమెరికాకు, ట్రంప్ నకు అవకాశాల్ని కుదిస్తున్నాయి. ప్రపంచీకరణకు ముందు కాలంలో ఉన్న తయారీ రంగాన్ని సుంకాల పెంపుదలతో రాబట్టడం సాధ్యం కాదన్నది స్పష్టమవుతుంది.

ట్రంప్ సుంకాల పెంపు విధానాలు ముఖ్యంగా మొదటి పదవీకాలం (2017-2021)లోనే ప్రారంభమై, రెండవ పదవీకాలం (2025) నుండి పెంచడం ఖచ్చితమైన విధానంగా అమలులోకి వచ్చింది. ఎన్నికల్లో 'అమెరికా ఫస్ట్' అనే నినాదంతో విదేశీ వస్తువుల దిగుమతులను తగ్గించి, వాణిజ్య లోటును తగ్గిస్తానని స్థానికతను రెచ్చగొట్టాడు. వాణిజ్యంలో చైనాతో లోటు అధికంగా ఉందని దాన్ని తగ్గిస్తానని ఎన్నికల్లోనే ప్రకటించాడు.

సుంకం పెంపు లక్ష్యం

దిగుమతి చేసుకొనే వస్తువులను మరింత ఖరీదైనవిగా చేయడం ద్వారా దేశీయ తయారీని ప్రోత్సహించడానికి సుంకాల పెంపు అవసరమని ప్రకటించాడు. గ్లోబలైజేషన్ ప్రకటించినప్పుడు కొన్ని అమెరికన్ కంపెనీలు తమ లాభాల కోసం తమ పెట్టుబడులను లేబరు చౌకగా లభించే దేశాలకు తరలించాయి. ప్రత్యేకంగా చైనాకు, మూడవ ప్రపంచ దేశాలకు అవి తరలి వెళ్లాయి. ప్రపంచీకరణ విధానాలను వినియోగించుకొని కొన్ని కంపెనీలు తమ పెట్టుబడులను తరలించి టెక్నాలజీని వినియోగించుకొని బాగా లాభాలు పొందాయి. ప్రపంచీకరణ ద్వారా టెక్నాలజీ కూడా అందుబాటులోకి వస్తుంది గనుక ఆ దేశాలు సకల సౌకర్యాలు కల్పించి పరిశ్రమలను ఆకర్షించాయి. ఉక్కు, ఎలక్ట్రానిక్, బట్టల పరిశ్రమలు అమెరికా నుండి ఎక్కువ తరలి వెళ్లాయి. తయారీ రంగానికి అవసరమైన పరిశ్రమలను తిరిగి రాబడతానని, దేశంలో ఉపాధి కల్పిస్తానని ప్రకటించాడు. సుంకాల పెంపును ప్రకటించాడు. తొలుత 2.5 శాతం నుండి 27 శాతం వరకు యు.ఎస్ దిగుమతి చేసుకొనే సరుకుల మీద సుంకాలను పెంచి ప్రకటించాడు. ఒక్క చైనా మీద మాత్రం 125 శాతం సుంకం పెంచాడు.

తయారీపై ప్రభావం

2017లో మొదటి విడత అధికారంలో ఉన్నప్పుడు స్టీల్ ఉత్పత్తుల మీద పెంచిన సుంకాల మూలంగా, ఒక్క స్టీల్ పరిశ్రమ మూలంగానే 1000-2000 ఉద్యోగాలు అదనంగా అమెరికాలోకి వచ్చాయి. కొన్ని కంపెనీలు యు.ఎస్ కు తరలి రావడానికి లేదా బయటకు పోకుండా నివారించడానికి అప్పటి సుంకాల పెంపుదల కొంతవరకు తోడ్పడింది. ఈ తరుణంలోనే అమెరికా సుంకాలను తట్టుకోవడానికి, అమెరికా నుండి వచ్చే వ్యవసాయ సంబంధమైన సరుకులపై ప్రతీకార సుంకాలను చైనా పెంచింది. యు.ఎస్ దిగుమతి చేసుకొనే సరుకులపై సుంకాల మూలంగాను, వాణిజ్య యుద్ధం మూలంగాను అమెరికాలో ఉత్పత్తి ఖర్చులు పెరిగాయి. అలాగే ట్రంప్ పెంచిన సుంకాల మూలంగా దిగుమతుల్లో ఒడిదుడుకులు ఎదురై సప్లై చైన్ దెబ్బతిని దేశీయ ఉత్పత్తుల పెరుగుదల మొదట్లో పెరిగింది కూడా. 2019 వచ్చేసరికి నిలబడలేదు. అమెరికాలోని ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్న ఎకనామిక్ పాలసీ ఇన్‌స్టిట్యూట్ అధ్యయనం ప్రకారం 2020 వచ్చేసరికి 7 లక్షల ఉద్యోగాలు పోయాయి. ఎగుమతులు తగ్గాయి.

ప్రపంచీకరణ ప్రభావం

ప్రపంచీకరణ విధానాలు అమలులోకి రావడంతో 1970 అనంతరం ప్రపంచ వ్యాపార సరళిలో తీవ్రమైన మార్పులొచ్చాయి. నార్త్ అమెరికా ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ (నాఫ్టా) మూలంగానూ, 2001లో డబ్ల్యు.టి.ఓ లోకి చైనా ప్రవేశించడంతోనూ, యు.ఎస్ లో గణనీయంగా దేశీయ ఉత్పత్తి తగ్గింది. ప్రధానంగా 2000-2015 సంవత్సరాల మధ్య 5 మిలియన్ల మాన్యుఫాక్చరింగ్ ఉద్యోగాలు పోయాయని 'ఆటో సెల్' అనే సంస్థ అధ్యయన నివేదికలో పేర్కొన్నది. ఇందులో 20-25 శాతం ఉద్యోగాలు చైనా దిగుమతులతో వచ్చిన పోటీ వల్లనే పోయాయని ఆ అధ్యయనం తెలిపింది. దానికి తోడు ఆటోమేషన్, టెక్నికల్ అడ్వాన్స్‌మెంట్ అంశాలు కూడా మాన్యుఫాక్చరింగ్ ఉద్యోగాల మీద ప్రభావం చూపి పైపరిణామానికి తోడ్పడింది. అందువల్ల అమెరికాలో ఆర్థిక పరిణామాల మీద నిపుణుల కమిటీలు కేవలం సుంకాల పెంపుదల మీద ఆధారపడి చేసే ప్రయత్నాలలో అమెరికాలో తయారీ రంగం అభివృద్ధి కావడం జరిగే పని కాదని తేల్చాయి.

వినియోగదారులపై ధరల పెరుగుదల ప్రభావం

సుంకాల పెరుగుదలతో ధరలు పెరిగి యు.ఎస్ వినియోగదారులపై భారాలు పడడం ఒక అంశమైతే, ఈ పెరుగుదలతో వ్యాపారస్తుల పెట్టుబడులు పెరిగి సరుకులు అమ్ముడుపోక లావాదేవీలు తగ్గి ఒడుదుడుకుల్ని ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చింది. ట్యాక్స్ ఫెడరేషన్ అనే సంస్థ 2018-2019లో సుంకాల పెంపు వల్ల అమెరికాలోని వినియోగదారుడు 40-50 బిలియన్ల భారాన్ని భరించాల్సి వచ్చిందని పేర్కొన్నది. ఆటోమోటివ్‌తో పాటు, ఎలక్ట్రానిక్ పరిశ్రమలు గ్లోబల్ సప్లయ్ చైన్ల మీద ఆధారపడి ఉత్పత్తి ఖర్చులు భారీగా పెరిగాయి. అలాగే ప్రతీకార సుంకాల ప్రభావం ప్రధానంగా యూరోపియన్ యూనియన్, కెనడా, చైనా దేశాల నుండి ఎదుర్కోవలసి వచ్చి యు.ఎస్ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి తగ్గింది. వీటి ఎగుమతుల్ని ప్రోత్సహించడానికి యు.ఎస్ ప్రభుత్వం 2020 వచ్చేసరికి వ్యవసాయానికి 28 బిలియన్ల సబ్సిడీ ఇచ్చి నష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చింది.

దీర్ఘకాలిక ప్రయోజనాలు

టారిఫ్‌ల పెంపుదల ఒక ప్రత్యేకమైన పరిశ్రమ రక్షణకు తోడ్పడగలదేమో గానీ, తయారీ రంగం మొత్తం నిలబడడానికి తోడ్పడేది కాదు. కార్మికులు అందుబాటుతో పాటు, నైపుణ్యం కలిగినవారై ఉండడం, మౌలిక సదుపాయాలు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ మీద తగినంత పెట్టుబడులు మొదలగునవి తయారీ రంగం అభివృద్ధికి కొలమానంగా పనిచేస్తాయి. ఇవేవీ లేకుండా ఒక్క సుంకాలు పెంచి తయారీ రంగాన్ని పెంచాలనుకోవడంలోనే అసలు లోపముంది. ఈ విధానాల మీద విమర్శనాత్మకంగా స్పందించేవారు, గ్లోబల్ ట్రేడ్‌ని సుంకాల పెంపుదల ధ్వంసం చేస్తుందని వ్యాఖ్యానిస్తున్నారు. అలాగే ధరలు పెరిగి ప్రజలపై భారం పడుతుందన్నారు. అలాగే ఈ సుంకాలు ప్రపంచీకరణ పరిణామాల్ని రివర్స్ చేయడం జరగదని పేర్కొన్నారు. ప్రపంచంలో పరిశ్రమల ఉత్పత్తి సరళిని పరిశీలిస్తే, పరిశ్రమలు ఒక చోట నుండి మరో చోటికి-తక్కువ ఖర్చులున్న దేశాలకు తరలి పోతున్న అంశం దీన్నే ధృవపరుస్తోంది. ఉదాహరణకు వియత్నాం, మెక్సికో దేశాల్లోకి పరిశ్రమలు పోతున్నాయి తప్ప, అమెరికాలోకి పోవడం లేదు.

వర్తమాన పరిస్థితి

సమాచార వేదికలైన 'ఎక్స్' వేదిక పోస్టులు, అనేక వెబ్‌సైట్ల సమాచారం ప్రకారం, 2025 సంవత్సరంలో ఉత్పత్తులపై 10 నుండి 20 శాతం సుంకాలు యూనివర్సల్‌గా భారం వేయగా చైనా ఉత్పత్తుల మీద 60 శాతం సుంకాలు ట్రంప్ పెంచాడు. దీనితో వ్యాపార లోటును తగ్గించుకొంటున్నట్లు, అలాగే దేశీయంగా తయారీ రంగాన్ని వృద్ధి పథాన నడుపుతున్నట్లు ప్రకటించాడు. ధరల పెరుగుదలతో పాటు, ప్రపంచ వాణిజ్యం విచ్ఛిన్నమై సప్లయ్ చైన్ దెబ్బ తింటుందని విమర్శకులు అంటుంటే, ట్రంప్ మద్దతుదారులు మాత్రం స్థానిక తయారీ రంగం అభివృద్ధి చెందుతుందని, ఉద్యోగాలు పెరుగుతాయని అంటున్నారు. ఈ విధమైన వాదప్రతివాదనలతో నెలకొన్న విభజన అమెరికా ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలకు అద్దం పడుతుంది. దీర్ఘకాలిక పరిష్కారం ఉన్నట్లు కనిపించడంలేదు.

సారాంశం

ప్రపంచీకరణలో పోగొట్టుకొన్న తయారీ రంగాన్ని రాబట్టడానికే ఈ సుంకాల విధానాన్ని ట్రంప్ లక్ష్యంగా ఎంచుకొన్నాడు. అయితే పైకి ఇదే కనపడ్డా అసలు వాస్తవం వర్ధమాన దేశాల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని తమ ఒత్తిడితో లొంగదీసుకోదలుచుకున్నాడు. సుంకాలతో పెరుగుతున్న ఆర్థిక భారాలు, ప్రతిఘటన, వ్యాపార అడ్డంకులు, వ్యవస్థీకృత పరిమితులు (ఆటోమేషన్, గ్లోబల్ సప్లై చైన్లు), అమెరికాకు, ట్రంప్‌నకు అవకాశాల్ని కుదిస్తున్నాయి. ప్రపంచీకరణకు ముందు కాలంలో ఉన్న తయారీ రంగాన్ని సుంకాల పెంపుదలతో రాబట్టడం సాధ్యం కాదన్నది స్పష్టమవుతుంది.

/ వ్యాసకర్త సిపిఐ(ఎం) ఎ.పి పూర్వ కార్యదర్శి /

బిసిల అభ్యున్నతే లక్ష్యం

• జాతీయ బిసి కమిషన్ చైర్మన్ గంగారాం అహిర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వెనుకబడిన తరగతుల అభ్యున్నతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారాం అహిర్ అన్నారు. విజయవాడలోని ఒక హోటల్‌లో ఒబిసి రిజర్వేషన్లు, రోస్టర్, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ వంటి అంశాలపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిసిలకు చట్ట ప్రకారం కల్పించిన రిజర్వేషన్లను అమలు అలసత్వం తగదన్నారు. సీపెట్ సంస్థ కార్యకలాపాలు, ప్లాస్టిక్ కోర్సుల్లో ఇస్తున్న శిక్షణ, తదితర అంశాలను సీపెట్ డైరెక్టర్ శేఖర్ కమిషన్ చైర్మన్‌కు వివరించారు. యూనియన్ బ్యాంక్‌లో అమలవుతున్న ఒబిసి రిజర్వేషన్లు, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ తదితర విషయాలను బ్యాంక్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంగళగిరిలోని ఎయిమ్స్ అందిస్తున్న సేవలు, పోస్టుల భర్తీ, అమలు చేస్తున్న రోస్టర్ విధానం తదితర వివరాలను సిఇఒ శాంతా సింగ్ చైర్మన్‌కు తెలియజేశారు. రాష్ట్రంలో 18 వైద్య కళాశాలలు ఉన్నాయని, వైద్య విద్యా సీట్ల కేటాయింపులో ఒబిసి రిజర్వేషన్ల వివరాలను, రోస్టర్ విధానం తదితర అంశాలను చైర్మన్‌కు వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అంతకు ముందు చైర్మన్‌కు స్వాగతం పలికారు.

ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

నిర్లక్ష్యం తగదు

• హామీలు అమలు చేయాల్సిందే
• మున్సిపల్ కమిషనరేట్ వద్ద మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల ధర్నా
• ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె ఉధృతం : కె ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్ (గుంటూరు జిల్లా)

తమ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా ఐదు రోజులుగా సమ్మె చేస్తోన్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు గురువారం మున్సిపల్ కమిషనరేట్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు గుంటూరు జిల్లా తాడేపల్లి మండలంలోని కొలనుకొండ జాతీయ రహదారి వద్ద ఉన్న కార్యాలయానికి చేరుకున్నారు. వీరిని అడ్డుకునేందుకు పోలీసులు భారీగా మోహరించినా వెరవకుండా ఎండను సైతం లెక్కచేయకుండా ఆందోళనకు దిగారు. జిఒ 36 ప్రకారం జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు.

ఐదు రోజులుగా తాము చేస్తోన్న ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను ఆమోదించి సమ్మెను పరిష్కరించాలని కోరారు. ధర్నాలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై టిడిపి కూటమి నాయకులు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. వీటి అమలుకు ఏడాదిగా ఆందోళనలు చేస్తున్నా టిడిపి కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న వారి సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని తెలిపారు. అందుకే సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. సంక్షేమ పథకాలపై సిఎం చేసిన ప్రకటనలో మున్సిపల్ కార్మికుల ప్రస్తావనలేదని, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.పది వేలకు పైబడి వేతనాలు పొందుతున్నారనే నెపంతో సంక్షేమ పథకాలు కోత విధించడం అన్యాయమన్నారు. సమాన పనికి సమాన వేతనం ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. సమస్యలపై సిఎం సానుకూలంగా ఉన్నారంటూ మున్సిపల్ శాఖ మంత్రి చెబుతున్నారేగానీ, నిర్దిష్ట చర్యలు లేవన్నారు.

గత సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీల్లో భాగమైన రిటైర్మెంట్ బెనిఫిట్స్, అంత్యక్రియలకు రూ.15 వేల నుండి రూ.20 వేలకు పెంపు, చనిపోయిన వారి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియో తదితర సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని తెలిపారు. జిఒ 36 ప్రకారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు రూ.24 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.ముత్యాలరావు, ఎస్.జ్యోతిబసు, జాన్‌బాబు, కె.శ్రీనివాసరావు, షేక్ సిలార్, పి.శ్రీనివాసరావు, నాగేంద్ర, నాగరాజు, ఆర్.వేణు, వెంకట్రావు, మల్లికార్జునరావు, సుబ్బారాయుడు, ఎన్.బాబురావు, వి.దుర్గారావు, బి.వెంకటేశ్వర్లు, ఎం.రవి, ఎస్ఎస్.చెంగయ్య, డి.వెంకటరెడ్డి, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒకటి రెండ్రోజుల్లో సానుకూల ప్రకటన : మున్సిపల్ శాఖ జాయింట్ డైరెక్టర్ మూర్తి

ధర్నా వద్దకు మున్సిపల్ శాఖ జాయింట్ డైరెక్టర్ మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్రామయ్య వచ్చి కార్మికులతో మాట్లాడారు. కార్మికులకు సానుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం ఒకటి రెండ్రోజుల్లో ప్రకటన చేస్తుందన్నారు. ప్రస్తుతం మున్సిపల్ శాఖ మంత్రి, సంబంధిత అధికారులు ఢిల్లీ వెళ్లారని, కార్మికుల శ్రమ వల్ల వచ్చిన స్వచ్ఛ అవార్డును తీసుకోవడానికి వెళ్లారని, వారు తిరిగి వచ్చాక ప్రకటన ఉంటుందని తెలిపారు.

సర్కారు బడుల్లో తగ్గుతున్న విద్యార్థులు

ఈ ఏడాది తగ్గిన 3 లక్షల మంది

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ప్రతి ఏటా తగ్గుతోంది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ బడులకు బారులు తీరుతున్నా రంటూ ప్రభుత్వ పెద్దలు చేస్తున్న ప్రకటనలకు భిన్నమైన పరిస్థితి క్షేత్రస్థాయిలోకన పడుతోంది. తాజా గణాంకాల ప్రకారం గత ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 32.50 లక్షల మంది విద్యార్థులు ఉండగా, ఈ ఏడాది వారి సంఖ్య 29.65 లక్షలు మాత్రమే. అంటే దాదాపుగా 3లక్షల మంది విద్యార్థుల తగ్గుదల ఈ ఏడాది నమోదైంది.రాష్ట్రంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న 43,922 పాఠశాలల్లోనూ దాదాపుగా ఇదే స్థితి! గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేపడుతున్న తరగతుల విలీనం వల్లే ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య భారీగా పడిపోతుందని విద్యావేత్త లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 3, 4, 5 తరగతుల ను కిలోమీటర్ల అవతల ఉన్న పాఠశాలలకు పంపడం వల్ల అక్కడ 1, 2 తరగతులే మిగులుతు న్నాయి. దీంతో 1, 2 తరగతుల విద్యార్థుల సంఖ్య 10 నుంచి 15 లోపే ఉండటంతో అవి ఏకోపా ధ్యాయ పాఠశా లలుగా మిగులుతున్నాయి. దీంతో ఆ పాఠశాలలకు పంపేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు సుముఖత వ్యక్తం చేయడం లేదని విద్యావేత్తలు చెబుతున్నారు. మరోపక్క అమ్మఒడి, తల్లికి వందనం పథకాలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు కూడా అమలు చేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అమాంతంగా పడిపోతోంది. తరగతుల విలీనంతో దూరంగా ఉన్న పాఠశాలలకు తల్లిదండ్రు లు పంపలేకపోతున్నారు. ఈ విద్యార్థులను ప్రైవేట్ యాజమాన్యాలు బస్సు పెట్టి మరీ తమ పాఠశాలల్లో చేర్చుకుంటున్నాయి. దీంతో ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతోంది. మరోపక్క 4,750 ప్రభుత్వ పాఠశాల ల్లో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. శ్రీకాకుళం జిల్లాలో 30 మండలాల్లో 2024-24 విద్యాసంవత్సరంలో 1వ తరగతిలో 24,803 మంది విద్యార్థులు చేరగా, ఈ ఏడాది ఆ సంఖ్య 19,370కు పడిపోయింది. ఈ 30 మండలాల్లోనే 1 నుంచి 10వ తరగతి వరకు గతేడాది 2,73,881 మంది విద్యార్థులు చదువు తుండగా, ఈ ఏడాది 2,55,806 మందే ప్రభుత్వ బడుల్లో చదువుతున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 43,922 పాఠశాలల్లో 29,65 లక్షల మంది, 16వేలుగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో 38.90లక్షల మంది విద్యార్థులు చదువుతున్న పరిస్థితి నెలకొంది. 2021-22 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 45.60 లక్షలుగా ఉన్న విద్యార్థుల సంఖ్య నాలుగేళ్లల్లో 29.65 లక్షలకు పడిపోయింది.

అమెరికా చిన్నారిని దత్తత తీసుకునే హక్కు భారతీయులకు లేదు

• బాంబే హైకోర్టు

ముంబయి: అమెరికా జాతీయులైన చిన్నారిని దత్తత తీసుకునే ప్రాథమిక హక్కు భారతీయులకు లేదని బాంబే హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. సంరక్షణ, భద్రత అంశాలు లేదా చట్టపరమైన విధానం లేని సమయంలో బంధువులైనా సరే దత్తతకు అవకాశం లేదని తెలిపింది. జువెనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ, భద్రత) చట్టం, దత్తత నిబంధనల ప్రకారం ప్రస్తుత కేసులోని చిన్నారి వీటి పరిధిలోకి రాదని హైకోర్టు పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ రేవతి మోహితే డేరే, జస్టిస్ నీలా గోఖలేతో కూడిన డివిజన్ ధర్మాసనం తీర్పు వెల్లడించింది. అమెరికా పౌరుడైన తమ బంధువుల చిన్నారిని దత్తత తీసుకునేందుకు అనుమతించాలంటూ భారతీయ జంట దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది.

అసాధారణ అధికార పరిధిని వాడేందుకు ధర్మాసనం నిరాకరణ

"విదేశీ పౌరసత్వం కలిగిన చిన్నారిని బంధువులైనా సరే దత్తత తీసుకోవడానికి జువెనైల్ జస్టిస్ చట్టంలో లేదా దత్తత విధానంలో ఎలాంటి నిబంధన లేదు. ఆ చిన్నారికి సంరక్షణ అవసరమని భావించినప్పుడు తప్పితే దత్తతకు అవకాశం ఉండదు" అని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే దత్తత అనుమతి ఇచ్చేందుకు తన అసాధారణ అధికార పరిధిని వాడేందుకు కూడా ధర్మాసనం నిరాకరించింది. అమెరికా జాతీయుడైన చిన్నారి దత్తత తీసుకోవడానికి పిటిషనర్లకు ప్రాథమిక హక్కు లేదని తేల్చి చెప్పింది.

'హంద్రీనీవా' వచ్చే ఏడాది చిత్తూరుకు

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామని చెప్పారు. యువగళం పాదయాత్రలో లోకేష్ ప్రకటించిన రాయలసీమ డిక్లరేషన్‌ను అమలు చేస్తామన్నారు. ఆ డిక్లరేషన్‌లో భాగంగా లోకేష్ చేసిన హామీలన్నింటిని అమలు చేస్తామన్నారు. ఆగస్టు 20లోపు మెగా డిఎస్‌సి టీచర్ల నియామకాలు పూర్తి చేస్తామని తెలిపారు. శ్రీశైలం ఫుల్ ఫ్లడ్ కారణంగా ప్రభుత్వం 6 రేడు చేస్తుందని ఢిల్లీ సమావేశంలో చెప్పినట్లు తెలిపారు. 2014-19 మధ్య టిడిపి హయాంలో రాయలసీమ ప్రాజెక్టులపై రూ.12,500 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఆ తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం రూ.2 వేల కోట్లు కూడా ఖర్చు పెట్టలేదన్నారు. 2018లో హంద్రీనీవా నీటిని కుప్పంకు తీసుకెళ్లాలని తాము ప్రయత్నిస్తే, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. నదుల అనుసంధానం తన జీవిత ఆశయమన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి నదులను అనుసంధానం చేస్తే రాష్ట్రంలో కరువు అనే మాట రాదని పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు 120 టిఎంసిల నీళ్లు ఇచ్చామని చెప్పారు. వర్షాకాలం కూడా రాకముందే జలాశయాల్లో 50 శాతం నీళ్లు ఉండే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాయలసీమను కొందరు ఓట్ల రాజకీయాలకు వాడుకున్నారని విమర్శించారు. రాయలసీమను రాళ్లసీమ కాకుండా మణిహారంగా తయారు చేస్తామన్నారు.

ఓర్వకల్లు డ్రోన్ సిటీలో దేశానికి కావాల్సిన డ్రోన్లను తయారు చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌తో సమానంగా అమరావతిని తయారు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, బిసి జనార్దన్ రెడ్డి, ఎన్ఎండి ఫరూక్, నంద్యాల ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాండ్ర శివానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఢాకాలో ఘర్షణలు, కర్ఫ్యూ విధింపు

ఢాకా : బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో బుధవారం నిర్వహించిన నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్‌సిపి) ర్యాలీలో ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈ ఘర్షణలో నలుగురు మృతి చెందారు. దీంతో ఢాకా వ్యాప్తంగా బుధవారం రాత్రి 8 గంటల నుంచి 22 గంటల కఠినమైన కర్ఫ్యూను అధికారులు అమలు చేశారు. 14 మందిని అరెస్టు చేశారు.

ADITYA BIRLA CAPITAL — PROTECTING INVESTING FINANCING ADVISING

ఆదిత్యా బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్- ఇండియన్ రేయాన్ కాంపౌండ్, వెరావల్, గుజరాత్ - 362266
బ్రాంచ్ ఆఫీస్- 3 అర్డి ఫ్లోర్, 40-1-52సి, కెబిసిఎల్ భవనం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఎదురుగా, బెంజ్ సర్కిల్ ఎంజి రోడ్ దగ్గర, విజయవాడ, ఆంధ్రప్రదేశ్- 520010.

అనుబంధం-4 (సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(1)ను చూడుము)

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (2002 యొక్క 54) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ **ఆదిత్యా బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారి అధీకృత అధికారి అయిన ఈ క్రింది సంతకందారు **తేది: 22.04.2025**తో జారీ చేసిన డిమాండ్ నోటీసు ప్రకారము **రుణగ్రహీతలు సంగెపు వెంకట సాంబశివ రావు & సంగెపు తిరుపతమ్మ త్రివేణి** వారిని నోటీసులో తెలిపిన బకాయి మొత్తము **రూ. 20,89,346.87/- (రూపాయలు ఇరవై లక్షల ఎనభై తొమ్మిది వేల మూడు వందల నలభై ఆరు మరియు పైసలు ఎనభై ఏడు మాత్రమే)**లను సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని కోరడమైనది.
కాని రుణగ్రహీతలు బకాయి మొత్తమును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదవబడు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ దిగువ సంతకముదారు క్రింద తెలిపిన ఆస్తిని **తేది: 16 జులై, 2025**న స్వాధీనం చేసుకోవడమైనదని రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమైనది.
కావున ప్రత్యేకించి రుణగ్రహీతను మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదనియు ఒక వేళ జరిపినట్లయితే **ఆదిత్యా బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారికి చెందవలసిన బకాయి మొత్తము **రూ. 20,89,346.87/- (రూపాయలు ఇరవై లక్షల ఎనభై తొమ్మిది వేల మూడు వందల నలభై ఆరు మరియు పైసలు ఎనభై ఏడు మాత్రమే)** మరియు దానిపై వడ్డీ క్రింద వర్తించును. సదరు చట్టములోని సెక్షన్ 13 సబ్-సెక్షన్ (8)లోని సదుపాయముల క్రింద మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు ఇదియే సరియైన సమయమని భావించమని రుణగ్రహీత యొక్క అప్రమత్తతను ఆహ్వానిస్తున్నాము.

స్థిరాస్తి వివరణ
పార్టిషన్ డీడ్ డాక్యుమెంట్ నం. 1419/2015, తేదీ. 23.03.2015 కింద కవర్ చేయబడిన ఆస్తి షెడ్యూల్: (ఎ-షెడ్యూల్): ఆంధ్రప్రదేశ్-522509, గుంటూరు జిల్లా, పెదకాకాని ఉప జిల్లా, పెదకాకాని గ్రామ పంచాయతీ ప్రాంతం, ఎ.0.21 సెంట్ల విస్తీర్ణంలో 213.06 చ.గ.ల విస్తీర్ణంలో 98 చ.గ.ల ఆర్.సి.సి. రూఫ్ విస్తీర్ణము గల గ్రౌండ్ ఫ్లోర్ నివాస భవనము గల డి.నం.582/బి యావదాస్తి. **సరిహద్దులు: తూర్పు:** దిగువన ఉన్న బి-షెడ్యూల్‌కు చెందిన ఆస్తి, 36.00 అడుగులు. **పశ్చిమం:** స్థలం కాకాని పానకాలుకు చెందినది, 36.00 అడుగులు. **ఉత్తరం:** మార్కాపురం శంకరరావుకు చెందిన స్థలం, 24.06 అడుగులు, **దక్షిణం:** మున్నగి పానకాలు మరియు ఇతరులకు చెందిన స్థలం, 24.06 అడుగులు.

తేది: 16.07.2025 — అధీకృత అధికారి,
ప్రదేశం: విజయవాడ — ఆదిత్యా బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

केनरा बैंक Canara Bank (A Government of India Undertaking)

లావెల్లె రోడ్ బ్రాంచ్,
నెం.4/1, వాల్టన్ రోడ్, బెంగళూరు-560001.
Mob: 9483520887,
Mail id: cb0887@canarabank.com

స్వాధీనతా ప్రకటన (రూల్ 8(1)) (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ 2002 యొక్క 54) (ఇకముందు చట్టంగా వ్యవహరించెదరు) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ **కెనరా బ్యాంక్, లావెల్లె రోడ్ బ్రాంచ్** వారి అధీకృత అధికారి అయిన ఈ క్రింది సంతకందారు **తేది: 07.04.2025**తో జారీ చేసిన డిమాండ్ నోటీసు ప్రకారము **రుణగ్రహీత (ఎ) మెస్సర్స్ Nuv వెల్లూర్ LLP, నెం. 10/6, 4వ అంతస్తు, లావెల్లే రోడ్, బెంగళూరు-560001. (బి) మెస్సర్స్ Nuv వెల్లూర్ LLP, ఎన్‌హెచ్ 46 (ఎల్ & టి రెస్ట్ ఏరియా), మోత్తూర్ గ్రామం, అబ్దుల్లాపురం, వెల్లూరు తమిళనాడు-632010. (2) శ్రీ వెంకట శ్రీకాంత్ నువ్వల (భాగస్వామి) శ్రీ టవర్స్, ఫ్లాట్ నెం.401, శివాజీ రోడ్, అయ్యప్ప నగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520007. (3) శ్రీ కె ఆర్ రామలింగయ్య (భాగస్వామి) తండ్రి ఆర్‌వి రాజగోపాలయ్య 8-6-6, కంసాల్‌పేట్, హిందూపూర్, అనంతపూర్, ఆంధ్ర ప్రదేశ్- 515201. (4) శ్రీమతి సౌమ్య ఎం ఆర్ (తనఖాదారు & హామీదారు) భర్త గిరిజాశంకర్ బి ఎల్, 145, 60 అ.ల రోడ్, 5వ స్టేజ్, బిఇఎంఎల్ లేఅవుట్, రాజరాజేశ్వరినగర్, బెంగళూరు-560098** వారిని నోటీసులో తెలిపిన బకాయి మొత్తము **రూ.4,11,99,339.41 (రూపాయలు నాలుగు కోట్ల పదకొండు లక్షల తొంభై తొమ్మిది వేల మూడు వందల ముప్పై తొమ్మిది మరియు పైసలు నలభై ఒకటి మాత్రమే)** మరియు దానిపై వడ్డీతో సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని కోరడమైనది.
కాని రుణగ్రహీతలు బకాయి మొత్తమును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8 & 9తో చదవబడు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతడు/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ దిగువ సంతకముదారు క్రింద తెలిపిన ఆస్తిని **తేది: 16 జులై, 2025**న స్వాధీనం చేసుకోవడమైనదని రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమైనది.
కావున ప్రత్యేకించి రుణగ్రహీతను మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదనియు ఒక వేళ జరిపినట్లయితే **కెనరా బ్యాంక్, లావెల్లె రోడ్ బ్రాంచ్** వారికి చెందిన బకాయి మొత్తము **రూ.4,11,99,339.41 (రూపాయలు నాలుగు కోట్ల పదకొండు లక్షల తొంభై తొమ్మిది వేల మూడు వందల ముప్పై తొమ్మిది మరియు పైసలు నలభై ఒకటి మాత్రమే)** మరియు దానిపై వడ్డీ క్రింద వర్తించును.
సదరు చట్టములోని సెక్షన్ 13(8)లోని సదుపాయముల క్రింద మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు ఇదియే సరియైన సమయమని భావించమని రుణగ్రహీత యొక్క అప్రమత్తతను ఆహ్వానిస్తున్నాము.

సెక్యూర్డ్ ఆస్తుల వివరణ
టైటిల్ హోల్డర్ పేరు: శ్రీమతి సౌమ్య ఎం ఆర్
స్థిర: BBMP Khatha No. 1037/240/4/1 ప్రకారం బెంగళూరు, రాజరాజేశ్వరి నగర్ సబ్ డివిజన్, బృహత్ బెంగళూరు మహానగర్ పలికె అధికార పరిధిలోని బెంగళూరు సౌత్ తాలుక, కెంగేరి హోబ్లీ, హాలగేవదేరహళ్లి గ్రామం వద్ద ఉన్న 30 గుం.లలోని 17.22 గుంటలు (18571 చ.అ.ల) విస్తీర్ణము గల కన్వర్షన్ ఆర్డర్ నెం. ALN(S)SR(K)177/2009-10 ప్రకారం, సర్వే నెం.240/4 గల కన్వర్టెడ్ భూమి యావదాస్తి. **సరిహద్దులు: తూర్పు:** 60 అడుగుల రోడ్డు, **పశ్చిమం:** సర్వే నెం. 241 మరియు సర్వే నెం. 240/4 లోని మిగిలిన భాగం, **ఉత్తరం:** రోడ్ మరియు సర్వే నెం. 240/7 మరియు **దక్షిణం:** సర్వే నెం. 240/4 లోని మిగిలిన భాగం.

తేది: 16.07.2025 — సం/- అధీకృత అధికారి,
ప్రదేశం: బెంగళూరు — కెనరా బ్యాంక్

IN THE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
Gr. & 1st Floor, Sri Narayana Bhawan, Sai Baba street, Dabagardens, Visakhapatnam-530020

Case No. O.A. No:166 OF 2025

Between:
PEGAUSUS ASSETS RECONSTRUCTION PRIVATE LIMITED,
Mumbai (Assignee of RBL Bank Ltd., Vijayawada) **** APPLICANT
And
M/s Pattabhi's and others ****DEFENDENTS

ADDRESS OF DEFENDANTS
1) M/s PATTABHI'S rep. by its Proprietor M Siva Naga Bhushanam, R/o D.No.3-279, Main Road, Main Center, Vuyyuru, Krishna District-521165.
2) M. Siva Naga Bhushanam S/o Maaguluri Anka Rao, R/o D.No.267, Akshaya Tulasi Nivas, Sivalayam Street, Vuyyuru, Krishna District-521165.
3) Mogoluri Nagashanthi W/o Venkateswara Rao Adapala, R/o D.No.267, Akshaya Tulasi Nivas, Sivalayam Street, Vuyyuru, Krishna District - 521165.

SUMMONS SERVED BY WAY OF PUBLICATION BY THE APPLICANT
Whereas **OA 166 of 2025** was listed before the Honorable Presiding Officer/Register on **25-06-2025.**
Whereas this Hon'ble Tribunal is pleased to issue summons/Notice on the said Application under section 19(4) of the act, (OA) filed against you for recovery of debts of **Rs 2,09,80,042.90ps**. (O.A will be handed over to the Defendants at the time of appearance before the DRT.
In Accordance with sub-section (4) of section 19 of the Act, you the defendants are directed as under:
కృష్ణా జిల్లా, గన్నవరం సబ్-రిజిస్ట్రీ, ఉంగుటూరు (మం), ఉంగుటూరు గ్రామం, 1వ వార్డు, పాత డోర్ నెం.1-34, అసెస్‌మెంట్ నెం.29, కొత్త డోర్ నెం.1-39, కొత్త అసెస్‌మెంట్ నెం.39లో **320 చ॥గ॥ విస్తీర్ణంలో ఆర్‌సిసి రూఫ్డ్ బిల్డింగ్ హద్దులు: తూర్పు:** తార్ రోడ్ - 35 అ॥లు, **దక్షిణం:** 10.6 అ॥ల వెడల్పు జాయింట్ బజార్ - 88 అ॥లు, **పడమర:** ధర్మవరపు వెంకట లక్ష్మి యొక్క స్థలం - 30.6 అ॥లు, **ఉత్తరం:** పొట్లూరి రామమోహనరావు ప్రహారీ గోడ - 88 అ॥లు.
గమనిక: కెనరా బ్యాంక్ అధీకృత అధికారి జారీచేసిన మునుపటి స్వాధీనత నోటీసు తేదీ: 13.05.2025 ఉపసంహరించుకున్నాము.

తేది : 15.07.2025 — సం/- అధీకృత అధికారి,
స్థలం : విజయవాడ — కెనరా బ్యాంక్

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ — IDFC FIRST Bank
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో విలీనమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పేర్కొనబడుతుంది) CIN: L65110TN2014PLC097792
రిజిష్టర్డు ఆఫీసు:- కెఆర్‌ఎం టవర్స్, 8వ అంతస్తు, హరింగ్టన్ రోడ్, చెట్పెట్, చెన్నై-600031.
టెలి: +91 44 4564 4000, ఫ్యాక్స్: +91 44 4564 4022

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసు

ఏదైతే, **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో విలీనమైంది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పేర్కొనబడుతుంది)** నుంచి దిగువ తెలిపిన రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు దిగువ తెలియపరిచిన సెక్యూర్డ్ లోన్స్‌ను తీసుకొని ఉన్నారు. రుణగ్రహీతలు మరియు సహ రుణగ్రహీతలు వారు వారి యొక్క ఆస్తులను తనఖా పెట్టి లోన్‌ను తీసుకున్నారు. వారు వారి యొక్క లోన్ అగ్రిమెంట ప్రకారం ఉన్న నియమాలు మరియు నిభందనలు పాటించడంలో విఫలమైనారు మరియు వారి యొక్క లోన్‌ను ఆర్‌బిఐ గైడ్ లైన్స్ ప్రకారం ఎన్‌పిఏ లుగా వర్గీకరించబడినాయి. వారు సదరు **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో విలీనమైంది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పేర్కొనబడుతుంది)** బ్యాంకు వారికి బకాయి ఉన్న మొత్తంను నోటీసులో జారీ చేయబడిన విధంగా దిగువ టేబుల్‌లో వివరింపబడ్డాయి మరియు బకాయిల మీద తదుపరి వడ్డీ కూడా ఉంటుంది మరియు అదే కాంట్రాక్టువల్ రేటు ప్రకారం తెలిపిన తేదీలలో ఆమోదించబడతాయి.

క్ర. సం	లోను అకౌంట్ నెం	లోను రకం	రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీతల పేరు	సెక్షన్ 13(2) నోటీసు తేది	సెక్షన్ 13(2) నోటీసు ప్రకారం బకాయి మొత్తం
1	107735910	ఆస్తి పై రుణం	1. రమావత్ జ్యోతి బాయి, 2. రమావత్ దేవ నాయక్	10.05.2025	INR 5,12,542.00/-

ఆస్తి చిరునామా : ఆంధ్రప్రదేశ్-522615, పల్నాడు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, పిడుగురాళ్ల ఉపజిల్లా, నకరికల్లు మండలం, హెచ్/ఓ గుండ్లపల్లి, బాలాజీ నగర్ తాండా గ్రామ పంచాయతీ, గుండ్లపల్లి గ్రామంలో ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ డో.నం.665, మూల్యాంకనం నం.137, డో.నం.1-137 సైట్ విస్తీర్ణం 72.6 చ.గ.లు. లేదా 60.69 చ.మీ.లు. 3 సం॥ల ముందు నిర్మించబడిన ఎసిసి రేకుల రూఫ్డ్ ఇంటి సైట్ 300 చ.అ.లు. తో అన్నీ సౌలభ్య హక్కులు మరియు **సరిహద్దులు : తూర్పు: పంచాయతీ రోడ్డు, పడమర : రమావత్ స్వామి నాయక్ ఇల్లు, ఉత్తరం : రమావత్ సర్దార్ నాయక్ ఇల్లు, దక్షిణం : రమావత్ బుజ్జి ఇల్లు.**

మీకు తెలియజేయవలసినది ఏమనగా **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో విలీనమైంది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పేర్కొనబడుతుంది)** కు బకాయిలను చెల్లిచవలసిందిగా మరియు టేబుల్ లో చూపించిన దాని ప్రకారం కాంట్రాక్టువల్ రేటు ప్రకారం దాని యొక్క తేదీలతో పాటుగా ఇతర ఖర్చులు, చార్జీలు మరియు ఇతరమైనవి ఈ నోటీసు ప్రచురించిన 60 రోజులలోగా చెల్లించవలెను., ఒకవేళ మీరు గనుక చెల్లించడంలో విఫలమైతే, దిగువసంతకాదారు SARFAESI చట్టం యొక్క సెక్షన్ 14 మరియు సెక్షన్ 13(4) ప్రకారం **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో విలీనమైంది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పేర్కొనబడుతుంది)** బ్యాంకు వారు వారి యొక్క ప్రక్రియ మొదలుపెడతారు. కనుక మీరు సెక్షన్ 13(13) ప్రకారం మీరు మీ యొక్క సెక్యూర్డ్ ఆస్తులను అమ్మడం/లీసు కు ఇవ్వడం గానీ లేదా ఇతర పనులు చేయడానికి మీకు అనుమతి లేదు.

సం/-
అధీకృత అధికారి
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో విలీనమైంది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పేర్కొనబడుతుంది)

తేది : 18.07.2025
ప్రదేశం : పల్నాడు, ఆంధ్రప్రదేశ్

సుప్రీంకోర్టును ఆశ్రయించిన లాలూ ప్రసాద్

న్యూఢిల్లీ : రైల్వే ఉద్యోగ నియామకాలకు భూమి బదలాయింపు అనే కుంభకోణం కేసులో ట్రయల్ కోర్టు విచారణపై స్టే విధించాలని కోరుతూ ఆర్‌జెడి వ్యవస్థాపకులు లాలూ ప్రసాద్ యాదవ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ ఎంఎం సుంద్రేశ్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం ఈ నెల 18న విచారించే వీలుంది. ట్రయల్ కోర్టు విచారణపై స్టే విధించాని కోరుతూ లాలూ ప్రసాద్ ముందుగా ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. విచారణపై స్టే విధించడానికి ఎలాంటి కారణలూ లేవని తెలిపింది. 2004 నుంచి 2009 వరకూ లాలూ ప్రసాద్ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ఈ స్కామ్ జరిగిందని కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) 2022 మే 18న ఈ కేసు నమోదు చేసింది. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో వెస్ట్ సెంట్రల్ జోన్‌లో గ్రూప్ డి నియామకాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని, అక్రమంగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు లాలూ, అతని కుటుంబ సభ్యులకు భూములు బహుమతిగా ఇచ్చారని సిబిఐ అభియోగాలు మోపింది. రాజకీయ దురుద్దేశ్యంతోనే తనపై దాదాపు 14 ఏళ్ల తర్వాత కేసు నమోదు చేశారని లాలూ పేర్కొన్నారు.

బీహార్‌లో చర్చలు కొలిక్కి

- కాంగ్రెస్‌కు 50కు పైగా సీట్లు

పాట్నా : బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, ఆర్‌జెడి మధ్య సీట్ల విషయంలో చర్చలు ముగింపు దశకు వచ్చినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌కు 50కు పైగా సీట్లు ఇవ్వడానికి ఆర్‌జెడి సుముఖంగా ఉన్నట్లు సమాచారం. 2020 ఎన్నికలు మాదరిగానే ఈసారి కూడా 70 సీట్లు ఇవ్వాలని కాంగ్రెస్ కోరినా ఆర్‌జెడి మాత్రం అందుకు అంగీకరించలేదని, 50 పైగా సీట్లు ఇవ్వడానికి ఒప్పుకుందని సంబంధిత వ్యక్తులు చెప్పారు. బీహార్‌లో మహాగట్బంధన్ పేరుతో ఆర్‌జెడి, కాంగ్రెస్, వామపక్షాలు కలిసి 2020 ఎన్నికల్లో పోటీ చేశాయి. రాష్ట్రంలో మొత్తంగా 243 అసెంబ్లీ స్థానాలు ఉండగా, ఆర్‌జెడి 144 స్థానాలు, కాంగ్రెస్ 70, సిపిఎం 4, సిపిఐ 6, సిపిఎం (ఎంఎల్) 19 స్థానాల్లోనూ పోటీ చేశాయి. ఈ ఏడాది కాంగ్రెస్‌తో చర్చలు సానుకూల వాతావరణంలో జరుగుతున్నాయని ఆర్‌జెడి కీలక నేత ఒకరు తెలిపారు.

తొక్కిసలాట ఘటనకు ఆర్‌సిబి ప్రచారమే కారణం

- హైకోర్టులో కర్ణాటక ప్రభుత్వం

బెంగళూరు : బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వెలుపల జూన్ 4న జరిగిన తొక్కిసలాటకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి) నే కారణమని కర్ణాటక ప్రభుత్వం పేర్కొంది. గత నెలలో కర్ణాటక హైకోర్టులో సమర్పించిన నివేదిక తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వార్తా సంస్థ ఈ మేరకు ఒక కథనాన్ని ప్రచురించింది. ఘటన జరిగిన రోజు సంఘటనలను, హైకోర్టు అడిగిన ప్రశ్నలకు సమాధానాలను అనుబంధ డాక్యుమెంట్లతో సహా సదరు నివేదికలో రాష్ట్ర ప్రభుత్వం వివరించింది. బెంగళూరు పోలీసుల నుంచి ఎలాంటి అనుమతి, సంప్రదింపులు లేకుండానే విజయోత్సవ వేడుకలో ప్రజలకు ఉచిత ప్రవేశం ఉంటుందని ఆర్‌సిబి తన సోషల్ మీడియాలో ప్రకటించిందని, ప్రజలను పరేడ్‌కు ఆహ్వానించిందని ప్రభుత్వం విమర్శించింది. ఈ పరేడ్‌ను బెంగళూరు ప్రజలతో జరుపుకోవాలని ఆర్‌సిబి ఉద్దేశించిందని విరాట్ కోహ్లి చెబుతున్న ఒక వీడియో క్లిప్‌ను కూడా ఆర్‌సిబి షేర్ చేసిందని ప్రభుత్వం తన నివేదికలో స్పష్టం చేసింది. ఆర్‌సిబి ప్రకటన కారణంగానే లక్షలాది మంది అభిమానులు స్టేడియం వద్ద గుమిగూడారని నివేదిక పేర్కొంది. మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో తొక్కిసలాటలు జరిగాయని నివేదిక పేర్కొంది. డిఎస్‌పి స్థాయి అధికారితో సహా ఏడుగురు పోలీస్ సిబ్బంది గాయపడినట్లు నివేదిక తెలిపింది. జూన్ 4న జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించిన సంగతి తెలిసిందే.

బిజెపి 'ఎలక్షన్ చోర్' శాఖగా ఇసి

- బీహార్ ఎస్‌ఐఆర్‌పై రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల సంఘం బిజెపికి పక్షపాతంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. బీహార్‌లో ఓటర్ జాబితాలో ఓట్లను ప్రత్యేక సమగ్ర సవరణ పేరిట తొలగిస్తున్నట్టు ఆరోపించారు. ఈ క్రమంలోనే ఎన్నికల సంఘం స్వతంత్రతపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. 'ఇసి.. ఎలక్షన్ కమిషన్‌లా కాకుండా పూర్తిగా బిజెపి 'ఎలక్షన్ చోర్ (ఎన్నికల దొంగ)' శాఖగా మారిపోయిందని పేర్కొన్నారు. అజిత్ అంజుమ్ అనే యూట్యూబర్ బీహార్ ఓటర్ జాబితాపై నిర్వహిస్తున్న సిరీస్‌ను పోస్ట్ చేశారు. ఓటర్లకు సంబంధించిన వివరాలు తెలుసుకోకుండానే సంతకం చేసి జాబితా నుంచి తొలగిస్తున్న అధికారుల దృశ్యాలను అందులో షేర్ చేశారు.

6.85 శాతం మాత్రమే బ్యాలెన్స్: ఇసి

కాగా కేవలం 6.85 శాతం ఓటర్లు మాత్రమే ఎన్యూమరేషన్ పత్రాలను నింపేవారు మిగిలి ఉన్నారని ఎన్నికల సంఘం బుధవారం వెల్లడించింది. ఎస్‌ఐఆర్ ప్రక్రియ పూర్తి చేసి, ఎన్యూమరేషన్ పత్రాలను ఎన్నికల సంఘానికి సమర్పించేందుకు ఇంకా తొమ్మిది రోజుల సమయం ఉందని చెప్పింది. బీహార్‌లోని మొత్తం 7.89 కోట్ల మంది ఓటర్లలో 6.99 కోట్లకు పైగా ఓటర్లు పత్రాలను సమర్పించినట్టు వెల్లడించింది. ముసాయిదా ఓటర్ జాబితాను ఆగస్టు 1న ప్రకటిస్తామని వెల్లడించింది.

అస్సాంలోనూ బుల్డోజ్‌రాజ్

- అటవీ ప్రాంతం సమీపాన హింసాత్మకంగా ఇళ్ల తొలగింపు
- పోలీసు కాల్పుల్లో ఒకరు మృతి, 10 మందికి గాయాలు

బుల్డోజర్లతో పేదల ఇళ్లు తొలగిస్తున్న ప్రభుత్వ యంత్రాగం

గౌహతి : ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్‌లో యథేశ్చగా కొనసాగుతున్న బుల్డోజ్‌రాజ్ దారుణాలు అస్సాంలోనూ మొదలయ్యాయి. అస్సాంలోని గోల్పారా జిల్లాలోని అటవీ ప్రాంతానికి సమీపాన 'అక్రమణల తొలగింపు' పేరిట పేదలను వీధులపాల్జేస్తున్నారు. ఇళ్లను తొలగించి అటవీ ప్రాంతం నుంచి వెళ్లగొడుతున్నారు. తాత్కాలిక గూడు వేసుకున్నా..అక్కడి బిజెపి ప్రభుత్వం వాటిని కూడా తొలగించి కర్కశం చూపుతోంది. గురువారం కూడా ఇలాంటి ఘటనే చోటుచేసుకోవడంతో ప్రతిఘటించిన పేదలపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఒకరు చనిపోగా..మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం..పాలికన్ రిజర్వ్ అటవీ ప్రాంతంలో 140 ఎకరాల అటవీ భూమిలో 1080 కుటుంబాలు నివాసముంటున్నాయి. వారిని అక్కడ నుండి తొలగించడానికి ప్రభుత్వం ఈనెల 12న పెద్ద ఎత్తున చర్యలు చేపట్టింది. మొత్తంగా 1080 కుటుంబాల ఇళ్లనూ నేల మట్టం చేశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు కూడా లేకుండా ఈ విధ్వంసం జరిగింది. దాదాపు వెయ్యిమంది భద్రతా సిబ్బంది పాల్గొన్నారు. ఇళ్లను కూల్చేసినప్పటికీ తాము వెళ్లడానికి మరెక్కడా చోటు లేదంటూ టార్పాలిన్ శిబిరాలు వేసుకుని ఇంకా చాలామంది బాధితులు అక్కడ నివాసముంటున్నారు. దానిని కూడా సహించలేని బిజెపి ప్రభుత్వం తాత్కాలిక శిబిరాలను కూడా తొలగించేందుకు గురువారం ఉదయం ప్రయత్నించింది. భారీ ఎత్తున పోలీసు బలగాలను మోహరించడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాత్కాలిక గూడు కూడా తొలగిస్తే ఇక తామెక్కడ తలదాచుకోవాలని నిలదీశారు. దీంతో పోలీసులు వారిపై విరుచుకుపడ్డారు. లాఠీలతో పెట్రేగిపోయారు. స్థానికులు ప్రతిఘటించడంతో పోలీసులు కాల్పులు జరిపారు. ముగ్గురికి బుల్లెట్ గాయాలయ్యాయి. వీరిలో ఒకరు చనిపోయారు. మరో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఇదే ఘటనలో 10 మంది పోలీసులకు గాయాలైనట్లు ఐజి (శాంతి భద్రతలు) అఖిలేష్ సింగ్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తిని షాక్వర్ అలీగా గుర్తించినట్లు ఆయన చెప్పారు. గత నెల రోజులుగా రాష్ట్రంలో వరుసగా తరలింపులు చేపడుతున్న ప్రభుత్వ చర్యలతో ఇప్పటివరకు నాలుగు జిల్లాలు ప్రభావితమయ్యాయి. 3300 మందిని తరలించారు.

చాలా సున్నితమైన విషయం

- నిమిష ప్రియ వ్యవహారంపై విదేశాంగశాఖ వ్యాఖ్య

న్యూఢిల్లీ : యెమెన్‌లో కేరళ నర్సు నిమిష ప్రియకు ఉరిశిక్ష వ్యవహారం చాలా సున్నితమైన విషయమని కేంద్ర విదేశాంగ శాఖ వ్యాఖ్యానించింది. అయితే ఈ కేసు పరిష్కారం కోసం అన్ని సహాయాలను అందిస్తున్నామని తెలిపింది. ఈ విషయాన్ని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ గురువారం మీడియా సమావేశంలో వెల్లడించారు. యెమెన్‌లోని స్థానిక అధికారులతో స్నేహపూర్వక సంప్రదింపులు జరుపుతున్నామని, నిమిష ప్రియ కుటుంబానికి సహాయం చేయడానికి ఒక న్యాయవాదిని నియమించామన్నారు. నిమిష ప్రియ కుటుంబం, బాధిత కుటుంబ మధ్య ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం సమిష్టి ప్రయత్నాలు చేస్తున్నారు. కేరళలోని పాలక్కడ్‌కు చెందిన 38 ఏళ్ల నిమిష ప్రియ యెమెన్‌లో ఒక హత్య కేసులో దోషిగా తేలడంతో ఆమెకు స్థానిక కోర్టు ఆమెకు మరణ శిక్ష విధించిన సంగతి తెలిసిందే. అయితే ఈ నెల 16న అమలు కావాల్సిన ఉరిశిక్ష ప్రస్తుతానికి వాయిదా పడింది. హత్యకు గురైన వ్యక్తి కుటుంబానికి పరిహారంగా కొంత మొత్తం అందజేసేందుకు నిమిష ప్రియ బంధువులు సంసిద్ధత వ్యక్తం చేశారు. క్షమానిధి (బ్లడ్ మనీ)గా పరిగణించే ఈ మొత్తాన్ని స్వీకరించేందుకు వారు అంగీకరిస్తే నిమిష ప్రియకు ఉరిశిక్ష నుంచి క్షమాభిక్ష లభించేవీలుంది. కానీ హత్యకు గురైన వ్యక్తి సోదరుడు బ్లడ్ మనీకి తాము అంగీకరించే ప్రసక్తే లేదని, ఆమెకు ఉరిశిక్ష పడాల్సిందేనని ఇటీవల సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో నిమిష ప్రియ పరిస్థితి మళ్లీ కష్టాల్లో పడినట్లు అయ్యింది. ఈ నేపథ్యంలో కేంద్ర విదేశాంగ శాఖ జోక్యం కీలకంగా మారింది. నిమిష ప్రియకు శిక్ష పడకుండా దౌత్యపరంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఒక లేఖ కూడా రాశారు. నిమిష ప్రియ సురక్షితంగా భారత్‌కు తిరిగిరావాలని ఆయన ఆకాంక్షించారు.

బొలీవియాకు వ్యాక్సిన్స్ పంపిన భారత్

- మీజిల్స్, రుబెల్లా వ్యాధుల నివారణకు 3 లక్షల డోసులు రవాణా

న్యూఢిల్లీ : బొలీవియాలలో మిజిల్స్ , రుబెల్లా వ్యాధులు విజృంబిస్తున్నాయి. వాటి నియంత్రణకు భారత ప్రభుత్వం 3 లక్షల వ్యాక్సిన్లు, వైద్య సామాగ్రిని ఆదేశానికి పంపింది. గ్లోబల్ సౌత్‌లోని మిత్ర దేశాలకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా తెలిపారు. కోవిడ్-19 మహమ్మారి కారణంగా బొలీవియాలో వ్యాక్సిన్లు తగ్గిపోవడం, పిల్లలకు పౌష్టికాహార లోపం కారణంగా వ్యాధి తీవ్రంగా వ్యాప్తి చెందిందని ఆదేశ మీడియా కథనాలు తెలిపాయి.

బొలీవియాలో వ్యాధులు వ్యాప్తి కారణంగా ఆరోగ్య అత్యవసర పరిస్థితిని ఆదేశ అధ్యక్షుడు లూయిస్ ఆర్స్ కాటకోరా ప్రకటించారు. వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి స్వచ్ఛంద సంస్థలు, అంతర్జాతీయ సహకారం కోరుతున్నామని తెలిపారు. గత వారం జరిగిన బ్రిక్స్ సమావేశం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీతో కాటకోరా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఇరు దేశాల ద్వైపాక్షిక సంభందాలు, సహకారం గురించి చర్చించారు. అనంతరం భారత్ వ్యాక్సిన్లు సరఫరా చేసింది.

బ్రిటన్‌లో జెరిమి కార్బిన్ కొత్త పార్టీ !

జెరిమి కార్బిన్

జరా సుల్తానా

లండన్ : లేబర్ పార్టీ మాజీ నేత, స్వతంత్ర వామపక్ష పార్లమెంట్ సభ్యులు జెరిమి కార్బిన్ కొత్త రాజకీయ పార్టీని స్థాపించేందుకు కసరత్తు చేస్తున్నారు. దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలకు ఇది 'నిజమైన ప్రత్యామ్నాయం'గా వుంటుందని ఆయన పేర్కొన్నారు. లేబర్ పార్టీలో కొన్ని రోజుల కిందటి వరకు అత్యంత పిన్న వయస్కురాలైన జురా సుల్తానా కూడా ఈ కొత్త పార్టీ నిర్మాణంలో భాగస్వామ్యం కానున్నారు. పాలక పార్టీ నుండి జులై 3నే ఆమె బయటకు వచ్చారు. అయితే ఇప్పటివరకు ఈ కొత్త పార్టీకి పేరు పెట్టలేదు. కానీ రాజకీయ పరిశీలకులు మాత్రం అప్పుడేదీనిపై విశ్లేషణలు జరుపుతున్నారు. కార్బిన్ నేతృత్వంలోని ఏర్పాటయ్యే నూతన పార్టీకి 18 శాతం మంది బ్రిటన్లు ఓటు వేసే అవకాశం వుందని 'యుగవ్' సర్వే సంస్థ గత వారం అంచనా వేసింది. దేశవ్యాప్తంగా 10 శాతం ఓట్లను ఆకర్షించే అవకాశం వుందని మరికొన్ని సంస్థలు విశ్లేషించాయి. కొత్తగా ఏర్పాటు చేసే ఈ వామపక్ష భావజాల పార్టీ బ్రిటన్‌లో మనగలిగే పరిస్థితులు వున్నాయా లేదా అన్నది ఇప్పుడు పరిశీలించాల్సిన అంశంగా వుంది. దశాబ్దాల తరబడిదేశంలో ప్రధానంగా రెండు పార్టీల వ్యవస్థే నెలకొని వున్న తరుణంలో కొత్తగా మూడో పార్టీ రావడం ఎంతమేరకు ఉపకరిస్తుందన్నది తెలియడం లేదు. గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న సుదీర్ఘ యుద్ధం కొత్త పార్టీకి ముఖ్య అంశంగా మారినట్లు కనిపిస్తోంది. కార్బిన్, సుల్తానాలు ఇజ్రాయిల్ విధానాలను తీవ్రంగా విమర్శిస్తున్నారు. తమ పార్టీ శాంతియుత విదేశాంగ విధానాన్నే అవలంబిస్తుందని కార్బిన్ చెప్పారు.

పదహారేళ్లకే ఓటు హక్కు

- బ్రిటన్ ప్రభుత్వ నిర్ణయం

లండన్ : పదహారేళ్ల వయస్సుకే వయోజన ఓటు హక్కు కల్పించాలని బ్రిటన్ ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోగా ఓటు వేసే వయస్సును 18 నుండి 16కి తగ్గించనున్నట్లు గురువారం ప్రకటించింది. గతేడాది జులైలో ఎన్నికవడానికి ముందుగా లేబర్ పార్టీ ఈ మేరకు హామీ ఇచ్చిన సంగతి విదితమే. స్కాట్లాండ్, వేల్స్ ఇప్పటికే స్థానిక, ప్రాంతీయ ఎన్నికల్లో 16 ఏళ్లు, 17 ఏళ్ల వయస్సు వున్నవారికి ఓటు హక్కు కల్పించాయి. బ్రిటన్ ఈ చర్య తీసుకున్నట్లైతే ఈక్వెడార్, ఆస్ట్రియా, బ్రెజిల్ వంటి దేశాల సరసన బ్రిటన్ చేరనుంది. ఆటోమేటిక్ ఓటరు నమోదును ప్రవేశపెట్టనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. పోలింగ్ స్టేషన్లలో గుర్తింపు కోసం ఓటర్లు బ్యాంక్ కార్డులను చూపించడాన్ని అనుమతిస్తారు. ఈ మార్పులు బ్రిటన్ రాజకీయాల్లో విదేశీ జోక్యానికి వ్యతిరేకంగా తీసుకునే రక్షణలను బలోపేతం చేయడానికి ఉపకరిస్తాయని ప్రజాస్వామ్య వ్యవహారాల మంత్రి రుషనారా అలీ వ్యాఖ్యానించారు. 1969లో అప్పటివరకు 21గా వున్న ఓటింగ్ వయోపరిమితిని 18కి తగ్గిస్తూ చర్యలు తీసుకున్నారు. ఆ తర్వాత ఎన్నికల వ్యవస్థలో అతిపెద్ద సంస్కరణ అంటే ఈవయో పరిమితిని తగ్గించడమేనని మరో విధాన నిపుణులు హారీ క్విల్టర్ వ్యాఖ్యానించారు. అయితే ఈ మార్పులను పార్లమెంట్ ఆమోదించాల్సి వుంది. తదుపరి జాతీయ ఎన్నికలు 2029లో జరగాల్సి వున్నాయి.

ఒడిషాలో స్తంభించిన జనజీవనం

- విద్యార్థిని మృతికి నిరసనగా స్వచ్ఛందంగా బంద్
- అది సంస్థాగత హత్యే : బృందాకరత్

భువనేశ్వర్‌లో బిజెపి ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న ఆందోళనకారులు

భువనేశ్వర్ : ఒడిషాలో గురువారం జనజీవనం స్తంభించింది. బాలాసోర్‌లో ప్రొఫెసర్ లైంగిక వేధింపులు తాళలేక విద్యార్థిని ఆత్మహత్య ఘటనను నిరసిస్తూ స్వచ్ఛందంగా 12 గంటల బంద్‌ను నిర్వహించారు. కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, సిపిఎం (ఎంఎల్) వంటి 12 ప్రతిపక్ష పార్టీలు ఈ బంద్‌కు మద్దతు ఇచ్చాయి. భువనేశ్వర్, కటక్‌తో సహా అన్ని ప్రధాన నగరాల్లో ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. విద్యార్థినికి న్యాయం చేయాలని భారీ ప్రదర్శనలు చేపట్టారు. పలుచోట్ల జాతీయ రహదారు లను దిగ్బంధించారు. రహదారులపై టైర్లకు నిప్పు పెట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర బిజెపి ప్రభుత్వాల దిష్టిబొమ్మలను కూడా దగ్ధం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఆటోలు, టాక్సీల సంఘాలు సైతం స్వచ్ఛందంగా తమ వాహనాలను ఎక్కడికక్కడే నిలిపివేసి బంద్‌కు మద్దతు ప్రకటించారు. దీంతో బస్టాండ్లు, టెర్మినల్స్ నిర్మానుష్యంగా మారాయి. మార్కెట్లు, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలను కూడా మాసివేశారు. రైల్వే ఫ్లాట్‌ఫామ్‌లు, రైల్వే ట్రాక్‌లపై కూడా నిరసనకారులు ఆందోళన చేయడంతో రైల్వే సేవలు తాత్కాలికంగా నిలివేశారు.

బిజెపి ఏలుబడిలో మహిళలకు రక్షణ కరువు

బంధ్ వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ర్యాలీల్లో కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, సిపిఎం (ఎంఎల్), ఫార్వర్డ్ బ్లాక్, ఆర్‌జెడి, ఎస్‌పి, ఎన్‌సిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటి నుంచి మహిళలకు భద్రత కరువైందని విమర్శించారు. రాష్ట్రంలో రోజుకు 12 మంది మహిళలు, బాలికలు అత్యాచారానికి గురవుతున్నారని, అత్యాచార ఘటనలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. భువనేశ్వర్‌లోని ముఖ్యమంత్రి నివాసం వైపు ప్రదర్శనగా వెళుతున్న నిరసనకారులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు లాఠీలతో ఆందోళనకారులను చెదరగొట్టారు. అలాగే పిఎంజి స్క్వేర్ సమీపంలో జరిగిన ప్రదర్శనల్లో పాల్గొన్న అనేక మంది కాంగ్రెస్, వామపక్ష కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఒడిషా పిసిసి అధ్యక్షులు భక్త చరణ్‌దాస్ మాట్లాడుతూ విద్యార్థి మరణానికి కారకులైన దోషులను రక్షించేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఒడిషా కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ అజయ్‌కుమార్ లల్లు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి మాఝీ, కేంద్ర మంత్రి ధర్మేంద ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు సురేష్ పాణిగ్రాహి మాట్లాడుతూ బంద్‌కు రవాణ సంఘాలు, విద్యావేత్తలు, పౌర సమాజ సంఘాల నుంచి విస్తృత మద్దతు లభించిందని చెప్పారు

సంస్థాగత హత్యే : బృందాకరత్

ఒడిషాలో లైంగిక వేధింపులు భరించలేక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సిపిఎం నాయకులు బృందాకరత్ తీవ్రంగా స్పందించారు. పిటిఐ వార్తా సంస్థతో ఆమె మాట్లాడుతూ 'ఇది సంస్థాగత హత్యే' అని ఆమె పేర్కొన్నారు. 'అధికారంలో ఉన్నవారి తప్పుల ఫలితంగానే ఈ హత్య జరిగింది. బాధిత విద్యార్థిని ఎబివిపి నాయకురాలు. అధికార బిజెపికి ఎబివిపి చాలా సన్నిహిత సబంధాలు కలిగి ఉందనేది మనకు తెలుసు. బాధిత విద్యార్థిని తన ఫిర్యాదులన్నింటినీ ముఖ్యమంత్రి కార్యాలయానికి, పోలీసులకు కాపీ చేసింది. ఏమి జరుగుతోందో ఆమె సొంత సంస్థకు తెలుసు. అయినప్పటికీ వారు ఏమీ చేయలేదు. ఇది ఆమె ఆత్మహత్యకు ప్రేరేపించింది. అందువల్ల ఇది బిజెపి వ్యవస్థ చేసిన హత్యే' అని బృందాకరత్ తెలిపారు.

మానవ జీవితాలను పణంగా పెట్టినప్పుడు నిజాయితీ అత్యంత అవశ్యం

- మరణశిక్షను ఎదుర్కొంటున వ్యక్తిని నిర్దోషిగా తేల్చిన సుప్రీం

న్యూఢిల్లీ : పంజాబ్‌లోని కపుర్తలాలో 2013లో తన కుటుంబానికి చెందిన నలుగురు సభ్యులను హతమార్చినందుకు ఉరిశిక్షను ఎదుర్కొంటున్న బల్జిందర్ కుమార్‌ను నిర్దోషిగా సుప్రీంకోర్టు పేర్కొంది. ఆయనను దోషిగా నిర్ధారించడంలో, సరైన రుజువులను ప్రదర్శించడంతో ప్రాసిక్యూషన్ విఫలమైందని పేర్కొంది. ఈ కేసులో కీలకమైన ప్రత్యక్ష సాక్షులుగా పరిగణిస్తున్న ఇద్దరు వ్యక్తులు నేరం జరిగిన చోట ప్రత్యక్షంగా వున్నారని విశ్వసించలేకపోతున్నామని కోర్టు వ్యాఖ్యానించింది. ఇందులో ఒక సాక్షి ప్రతీసారీ నేరం జరిగిన తీరు చెబుతున్నపుడు తాను గతంలో చెప్పినదానికి భిన్నంగా సంఘటనల వరుస క్రమాన్ని చెబుతోందని కోర్టు పేర్కొంది. మరో ప్రత్యక్ష సాక్షి అయితే నిందితుడు పట్టుకున్న ఆయుధాలనే మార్చేశాడని, ఆ రెండూ ఆయుధాలు చూసేందుకు భిన్నంగా వుంటాయని, అలాంటి వాటిని ఒకేలా వున్నాయని ఎలా పొరబాటు పడతాడని కోర్టు ప్రశ్నించింది. మానవ జీవితాలు ముప్పులో పడుతున్నపుడు,పైగా రక్తాన్ని మూల్యంగా చెల్లించాల్సి వచ్చినపుడు మనం మరింత అప్రమత్తంగా వుంటూ మరింత నిజాయితీతో వ్యవహరించాల్సి వుంటుందని కోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఇక ఈ కేసులో బతికి బయటపడిన బాలుడిని సాక్షిగా పేర్కొన్నా దాడిని తాను చూడలేదని, ఆ సమయంలో తాను సగం నిద్రలో వున్నానని చెప్పాడని, కాబట్టి అది కూడా పరిగణనలోకి తీసుకోలేమని చెప్పింది. పోలీసుల దర్యాప్తులోనే అనేక తప్పుల తడకలు వున్నాయని, చాలా అంతరాలు వున్నాయని, కీలకమైన పరస్పర విరుద్ధమైన అంశాలను మైనరుగా పేర్కొంటూ కిందిస్థాయి కోర్టు, హైకోర్టులు విస్మరించాయని పేర్కొంది. దీన్ని తాము ఆమోదించలేమని తేల్చి చెప్పింది. పైకారణాల రీత్యా బల్జిందర్ సింగ్‌ను నిర్దోషిగా పరిగణిస్తున్నట్లు పేర్కొంది.

ఆంధ్రప్రదేశ్‌కు దక్కిన పురస్కారాలను రాష్ట్రపతి నుండి స్వీకరిస్తున్న మంత్రి నారాయణ

అత్యంత పరిశుభ్ర నగరంగా ఇండోర్

- వరుసగా 8వ సారి 'స్వచ్ఛ' పురస్కారం
- రాష్ట్రానికి ఐదు పురస్కారాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

న్యూఢిల్లీ : దేశంలోనే అత్యంత పరిశుభ్ర నగరాల జాబితాలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ మొదటిస్థానాన్ని దక్కించుకుంది. 2024 సంవత్సరానికి గాను ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను గురువారం ప్రకటించారు. ఈ అవార్డుల్లో వరుసగా ఎనిమిదోసారి అగ్రస్థానంలో నిలిచింది. తరువాతి స్థానాల్లో సూరత్, నవీ ముంబయిలు ఉన్నాయి. 3-10లక్షల జనాభా విభాగంలో, నొయిడా అత్యంత పరిశుభ్రమైన నగరంగా మొదటిస్థానంలో నిలిచింది. చండీగఢ్, మైసూర్‌లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మూడు లక్షలు-50,000 జనాభా విభాగంలో న్యూఢిల్లీ మునిసిపల్ కౌన్సిల్, 20,000-50,000 జనాభా విభాగంలో విటా (మహారాష్ట్ర), 20,000 కంటే తక్కువ జనాభా విభాగంలో పంచగని అత్యంత పరిశుభ్రమైన నగరాలుగా నిలిచాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు మున్సిపల్ కార్పొరేషన్‌లు కూడా వివిధ కేటగిరీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు గెలుచుకున్నాయి. గురువారం నాడిక్కడ విజ్ఞాన భవన్ లో స్వచ్ఛ సర్వేక్షణ్ -2025 అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ఆయా కార్పొరేషన్ల అధికారులతో కలిసి మంత్రి పి.నారాయణ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. దేశం మొత్తం మీద కేవలం 23 మున్సిపాల్టీలు మాత్రమే స్వచ్ఛ సూపర్ లీగ్ అవార్డులు దక్కించుకోగా వాటిలో 3 మున్సిపాల్టీలు ఆంధ్రప్రదేశ్ నుంచే ఉన్నాయి. పదిలక్షల జనాభా దాటిన నగరాల్లో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, మూడు లక్షల నుంచి పది లక్షల జనాభా కలిగిన నగరాల్లో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, 50 వేల నుంచి మూడు లక్షల జనాభా కలిగిన కేటగిరీలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లు స్వచ్ఛ సూపర్ లీగ్ అవార్డులు దక్కించుకున్నాయి. మొదటి 20 స్థానాల్లో నిలిచిన నగరాలను స్వచ్ఛ సూపర్ లీగ్ అవార్డులకు ఎంపిక చేశారు. ఇక మినిస్టీరియల్ అవార్డు స్పెషల్ కేటగిరీలో సఫాయి మిత్ర సురక్షిత నగరాల్లో గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయిలో రాజమండ్రి మునిసిపల్ కార్పొరేషన్ల అవార్డు దక్కించుకుంది. తెలంగాణ నుంచి క్లీనెస్ట్ కంటోన్మెంట్ బోర్డ్ విభాగంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ మొదటి స్థానాన్ని సొంతం చేసుకుంది. హైదరాబాద్ వ్యర్థాల రహిత నగరం విభాగంలో 7 స్టార్ రేటింగ్ సాధించి, గతంలో ఉన్న 5 స్టార్ రేటింగ్‌ను మెరుగుపరుచుకుని సత్తా చాటింది.

అమెరికాలో చోరీలకు పాల్పడితే వీసా రద్దు

- హెచ్చరించిన భారత్‌లోని రాయబార కార్యాలయం

న్యూఢిల్లీ : అమెరికాలో చోరీలకు పాల్పడితే వీసా రద్దవుతుందని భారత్‌లోని యుఎస్ రాయబార కార్యాలయం హెచ్చరించింది. అంతేకాకుండా చట్టపరమైన చర్యలతో పాటు భవిష్యత్తులో అనర్హత వేటు తప్పదని గురువారం తన ఎక్స్ వేదికగా ప్రకటించింది. ఇటీవలే భారత్‌కు చెందిన పర్యాటకురాలు అమెరికాలోని ఒక స్టోర్‌లో సుమారు రూ1.1 లక్షల విలువైన వస్తువులను దొంగతనం చేస్తూ పోలీసులకు దొరికిపోయింది. ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన నేపథ్యంలో ఎంబసి స్పందించింది.

వీసా పొందిన వారిపై నిరంతర నిఘా

గత నెలలో ఎఫ్, ఎం లేదా జె వంటి నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాలకు దరఖాస్తు చేసే వారి సోషల్ మీడియా ఖాతాల గోప్యతా సెట్టింగ్‌లను పబ్లిక్‌గా మార్చాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. అమెరికా జాతీయ భద్రత దృష్ట్యా వారి సోషల్ మీడియా ఖాతాలను తనిఖీ తరువాత వీసా మంజూరు చేస్తామని తెలిపింది. అయితే వీసా జారీ అనంతరం తమ నిఘా కొనసాగుతుందని అమెరికా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. వారు అమెరికా చట్టాలను, ఇమ్మిగ్రేషన్ నిభందనలను పాటిస్తున్నారా లేదా అనేది నిరంతరం పరిశీలిస్తామని, ఉల్లంఘిస్తే వీసా రద్దుతో పాటు భవిష్యత్తులో అమెరికాకు రాకుండా అనర్హులు చేస్తామని ప్రకటించింది.

ఇరాక్ షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదం

- 60 మందికిపైగా మృతి

కుట్ : ఇరాక్‌లోని కుట్ నగరంలో ఓ షాపింగ్‌మాల్‌లో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో 61 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో 14మంది మృతదేహాలు కాలిపోయి గుర్తుపట్టలేని విధంగా ఉన్నాయి. అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వారిలో మహిళలు, చిన్నారులే అధికంగా ఉండడం ఉన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... కుట్ నగరంలో ఇటీవల నూతనంగా ప్రారంభమైన ఐదంతస్థుల భవనంలో బుధవారం రాత్రి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో చాలా మంది ఊపిరాడక మరణించారు. భవనంలో చిక్కుకున్న 45 మందిని అధికారులు కాపాడగలిగారు. మరికొందరి ఆచూకీ లభించలేదు. ఈ ఘటనకు సంబంధించి 48 గంటల్లో ప్రాథమిక దర్యాప్తు వివరాలు వెల్లడిస్తామని స్థానిక యంత్రాంగం వెల్లడించింది. అయితే అగ్ని ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రమాదానికి గురైన భవనం, షాపింగ్ మాల్ యజమానులపై పలు కేసులు నమోదయ్యాయి. భవనం నిర్మాణ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఇరాక్‌లో తరచూ అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి.

మరోవైపు అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశానికి వెళ్లి దర్యాప్తు చేయాలని ఇరాక్ ప్రధాని మహ్మద్ షియా అల్-సుడానీ అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా మూడ్రోజుల పాటు సంతాప దినాలు ప్రకటించినట్టు ప్రావిన్ గవర్నర్ వెల్లడించారు. ఈ దుర్ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అయితే ఈ షాపింగ్ మాల్‌ను కేవలం ఒక వారం క్రితమే ప్రారంభించారు. దీనిలో రెస్టారెంట్, సూపర్ మార్కెట్లు కూడా ఉన్నాయి. సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చిన దృశ్యాల్లో మాల్‌లో చాలాభాగం మంటల్లో చిక్కుకుపోయినట్టు కనిపించింది. భవనం నిర్మాణ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఇరాక్‌లో తరచూ అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయని పలువురు అంటున్నారు.

జీవన సౌరభం

విజయం కలిగిందని విర్రవీగక్కర్లేదు. అపజయం కలిగిందని నిరాశపడక్కర్లేదు. విజయం అంతం కాదు. అపజయం చివరి మెట్టూ కాదు.

మీ కోసం

వంకాయలు ఉడుకుతున్నప్పుడు కొద్దిగా పసుపు, పాలు పోస్తే కూర కసరెక్కదు.

JEEVANA జీవన the family

నేల విడిచి సాము

ఒక అడవిలో చిన్న కాకి పిల్ల ఉండేది. దాని పేరు చిట్టి. చిట్టి ఎప్పుడూ కొత్తగా ఏదో చేయాలనే తపనతో ఉండేది. ఒక రోజు అది ఆకాశంలో విహరిస్తూ భారీ ఈగల గుంపును చూసింది. అవి వేగంగా ఎగురుతూ, తక్కువ కాలంలో ఎక్కువ దూరం ప్రయాణించాయి.

'నేను కూడా వీటిలా వేగంగా ఎగరాలి. ఎక్కువ దూరం ప్రయాణం చెయ్యాలి' అనుకుంది చిట్టి. ఆ విషయాన్ని తల్లికి చెప్పింది. 'ఒరేయ్ చిట్టీ, నేల విడిచి సాము చెయ్యకురా!' అంది తల్లి.

తల్లి మాట చిట్టి చెవికెక్కలేదు. గాల్లో వేగంగా ఎగరడానికి ప్రయత్నించింది. కొంతసేపటికి అలసిపోయి, అదుపు తప్పి కిందకి పడిపోయింది. దెబ్బలతో గూటికి చేరింది.

అది చూసిన తల్లి 'నేను చెప్తే విన్నావు కావు. మన శక్తికి మించిన పని చెయ్యకూడదు. మనం పని చేసేటప్పుడు జాగ్రత్తగా ఆలోచించాలి. నేల విడిచి సాము చెయ్యకూడదు' అంది.

"నేల విడిచి సాము అంటే ఏంటమ్మా" అని అడిగింది చిట్టి.

"అది ఒక సామెత. 'సాము అంటే వ్యాయామం అని అర్థం. కర్రసాము లేదా సాము గారడీ అనేది ఆత్మ రక్షణకై వినియోగించబడే పురాతనమైన ఒక కళ' అని పక్క గ్రామానికి చిట్టిని తీసుకువెళ్ళింది. అక్కడ కొందరు యువకులు కర్రను చేతితో రకరకాలుగా తిప్పుతూ విన్యాసాలు చేస్తున్నారు. మరికొంతమంది గాల్లోకి ఎగిరి ప్రత్యర్థి మీద దాడి చేస్తున్నారు. ఆ సందర్భంలో కొంతమంది గాయాల పాలయ్యారు. ఎంత అనుభవజ్ఞులైనా నేల విడిచి గాలిలో సాము చేస్తే ఇలాగే అదుపు తప్పి కింద పడి గాయాల పాలు అవుతారు. అనుభవం లేని, చేయలేని, సాధ్యం కాని పనిని తలకెత్తుకునే సందర్భంలో వాడే సామెత ఇది' అని వివరించింది తల్లి.

"ఇక మీదట నువ్వు చెప్పినట్లే వింటాను. నేల విడిచి సాము చెయ్యను" అంది చిట్టి బుద్ధిగా.

- కాశీ విశ్వనాధం పట్రాయుడు,
94945 24445.

దారి చూపండి

పిల్లలూ, దారి తప్పిపోయిన గొర్రె పిల్లకు, గొర్రెల మందలోకి వెళ్లే దారి చూపి సాయం చేయరూ!



నేను గీసిన బొమ్మ

సిహెచ్. ప్రణతిక
6వ తరగతి,
జెడ్పిహెచ్ఎస్,
కుల్చారం,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అమ్మ ముందు తలొంచిన శిఖరాలు

'కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మహిళల శారీరక శక్తి సన్నగిల్లుతుంది. ముఖ్యంగా తల్లయ్యినప్పుడు మునుపటిలా వారు ఏ పనీ చేయలేరు' అని చాలామంది అపోహపడతారు. కానీ, క్రీడారంగంలో ఉన్న ఎందరో మహిళలు, మాతృత్వం పొందిన తరువాత కూడా క్రీడల్లో రాణిస్తున్నారు. బిడ్డలనెత్తుకుని పరుగులు పెడుతున్న వారు, అవార్డులు, ప్రశంసలు దక్కించుకుంటున్నవారూ ఉన్నారు. అలాంటి వారి కోవలోకే వస్తారు మధ్యప్రదేశ్‌కి చెందిన పర్వతారోహకురాలు భావ్నా దెహారియా. ఎవరెస్ట్ శిఖరం ఎక్కిన ఆమె అనుభవం, మాతృత్వం పొందిన తరువాత కూడా కొనసాగేలా చేసింది. ప్రసవం అయిన కొన్ని గంటలకే శిక్షణ తీసుకోవడం ప్రారంభించి అనుకున్న లక్ష్యం చేరుకున్న తెగువ ఆమె సొంతం.

చింద్వారా జిల్లా, తమియా ఆదివాసీ గ్రామానికి చెందిన 33 ఏళ్ల భావ్నా, మాతృత్వం తన కలలకి అవరోధం కాదని నిరూపించడంలో విజయం సాధించారు. చాలామంది మహిళలు పిల్లలు పుట్టడంతోనే తమ కలలని, లక్ష్యాలని పక్కన పెడుతుంటారు. బిడ్డకి పాలివ్వడం, నిద్ర లేని రాత్రుళ్ళ గడపడంతో ఎక్కడ లేని నిస్సత్తువ వారిని కమ్మేస్తుంది. కానీ భావ్నా ఆ పరిస్థితిని అధిగమించింది. తనలాంటి అమ్మలెందరికో స్ఫూర్తిగా నిలిచింది.

పర్వతారోహకురాలిగా భావ్నా ప్రయాణం ... ప్రతి అడుగూ సాహసంతో కూడినదే! 2019 మే 22న ఎవరెస్ట్ శిఖరం అధిరోహించడానికి కొన్ని నిమిషాల ముందు ఆక్సిజన్ మాస్క్ లీక్ అయ్యింది. ఆక్సిజన్ అందక ఊపిరితిత్తులు మండుతున్నట్లుగా ఉన్నా లక్ష్యాన్ని చేరుకుంది. 90 నిమిషాల పాటు మాస్క్ లేకుండా భగభగమండే సూర్యకాంతిలోనే ప్రయాణం కొనసాగించింది. ఆ క్షణం ఆమె సాధించిన ఆ విజయం మధ్యప్రదేశ్ నుంచి ఎవరెస్ట్ ఎక్కిన మొదటి మహిళగా తన పేరుని చరిత్రలో లిఖించేలా చేసింది.

పర్వతారోహణంపై ఉన్న మక్కువతో భావ్నా ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసింది. నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ నుండి మౌంటెనరింగ్‌లో డిప్లొమా సాధించింది. ఎవరెస్ట్‌తో పాటు ఆఫ్రికాలోని కిలిమంజారో, ఆస్ట్రేలియాలోని కోషికోజ్కో, దక్షిణ అమెరికాలోని కెర్రో అకాంక్గావాతో పాటు మన దేశంలోని మనిరాంగ్, యునమ్ పర్వతాలను కూడా భావ్నా అధిరోహించింది.

2020లో యూరప్‌లోని ఎల్బ్రస్ పర్వతాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రయాణించాలనుకున్న భావ్నా కోవిడ్ వల్ల ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాల్సి వచ్చింది. ఆ తరువాత పెళ్లితో ఆమె జీవితం మరో అధ్యాయానికి తెరదీసింది.

'బిడ్డ పుట్టింది. ఇక నీ ప్రయత్నాలకు స్వస్తి చెప్పు' అన్న మాటలు ఆమె చుట్టూ ప్రతిధ్వనించాయి. అయితే 'బిడ్డ తన ప్రయాణానికి అడ్డు కాదు, తన లక్ష్యాన్ని వేగంగా పూర్తి చేయగల స్ఫూర్తి' అని వారికి చెప్పింది. ప్రసవం అయిన కొన్ని గంటలకే శిక్షణ కోసం బయల్దేరింది. ఈ సందర్భాన్నే భావ్నా ఇలా చెబుతోంది.

'మాతృత్వం తరువాత చాలామంది ఆడవాళ్లకి ఎదురయ్యే పరిస్థితే నాకు ఎదురైంది. అయితే నేను వాటిని అధిగమించాను. శిక్షణ, బిడ్డ ఆలనా పాలనా రెండింటినీ సమన్వయం చేసుకున్నాను. మన సంకల్పం దృఢంగా ఉంటే ఇది సాధ్యమే' అంటోంది.

భావ్నా సాధించిన విజయాలు ఇప్పుడు ఆమెని ప్రత్యేకంగా నిలబెట్టాయి. తన ప్రయాణం మరికొంతమందికి ప్రేరణగా నిలవాలని అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్వచ్ఛంద సంస్థని నెలకొల్పి ఎందరో యువతని ముఖ్యంగా పేదరిక కుటుంబాల్లోని యువతని క్రీడలవైపు రాణించేలా ప్రోత్సహిస్తోంది. 2022లో మధ్యప్రదేశ్ రాష్ట్రం తరఫున మోటివేషనల్ స్పీకర్‌గా, ఫిట్ ఇండియా బ్రాండ్ అంబాసిడర్‌గా కీలక బాధ్యతలు పోషించింది.

భావ్నా అధిరోహించిన ప్రతి శిఖరాగ్రం, మహిళలు ఎక్కడి నుంచి వచ్చినవారైనా, ఏ పరిస్థితుల్లో ఉన్నా, జీవితంలో ఎలాంటి పాత్రను పోషించినా లక్ష్యం చేరుకునే శక్తి వారికి మళ్లీ మళ్లీ వుంటుందనే నమ్మకాన్ని ఇస్తోంది.

పట్టుబట్టలపై మరకలు ఇలా వదిలించొచ్చు!

పట్టు బట్టలపై అనుకోకుండా ఏదైనా మరకలు పడితే– వాటిని సాధారణ దుస్తుల్లా ఉతకలేం. కట్టుకున్న ప్రతిసారీ డ్రైవాష్ చేయించడం కూడా మంచిది కాదు. అందుకే మనకు అందుబాట్లో ఉండే వస్తువులతో పట్టుబట్టలపై పడిన రకరకాల మరకలను ఎలా తొలగించుకోవాలో చూద్దాం.

ఎలా ఉతకాలి?

మరకలు పడకుండా ఉన్న పట్టుబట్టలు ఉతకాలంటే ముందుగా ఆ బట్టలు మునిగేంత వరకు నీళ్ల పోసి అందులో గళ్లుప్పు కలిపి, ఆ నీటిలో పావుగంట నానబెట్టాలి. ఆ తరువాత తేలికపాటి రసాయనాలు గల షాంపు గానీ, కుంకుడుగాయ రసం గానీ కలిపిన నీటిలో మరో పావుగంట ఉంచాలి. ఆ తరువాత సాధారణ నీటిలో శుభ్రం చేయాలి.

- చాక్లెట్ మరకలు పడితే వేడినీటిలో జాడించి ఉతికితే పోతాయి.
- పెరుగు, వెన్న వంటి మరకలు పడితే మరకపై ఒక చుక్క కార్బన్ టెట్రాక్లోరైడ్‌ను వేసి మెత్తని వస్త్రంతో రుద్దితే మరక పోతుంది.
- కాఫీ లేదా టీ మరకలు పడితే కార్బన్ టెట్రాక్లోరైడ్‌ను పూస్తే మరకలు పోతాయి. అప్పటికీ పోకపోతే వేడి నీటిలో కొద్దిగా హైడ్రోజన్ పెరాక్సైడ్ వేసి ఆ నీటిలో ఉతకాలి.
- బురద మట్టి మరకలు పడితే బాగా ఆరనిచ్చి కార్బన్ టెట్రాక్లోరైడ్‌తో తుడిచి ఉతికితే సరిపోతుంది.
- ఇంక్ లేదా లిప్‌స్టిక్ మరకలు పడితే ఆ భాగంలో పేపర్ టవల్‌ను ఉంచి వెనుక నుంచి డ్రైక్లీనింగ్ ద్రావణం పూయాలి. మరక పూర్తిగా పోయేవరకు నీటిని వాడకూడదు.
- నెయిల్ పాలిష్ పడితే ఆ భాగం వరకు అసిటోన్‌లో ముంచితే సరిపోతుంది.

ఇలా భద్రపరచాలి ...

- పట్టుబట్టలను విడిగా ఉంచకుండా ప్లాస్టిక్ సంచుల్లో లేదా పేపర్, కాటన్ సంచుల్లో ఉంచాలి.
- ఈ బట్టలు పెట్టిన చోట ఎక్కువ గాలి, కాంతి లేకుండా చూడాలి.
- బీరువాలో నేరుగా కాకుండా కవరులో పెట్టి పెట్టాలి.
- అప్పుడప్పుడు బయటకు తీసి గాలి సోకనీయాలి. లేకపోతే ముడతలు పడిన చోట చిరుగులు పడే అవకాశం ఉంది.

నూనె మరకలు పోవాలంటే..

- నూనె మరక ఉన్న చోట బేకింగ్ సోడా, కార్న్ స్టార్చ్ లేదా ఉప్పు లాంటి పీల్చుకునే పొడిని మందమైన పొరగా మరకపై బాగా అద్దాలి.
- ఇలా 2 గంటలు వరకు ఉంచాలి. ఇలా చేస్తే.. మరకపై ఉన్న పొడి నూనెను బాగా పీల్చుకుంటుంది.
- తరువాత ఆ పొడిని తడి బట్టతో లేదా మెత్తటి కుచ్చులున్న బ్రష్‌తో కాని లేదా ఒక శుభ్రమైన తెల్లటి బట్టతో కాని రుద్దుతూ ఉండాలి. ఇంకా మరక మిగిలి ఉంటే, మళ్లీ మొదటినుండీ ఈ ప్రక్రియను చేయాలి. ఈ పద్ధతి వల్ల ఫాబ్రిక్ దెబ్బతినకుండా మరక పోతుంది.
- కొద్దిగా డిష్ వాషింగ్ లిక్విడ్‌ను మరక పై రుద్దాలి. మరక ఉన్నచోటే జాగ్రత్తగా తడి చేసుకోవాలి. ఇప్పుడు మరక పై ఉన్న తడి ప్రదేశాన్ని హెయిర్ డ్రైయర్‌తో గాని లేదా చల్లని గాలిలో లేదా ఫ్యాన్ ముందు ఆరబెట్టాలి. ఇలా చేస్తే కూడా నూనె మరక పోతుంది.

విశాఖలో 'హరి హర వీరమల్లు' ప్రీరిలీజ్ వేడుక

పవన్ కళ్యాణ్, నిధి అగర్వాల్ జంటగా నటించిన చిత్రం 'హరి హర వీరమల్లు'. ఈ సినిమా తొలి భాగం ఈ నెల 24న విడుదల కానుంది. ప్రీరిలీజ్ వేడుకను ఈ నెల 20న విశాఖపట్నంలో నిర్వహించాలని మేకర్లు నిర్ణయించారు. ఇటీవలే సెన్సార్ పనులు పూర్తి చేసుకుని యు/ఎ సర్టిఫికెట్‌ను పొందింది. ఈ సినిమాకి జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. ఎం.ఎం.కీరవాణి సంగీతమందించారు. ఎఎం రత్నం సమర్పణలో ఎ.దయాకర్‌రావు నిర్మించారు. ఈ వేడుకను భారీఎత్తున నిర్వహించటానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.

ఆగస్టు 8న 'బకాసుర రెస్టారెంట్'

కమెడియన్ ప్రవీణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం కాబోతున్న ఈ చిత్రాన్ని ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. కృష్ణభగవాన్, షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్ ఇతర ముఖ్య పాత్రలు చేస్తున్నారు. ఈ సినిమాకు వికాస్ బడిస సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్ర రిలీజ్ డేట్‌ను తాజాగా చిత్రబృందం ప్రకటించింది. ఆగస్టు 8న ఈ మూవీ థియేటర్లలో రాబోతుందని తెలిపారు.

'పరదా' ఫస్ట్ సాంగ్ విడుదల

భర్త చనిపోతే ఆ చితిలోనే భార్య చనిపోయే సతీ సహగమనం దురాచారంపై 'పరదా' అనే సినిమా తెరకెక్కుతుంది. అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రవీణ్ కంద్రేగుల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో సంగీత, దర్శక రాజేంద్రన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి మొదటి లిరికల్ సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'యత్ర నార్యస్తు పూజ్యంతే రామంతే తత్ర దేవతా' అంటూ సాగిన ఈ సాంగ్ ఆద్యంతం ఆకట్టుకుంది. వనమాలి ఈ పాటకి లిరిక్స్ అందించారు. సింగర్ అనురాగ్ కులకర్ణి ఆలపించారు. గోపి సుందర్ సంగీతం అందించారు. ఆగస్టు 22న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



ఐదేళ్లు నిరీక్షించా : నిధి అగర్వాల్

'ఈ ఐదేళ్ల కాలంలో చాలా పెద్ద సినిమాలకు సైతం అవకాశాలు వచ్చాయి. నేనే అగ్రిమెంట్ ప్రకారం మరో సినిమాకు ఒప్పుకోలేదు. ఈ ఐదేళ్లలో ఆర్థికంగా పెద్దగా ఇబ్బందులు రాలేదు. నెలకు కనీసం ఒక షాప్ ఓపెనింగ్ అయినా వచ్చేది. ఆ డబ్బు సరిపోయేది. ఐదేళ్లు ఆగినా.. ఓ మంచి చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నా. నేను పడిన కష్టానికి తగిన గుర్తింపు వస్తుందనే ఆశిస్తున్నా. ఇకపై సీజీ వర్క్ ఉన్న సినిమాలు చేయబోను. రెండు, మూడు నెలల్లో షూటింగ్ అయిపోయి.. రిలీజయ్యే సినిమాలే చేస్తా. ఇకపై నేను నటించే ఏ చిత్రానికైనా 'హరి హర వీరమల్లు' సినిమాకు చేసుకున్నట్లుగా అగ్రిమెంట్ చేసుకోను' అని కథానాయిక నిధి అగర్వాల్ చెప్పారు. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె పైవిధంగా మాట్లాడారు.

'తొలి 12 షోలకు రివ్యూలు వద్దు'

కొత్త సినిమాలు విడుదలైన తొలి మూడు రోజుల వరకు థియేటర్లలో పబ్లిక్ రివ్యూలను షూట్ చేయకుండా నిలిపివేయాలని తమిళ హీరో, నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శి విశాల్ విజ్ఞప్తి చేశారు. తమిళ చిత్రం 'రెడ్ ఫ్లవర్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సినిమా బతికేందుకు తొలి 12 షోలకు థియేటర్‌లో ప్రేక్షకుల రివ్యూలను రికార్డ్ చేయకుండా ఆపివేయాలని విశాల్ అన్నారు. నడిగర్ సంఘం తరఫున, తమిళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ కతిరేసన్ సమక్షంలో మీడియా, ఎగ్జిబిటర్స్ అసోసియేషన్‌ను విశాల్ విజ్ఞప్తి చేశారు. ప్రేక్షకుల అభిప్రాయాలను సేకరించే ముందు కంటెంట్ క్రియేటర్లు సైతం థియేటర్‌లోనే సినిమా చూడాలని సూచించారు. యూట్యూబర్లు, కంటెంట్ క్రియేటర్లు సినిమా చూసిన తర్వాత సమీక్షలు చేస్తే.. ఆ తర్వాత ప్రేక్షకుల అభిప్రాయాలు తెలుసుకుంటే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే, ఇటీవల తొలి మూడు రోజులూ ఆన్‌లైన్‌లో సినిమాలపై రివ్యూలను నిషేధించాలంటూ తమిళ నిర్మాతల సంఘం దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టి వేసింది.

నెట్స్‌లో చెమటోడ్చుతున్న ఆటగాళ్లు

- **బెకెన్‌హామ్‌లో టీమిండియా ప్రాక్టీస్**
- **23నుంచి ఇంగ్లండ్‌తో నాల్గో టెస్ట్**

మాంచెస్టర్: ఇంగ్లండ్‌తో జరిగే నాలుగో టెస్టు కోసం టీమిండియా ఆటగాళ్లు నెట్స్‌లో చెమటోడ్చుతున్నారు. ఈ మ్యాచ్ కోసం భారత జట్టు బెకెన్‌హామ్‌లో తమ ప్రాక్టీస్‌ను మొదలు పెట్టింది. గురువారం తొలి ప్రాక్టీస్ సెషన్‌లో గిల్ సేన తీవ్రంగా శ్రమించింది. అయితే ఈ ప్రాక్టీస్ సెషన్‌కు టీమిండియా స్టార్ వికెట్ కీపర్ రిషబ్ పంత్ దూరమయ్యాడు. లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్టులో పంత్ చేతి వేలికి తీవ్ర గాయమైంది. దీంతో అతడి స్థానంలో ధృవ్ జురెల్ సబ్‌స్ట్యూట్ వికెట్ కీపర్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. కానీ బ్యాటింగ్‌కు పంత్ దిగాల్సి వచ్చింది. అతడు రెండు ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు మాత్రం వచ్చాడు. తీవ్రమైన నొప్పితో బాధపడుతూనే బ్యాటింగ్ చేశాడు. ఈ క్రమంలో నాలుగో టెస్టుకు పంత్ అందుబాటులో ఉండడం కష్టమే. తాజాగా పంత్ గాయంపై భారత అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్‌డెష్కాట్ అప్‌డేట్ ఇచ్చాడు. పంత్ ఇంకా నొప్పితో బాధపడుతున్నాడని, మాంచెస్టర్ టెస్ట్ నాటిక ఫిట్‌నెస్ సాధించడం కష్టమేనని తెలిపాడు. పంత్ చేతి వేలి నొప్పి కాస్త తగ్గిందని, కానీ ముందుస్తు జాగ్రత్తగా ప్రస్తుతం అతడు ప్రాక్టీస్‌కు దూరంగా ఉన్నాడని తెలిపాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తే పంత్‌నే బ్యాటింగ్, వికెట్ కీపింగ్ రెండూ చేస్తాడు. రాబోయే రోజుల్లో అతడి ఫిట్‌నెస్‌పై కచ్చితంగా అప్‌డేట్ ఇస్తామని డెష్కాట్ పేర్కొన్నాడు.

అర్ష్‌దీప్‌కు గాయం..!

నాల్గో టెస్ట్‌కు ముందు భారత జట్టుకు ఎదురు దెబ్బ తగిలింది. నెట్స్‌లో బౌలింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ చేతి వేలికి గాయమైంది. బంతి చేతి వేలికి తాకడంతో తీవ్ర గాయమైంది. దీంతో అతడి చేతి వేలికి ఫిజియో టేప్ వేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని భారత అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్‌డెష్కాట్ కూడా ధ్రువీకరించారు. కాగా వన్డే, టి20ల్లో అరంగేట్రం చేసిన అర్ష్‌దీప్.. టెస్టుల్లో మాత్రం ఇంకా భారత్ తరఫున ఆడలేదు. ఇంగ్లండ్ టూర్‌కు ఎంపికైనప్పటికి తొలి మూడు టెస్టులకు బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఒకవేళ నాలుగో టెస్టుకు జస్ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇస్తే.. అర్ష్‌దీప్‌కు తుది జట్టులోకి చోటు దక్కే అవకాశముందని భావించినా.. ఇంతలోనే గాయపడడం జట్టు మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది.

కుల్దీప్‌కు చోటు...

నాల్గో టెస్ట్‌కు రెగ్యులర్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు చోటు దక్కే ఛాన్స్ ఉంది. తొలి మూడు టెస్టుల్లో స్పిన్నర్లు పెద్దగా ప్రభావం చూపకున్నా.. మాంచెస్టర్ మైదానం స్పిన్నర్లకు సహకరించే అవకాశం ఉంది. దీంతో సుందర్, నితీశ్ రెడ్డిల స్థానంలో అతడికి తుది జట్టులో చోటు లభించ వచ్చు. మరోవైపు ఇంగ్లండ్ జట్టుకూ గట్టి ఎదురు దెబ్బ తగిలింది. మూడోటెస్ట్‌లో గాయపడ్డ రెగ్యులర్ స్పిన్నర్ బషీర్ నాల్గో టెస్ట్‌కు దూరమయ్యాడు. మూడో టెస్ట్ గెలుపులో కీలకపాత్ర పోషించిన బషీర్.. వేలి గాయంతోనే బౌలింగ్ చేసిన సంగతి తెలిసిందే. ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భారతజట్టు 1–2తో వెనుకబడి ఉండగా.. జులై 23నుంచి మాంచెస్టర్ వేదికగా నాల్గో టెస్ట్ జరగనుంది.

అంతర్జాతీయ క్రికెట్‌కు ఆండీ రస్సెల్ గుడ్‌బై



జమైకా: వెస్టిండిస్ టి20 స్పెషలిస్ట్ ఆండ్రీ రస్సెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఆస్ట్రేలియాతో జరిగే ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్ ఎంపికైన 37 ఏళ్ల రస్సెల్... జమైకాలోని సబీనా పార్క్‌లోని హోంగ్రౌండ్‌లో జరిగే తొలి రెండు మ్యాచులు ఆడి ఇంటర్నేషనల్ క్రికెట్‌కు వీడ్కోలు పలుకనున్నట్లు తెలిపాడు. విండీస్ క్రికెట్ బోర్డు రస్సెల్ రిటైర్మెంట్‌ను ధృవీకరిస్తూ పోస్ట్ చేసింది. 'వెస్టిండీస్‌కు ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలో గర్వించదగ్గ విజయాలలో ఒకటి. నేను చిన్నప్పుడు ఈ స్థాయికి చేరుకుంటానని ఊహించలేదు. కానీ, మీరు క్రీడను ఎంత ఎక్కువగా ఆడటం, ప్రేమించడం ప్రారంభిస్తే మీరు ఏమి సాధించగలరో మీరు గ్రహిస్తారు. ఇది నన్ను మెరుగ్గా మారడానికి ప్రేరేపించింది. ఎందుకంటే నేను మెరూన్ రంగులో ఒక ముద్ర వేయాలని, ఇతరులకు ప్రేరణగా మారాలని కోరుకున్నాను' అని రస్సెల్ పేర్కొన్నాడు. రస్సెల్ 2019 నుంచి టి20 స్పెషలిస్ట్ ప్లేయర్‌గా రాణిస్తున్న రస్సెల్.. వెస్టిండిస్ తరఫున 84 టి20 మ్యాచుల్లో 22.00సగటు, 163.08 స్ట్రైక్ రేట్‌తో 1,078 పరుగులు చేశాడు. ఇందులో మూడు అర్ధ సెంచరీలు ఉన్నాయి. అతని అత్యుత్తమ స్కోరు 71 పరుగులు. 30.59 సగటుతో 61 వికెట్లు తీసుకోగా.. అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు 3/19. విండీస్ తరఫున ఒకే ఒక్క టెస్టు మాత్రమే ఆడాడు. 56 వన్డేల్లో 27.21 సగటుతో 1,034 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు అర్ధ సెంచరీలు ఉండగా.. అత్యధిక స్కోర్ 92. వన్డేల్లో 31.84 సగటుతో 70 వికెట్లు పడగొట్టాడు. అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు 4/35. రస్సెల్ 2012, 2016లో ఐసీసీ టీ20 ప్రపంచ కప్‌లను గెలుచుకున్న వెస్టిండీస్ జట్టు సభ్యుల్లో ఒకడు. ఆయా దేశాల్లో జరిగే లీగ్‌లలో మాత్రం ప్రాతినిధ్యం వహిస్తానని తెలిపాడు.

రెండోరౌండ్‌లో ఓడిన లక్ష్యసేన్

సాత్విక్–చిరాగ్ జోడి కూడా..

జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

టోక్యో: జపాన్ ఓపెన్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్లకు నిరాశ తప్పలేదు. తొలిరోజు మహిళల సింగిల్స్‌లో పివి సింధు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా.. రెండోరౌండ్‌కు చేరి ఆశలు రేపిన లక్ష్య సేన్, సాత్విక్–చిరాగ్ రెండోరోజే ఇంటిదారి పట్టారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఎనిమిదో ర్యాంకర్ లక్ష్యసేన్ స్థానిక ఆటగాడు కొడాయ్ నరొకా చేతిలో 19–21, 11–21తో ఓడాడు. డబుల్స్ విభాగంలో ఫేవరెట్లుగా బరిలోకి దిగిన సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి ద్వయం రెండో రౌండ్‌లో ఐదో సీడ్ జంట ధాటికి చేతులెత్తేసింది. హోరాహోరీగా జరిగిన పోరులో లియాంగ్ వీ కెంగ్–వాంగ్ చాంగ్(చైనా) జంటకు బదులివ్వలేకపోయింది. తొలి సెట్‌లో గట్టిగానే పోరాడినా.. 22–24తో వెనకబడింది. రెండో సెట్‌లో పుంజుకుంటారనుకుంటే బలహీనమైన డిఫెన్స్ కారణంగా 14–21తో ఓటమి చవిచూసింది. ఈ పరాజయంతో చైనీస్ షట్లర్లు భారత స్టార్లపై తమ విజయాల ఆధిక్యాన్ని 7–2కు పెంచుకున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68